
ఆణిముత్యాలు
2008
కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - 9440652774

కె. సుదర్శన్ - 9247805058

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు - 2008

కస్తూరీ బెహెన్

# లక్నో యాత్ర

**6.10.2008**వ తేదీ నుండి **8.11.2008**వ తేదీ వరకు ఎందరో సహజమార్గ అభ్యాసులు ప్రపంచం నలుమూలల నుండి సోదరి కస్తూరీగార్ని లక్నోలో దర్శించుకున్నప్పుడు -మానవజన్మ సాఫల్యతకై చేసే అన్వేషణలో ఎదురయ్యే సమస్యలను 'బాబూజీ' ప్రేమతో ఎలా దాటేయవచ్చో చూపిన వివరణల పొత్తమిది.

గమనిక: **2010**వ సంవత్సరంలో డెన్మార్క్ అభ్యాసులు అడిగిన ప్రశ్నలకు కస్తూరీ బెహెన్ జవాబులు, సూచనలు కొన్నింటిని, **3.09.1987**వ తేదీనాటి సందేహాల నివృత్తి కూడా ఈ పుస్తకంలో పొందుపర్చబడ్డాయి.

# ఆణిముత్యాలు - 2008

బాబూజీ మహరాజ్ ఎప్పుడూ "ధ్యానంలోకి గాఢంగా (లోతుగా) వెళ్ళండి- మళ్ళీ వెనుకకు తిరిగిరానంతగా" అని చెప్తూ ఉండేవారు. నాకు అప్పుడు అది అర్థంకాలేదు. నేను బాబూజీకి ఈ విషయమై ఉత్తరం వ్రాశాను. అప్పుడు బాబూజీ నాకు ఆ విషయం బోధించారు. అది ఒక స్థితి అనీ, దానిని ఎలా పొందాల్సి ఉంటుందో వివరించారు. అది ఎలా అంటే, ధ్యాన సమయంలో మొట్టమొదట బాబూజీ మహరాజ్ మనలోనే ఉన్నారని సంకల్పం చేసుకోవాలి. బాబూజీ మన హృదయంలోనే ఉన్నారని అనుభూతి చెందగా మన హృదయం, ఆత్మ కూడా వారి పావన చరణాలవద్దనే ఉన్నట్లుగా గ్రహిస్తాం. ఆ స్థితి కలిగిన తర్వాత ఇంక ప్రతిసారి అటువంటి ఆలోచన చేయాల్సిన అవసరం ఉండదు. బాబూజీ మహరాజ్ మన హృదయంలోనే ఉన్న అనుభూతిని పొందుతూ ఉన్నప్పుడు తిరిగి మరో ఆలోచన ఉండదు. అప్పుడు మన జ్ఞాపకంలోనే ఉండి వారిలోనే మనం ప్రవేశించినట్లుగా అనిపిస్తుంది. **ధ్యానంలో కూర్చోవటం అంటే, బాబూజీలోకి ప్రవేశించటమే అని అర్థం. ధ్యానం యొక్క అర్థం ఇదే, అని బాబూజీ చెప్పారు.** ధ్యానం అంటే దానిలో ఏదో పొందవలసి ఉంటుందని కూడా బాబూజీ చెప్పారు. కనుక మొదట దైవం మనలో ఉన్నాడని అనుకుంటాము. తర్వాత బాబూజీయే మన హృదయంలో ఉన్నారని అనుకుంటాము. ఎప్పుడైతే ఆ భావం నిజ అనుభూతిగా మారుతుందో, అప్పుడు దైవం యొక్క 'ఆలోచన' అనే భావన ఉండదు. ఆలోచన అనేది అనుభూతిగా మారిపోవాలి. ఎప్పుడైతే బాబూజీకి ఇంకా ఇంకా సమీపంగా వెళ్ళతామో అప్పుడు వారి దివ్యాకర్షణ మనల్ని ముందుకు తీసుకుపోతుంది. అప్పుడు 'వారి' రూపం కూడా మన దృష్టిలో ఉండదు. అలా జరిగినప్పుడు మనం హృదయ మండలం దాటిపోయినట్లుగా భావించుకోవాలి. ఈ విధమైన శిక్షణనే బాబూజీ నాకు ఇచ్చారు. ధ్యానంలో లోతుగా మునిగిపోవటం యొక్క ప్రయోజనం ఇదే.

**ప్రశ్న: బెహెన్‌జీ! లయావస్థ ఎప్పుడు, ఎలా కలుగుతుంది?**

**జవాబు:** ఆలోచన కలగ్గానే అనుభూతి పొందటానికి ఎదురుచూడాలి. అప్పుడు లయావస్థ ప్రారంభమై బాబూజీలో కలిసిపోతున్నట్లుగా ఉంటుంది. శారీరక స్పృహ లేకపోవటం లేదా కోల్పోవటంగా జరుగుతుంది. బాబూజీ మాత్రమే అనగా దైవం మాత్రమే ఉన్నట్లుగా అనిపిస్తుంది. నది సముద్రంలోకి ప్రవేశించి ఇంక బయటపడనటువంటి స్థితి కలుగుతుంది. బాబూజీ యొక్క సామీప్యత పెరుగుతున్నట్లుగా ఉంటుంది. మనలో ఉన్న స్మరణ, ప్రేమకొద్దీ వారి హృదయాన్ని తాకటం జరుగుతుంది. అనగా మన ఆత్మనాదం దైవాన్ని స్పృశిస్తుంది అని బాబూజీ చెప్పారు. మన ఉనికిని మర్చిపోవటం, లయావస్థ ప్రారంభం కావటం జరుగుతుంది. ఆ స్థితి ఎలాంటిది అంటే, నది సముద్రంలో విలీనమైపోయినటువంటి స్థితి.

నది సముద్రంలో విలీనమై ఏ విధంగా బయటకు రాలేదో అదే విధంగా మనం లయావస్థ చెందినప్పుడు వారిలోనే ఉంటాము. ఆనందాన్ని అనుభూతి చెందుతూ ఉంటాము. వారి స్మరణ గురించిన మన ఆలోచన హృదయంలోకి చొరబడి బాబూజీ సామీప్యతను అనుభవిస్తుంది.

బాబూజీ యొక్క స్మరణను కలిగి ఉండటం ఎలా ఉంటుంది అంటే, మనం ఏవైనా చెడుమాటలు విన్నప్పుడు అవి మన హృదయాన్ని తాకుతాయి. అదే విధంగా మనలో బాబూజీ యొక్క స్మరణ కలిగినప్పుడు, అది మన హృదయాంతరాళంలోని బాబూజీని తాకినట్లుగా అనుభూతి కలుగుతుంది. వారిపట్ల మనకు ఉన్న ప్రేమ అలా స్పందింపజేస్తుంది. అనగా బాహ్యప్రపంచానికి చెందినవైతే హృదయానికి, ఆధ్యాత్మికతకు చెందినవైతే హృదయాంతరాన్ని స్పర్శిస్తాయి. దీనినే బాబూజీ– నీ హృదయార్తి దైవాన్ని తాకుతుంది అని చెప్పారు.

మన ప్రార్థనలోని ప్రతి శబ్దం దివ్యత్వంతో కూర్చబడి ఉందని బాబూజీ చెప్పారు. మనం ప్రార్థనకు ఉపక్రమించినప్పుడు బాబూజీ సామీప్యతను అనుభూతి చెందుతాం. అప్పుడు మనం ఏమి కావాలనుకుంటున్నామో, ఎలా కావాలనుకుంటున్నామో –వాటి ధ్యాస కూడా లేకుండాపోతుంది. ఆ విధంగా మన ప్రార్థన అను స్పర్శ బాబూజీని తాకుతుంది. అటువంటి సందర్భంలో, నా హృదయం బాబూజీతో ఏదో విన్నవించుకుంటున్నట్లుగాను, బాబూజీ ఏదో చెబుతున్నట్లుగాను అనుభూతి చెందుతాను. అది ప్రాపంచికంగా జీవించటానికి సంబంధించినది లేదా ఆధ్యాత్మిక జగత్తులో జీవించటానికి సంబంధించినదిగా ఉంటుంది. బాబూజీ అందరినీ ప్రేమిస్తున్నారు, కనుక 'వారి'ని మన హృదయంలో నిలుపుకొని, 'వారి'ని ప్రేమిస్తే మనలో కలిగిన ప్రేమతో వారిని చేరుకోవటం చాలా సులభమే. అది తీవ్రంగా ఉన్నప్పుడు మనల్ని మనం స్వయంగా మర్చిపోతాం.

**ప్రశ్న: స్మరణ (రిమెంబ్రన్స్) అంటే ఏమిటి?**

**జవాబు:** "అందరిలోను దైవం ఉన్నాడు–అనే విషయాన్ని అందరు జ్ఞాపకం ఉంచుకోవాలి" అని బాబూజీ చెప్పారు. కాని మీరు మీలోనే ఉన్న ఆ దైవాన్ని మర్చిపోతున్నారు. ఆ జ్ఞాపకాన్ని కలిగి ఉంటే, దైవంతో మీ సంబంధం నిలిచి ఉంటుంది.

ఒక అభ్యాసీ బాబూజీతో "నేను 6 సంవత్సరాలుగా నాలో దివ్యకాంతి ఉన్నట్లుగా భావించుకుంటున్నాను" అని చెప్పాడు. బాబూజీ దానికి సమాధానంగా "నీవు దివ్య ప్రకాశంలో జీవిస్తూనే దాన్ని గురించి ఎందుకు ఆలోచిస్తున్నావు? నీవు మొదటిగా ఆ దివ్య ప్రకాశం ఎక్కడి నుండి వస్తుందో ఆలోచించు" అన్నారు.

బాబూజీ జ్ఞాపకంతోనే మీరు జీవిస్తూ ఉంటే, ఆ దివ్యకాంతి దైవం అనగా బాబూజీ నుంచే వస్తోందని మీరు గ్రహిస్తారు. కనుక ఆ దివ్యకాంతిలో ఆ దైవాన్ని అనగా బాబూజీని చూడగలగాలి. మీ అంతర్ దృష్టితోనే దైవాన్ని చూడగలరు కాని, బాహ్యదృష్టితో చూడలేరు.

**"దైవం నీలోనే ఉండగా దైవానుభూతికి బదులు దైవాన్ని గురించి చర్చించుకోవటం ఎందుకు" అని బాబూజీ అన్నారు**. కనుక ఇప్పుడు– బాబూజీని ఎలా ప్రేమించాలి, 'వారి' సామీప్యతను ఎలా సాధించుకోవాలి, 'వారి'ని ఎలా చేరగలగాలి? అనే దానిని గురించి ప్రశ్నించుకోవాలి. దీనికి సమాధానం కూడా దానిలోనే ఉంది. బాబూజీ అందరినీ ప్రేమిస్తారు కనుక నీవు 'వారి' ప్రేమను పొందగలవు. హృదయంలో 'వారి' సామీప్యతను అనుభూతి చెందాలి. అందుకోసం ప్రయత్నిస్తే క్రమంగా దానిని పొందటంతోపాటు

నీ హృదయం 'వారి' కోసం తపిస్తుంది. ఆ తపన ద్వారా నీకు 'వారి'తో సంబంధం ఏర్పడుతుంది. అప్పుడు ఆ ప్రేమలో నీ హృదయం పులకిస్తుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! అంతర్ దృష్టి అంటే ఏమిటి?**

**జవాబు:** ఈ అంతర్ దృష్టి కలిగిన సందర్భంలో నీవు అక్కడ ఉంటావు, కాని నీ శరీరం అక్కడ ఉండదు. అనగా నీ ఉనికి తెలియదు. నీ దృష్టికి బాబూజీమినహా మరేదీ గోచరించదు. అలాకాకుండా ఇంకేదైనా చూడగలిగినట్లయితే అది అంతర్ దృష్టి కాదు. ఆ విధంగా దైవాన్ని మాత్రమే– బాబూజీనే దర్శించగలిగిన స్థితియే, అది అవుతుంది. 'వారు' అనుగ్రహించదలచినప్పుడు మాత్రమే అది కలుగుతుంది. ఈ దివ్యమైన దృష్టి ముగిసిన తర్వాత కలిగే స్థితి మూలంగా ఎవరితోనైనా అభ్యాసులతో మాట్లాడేప్పుడు కూడా బాబూజీ దర్శనమే కలుగుతూ ఉంటుంది. నేను నా తల్లిగారితో మాట్లాడేప్పుడు కూడా ఎదుట బాబూజీ ముఖారవిందం కనిపించి వెనుక మా తల్లిగారి రూపం కనిపించేది. అంటే ఒకవైపు బాబూజీ రూపం మరోవైపు ఆమె రూపం కనిపించేవి. నేను మీతో మాట్లాడుతున్నప్పుడు ముందుగా బాబూజీ ముఖమే కనిపించేది. తర్వాతనే మాటలు పలికేవి. అప్పుడు బాబూజీ కళ్ళతోనే మనం సమస్త విశ్వాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. బాబూజీని నేను ఎంతగా ప్రేమిస్తున్నానంటే, 'వారు' కాకుండా మరేదీ నా దృష్టికి రాదు.

ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో, "మేము మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాము. అలాగే మీరూ మమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నారా? అని తెలుసుకోవాలని ఉంది" అని అన్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌గారితో, "నేను మిమ్మల్ని తలచుకుంటున్నాను– అనే దానిలో 'నేను' అనేది భావనలోకి రాకూడదు. ఆ ఆలోచన ఉండకూడదు. అప్పుడే నీకు ప్రేమ సంబంధం కలుగుతుంది. ఇంక అక్కడ నీవు ఉండవు. నాకై నేను మాత్రమే ఉంటాను" అని చెప్పారు బాబూజీ. ఆ అనుభవమే మనం 'వారి' జ్ఞాపకంలో ఉన్నామనుకోవటానికి నిదర్శనం.

**ప్రశ్న: (ఒక అభ్యాసీ) బాబూజీ నా తలపైన 'వారి' అభయహస్తం ఉంచినట్లుగాను, ఒక నెల రోజులు అలాగే అనిపించి తర్వాత నేను మరిచిపోయినట్లుగాను అనిపించింది, ఎందుచేత?**

**జవాబు:** నీవు మరచిపోయావు అని అనుకుంటున్నావు. నీ ధ్యాస అంతా నిత్యజీవిత కార్యక్రమంలో మునిగిపోయింది. నీవు ఇంటిపనులు చేస్తున్నా, ఆఫీస్ పని చేస్తున్నా మనస్సు వాటిమీద లగ్నమై ఉంటుంది, కాని హృదయం బాబూజీలోనే లగ్నమై ఉంటుంది. అందుచేత మరచిపోయాను అను భావన సరైనది కాదు. ఒకసారి స్థితి అంటూ కలిగాక అది తొలగిపోదు. ఆ స్థితి నీకు కలిగాక దాని నుంచి వేరుపడిపోవటం లేదా తొలగిపోవటం ఉండదు. కనుక మరచిపోతున్నాను, అను భావన రానివ్వకుండా, 'వారు' నీలోనే ఉన్నారనే భావన పెంచుకోవాలి. "నేను వారితోనే కలిసి ఉన్నాను. వారికే సమర్పితమైపోయాను" అనే భావనలో మునిగిపోయి, ఆ 'నేను' అనుదానిని మర్చిపోయి 'వారి' జ్ఞాపకాన్నే నిలుపుకోవాలి. మరపు అనేది మైండ్‌ది, కాని హృదయానిది కాదు. బాబూజీ ఒక అభ్యాసీని గురించి చెప్తూ– నీవు నాకు పూర్తిగా సమర్పితమయ్యావు అని అంటున్నావు, కాని నీయొక్క సెల్ఫ్ నీ దగ్గరనే ఉంది, అది నాకు సమర్పితమవ్వలేదు –అని అన్నారు. ఏ పని చేస్తున్నప్పటికీ దానిని 'నేను' చేస్తున్నాను అని తలంచకుండా బాబూజీ అప్పగించిన

విధి (డ్యూటీ) నిర్వహిస్తున్నట్లుగా భావించి, వారినే మనస్సులో నిలుపుకుంటే ఆ 'నేను' అనేది ఉండదు. బాబూజీ నావారే, నావారే అనే ఆత్మీయ స్మరణతో నీ హృదయం నిండిపోతుంది.

పురోగతి (ప్రోగ్రెస్) అందరిలోనూ ఉంటుంది. కాకపోతే అప్పుడప్పుడు మీ మనస్సులో దాని గురించిన ఆలోచన రావచ్చు. ఏదో వెలితిగా తోచినప్పుడు హృదయం వ్యథ చెందుతుంది. ఆ వ్యథ హృదయంలో కలుగుతుంది, కనుక అది హృదయ మండలానిది. ఆ వ్యథ యొక్క అనుభూతి మనస్సుకు కలుగుతుంది. కనుక అది మనోమండలానికి చెందినది అవుతుంది. అలాంటి తపన లేదా వేదన కలిగినప్పుడు బాబూజీని స్మరించుకోవాలి. నేను ఎప్పుడూ హృదయ మండలం, మనోమండలం –వీటిని గురించి ఆలోచించలేదు. ఇవన్నీ బాబూజీ పరిశోధనకు చెందిన అంశాలు. శరీరం మైండ్‌తో జీవిస్తుంది, హృదయం బాబూజీతో జీవిస్తుంది. బాబూజీని మరచిపోయినప్పుడు హృదయం విలపిస్తుంది. ఆధ్యాత్మిక యాత్రలో బాబూజీ నాచేత అన్ని పాయింట్లను (బిందువులను) దాటించారు. ఇది 'వారి' పరిశోధనకు చెందిన విషయం. మనంతట మనం ఏ ఒక్క పాయింట్ దాటలేం. నేను నాకు కలిగిన స్థితులను తెలియజేసినపుడు 'వారు' ఆ బిందువుల గురించి చెప్పారు. నేను పుస్తకాలు వ్రాసేటప్పుడు వాటిని చిత్రాల ద్వారా చూపించేవారు. ఏదైనా బిందువును దాటాలంటే 'వారి' సంకల్ప శక్తి ద్వారానే దాటగలుగుతాం.

ప్రోగ్రెస్ అందరికీ ఉంటుంది. అందరినీ అంతిమం చేర్చాలనేదే 'వారి' సంకల్పం. మొదటి సిట్టింగ్‌లోనే 'వారు' మనకు శక్తినిచ్చి నడిపిస్తున్నారు. ఎవరినీ వదిలిపెట్టరు. బాబూజీ అందరినీ సెంట్రల్ రీజియన్‌కి చేర్చటానికే ఎదురుచూస్తూ ఉంటారు. 'వారి' దివ్యశక్తిని ఎవ్వరూ అడ్డగించలేరు. బాబూజీ నన్ను సెంట్రల్ రీజియన్‌కు చేర్చారు. 'వారు' మనల్ని ఎక్కడికి చేర్చితే అక్కడ ఉండటం, ఆ స్థితిలో నిమగ్నమై ఉండటం, మన కర్తవ్యంగా ఉండాలి.

**ప్రశ్న: నేను ఒక్కొక్కసారి మందకొడిగా ఉంటాను. అది ఒక స్థితి అయి ఉంటుందా?**

**జవాబు:** అది స్థితి కాదు. నాకు, నా మనస్సు ఎప్పుడూ బాబూజీతోనే ఉంటుంది. ఎప్పుడూ క్రియాశీలంగానే ఉంటుంది. అలా మందకొడిగా ఉండే అవకాశమే లేదు. అందుచేత ఎవరూ మందకొడిగా ఉండలేరు. ఒకవేళ అలా అనిపిస్తుందంటే, అది శారీరక బలహీనత మాత్రమే. దాని వలన మనస్సుకు అలా అనిపిస్తుంది. అందుచేత ఆ సందర్భంలో బాబూజీని స్మరించుకుంటే మళ్ళీ శక్తి వస్తుంది. అశక్తత తొలగిపోయి ఆ శక్తితో మళ్ళీ పని చేయగలుగుతారు. ఇది నా అనుభవం కూడ.

**ప్రశ్న: బెహెన్‌జీ! ప్రిసెప్టర్ అభ్యాసి స్థితిని ఎలా తెలుసుకొనగలుగుతారు?**

**జవాబు:** ప్రిసెప్టర్‌గా మీరు మీ స్థితిని తెలుసుకునే పద్ధతి అంటూ ఏదీ లేదు. "ప్రిసెప్టర్‌గా నీవు నీ పని నిర్వహించేటప్పుడు అప్రమత్తంగా (మెలకువగా) ఉండు" అని బాబూజీ చెప్పారు. ప్రిసెప్టర్‌గా సిట్టింగ్ ఇస్తున్నప్పుడు బాబూజీ శక్తి (దివ్యశక్తి) మూలకేంద్రం నుంచి వచ్చేటటువంటి శక్తియే పని చేస్తున్నట్లుగా భావించుకోవాలి. అప్పుడే బాబూజీ యొక్క శక్తి సద్వినియోగమవుతుంది. ఆ శక్తి మీద నమ్మకం కలగాలి. అందుచేత మొదట బాబూజీ యొక్క దివ్యశక్తిని వేడుకోవాలి. అప్పుడు నీ హృదయం ఆ దివ్యశక్తి కేంద్రంతో సంధానించబడుతుంది. బాబూజీ అనుజ్ఞతో ఆ శక్తి పనిచేస్తుంది. బాబూజీపట్ల భక్తి, విశ్వాసం

ఎంతగా ఉంటే, నీవు చేస్తున్న పనిమీద నమ్మకం అంతగా వృద్ధి చెందుతూ ఉంటుంది. బాబూజీ యొక్క శక్తి పనిచేసే స్థితి కూడా తెలుస్తుంది. అదే విధంగా అభ్యాసీ యొక్క స్థితిని తెలుసుకొనగల సత్తా కూడా దానంతట అదే వస్తుంది. అందుచేత భరోసా (కాన్ఫిడెన్స్) యొక్క పాత్ర చాలా ముఖ్యమైనదిగా ఉంటుంది. నమ్మకం భరోసా (భారం భరించే ఆధారం)గా మారుతుంది. ఈ నమ్మకం బాబూజీ యొక్క శక్తిని స్పర్శించగానే మరింతగా బలాన్ని పుంజుకుంటుంది. ఇది బాబూజీపై భరోసాగా అయి 'వారి' శక్తి ప్రవాహం నుండి శక్తిని తీసుకుని సొంతం చేసుకోవడమూ, దానిపై ఆధిపత్యం సాధించడమూ జరిగిపోతుంది. ఇటువంటి భరోసా నాలో ఏర్పడినప్పుడు అది నాదిగా అనిపించలేదు. దివ్యకార్యం కొరకు బాబూజీ ఆ దివ్యశక్తిని ఇస్తున్నారు. కనుక ఆ శక్తితో బాబూజీ తలపెట్టిన ఆ పని జరుగుతున్నట్లుగా భావించుకోవాలి. దానితో అభ్యాసీ హృదయం నిర్మలమై దివ్యత్వం చెందుతున్నట్లు అనుభూతి చెందాలి. ఈ విధంగా ప్రేమ, భక్తిని పెంచుకొని 'వారి' శక్తితో సంబంధం ఏర్పరుచుకున్నప్పుడు అభ్యాసీ హృదయం యొక్క స్థితి నీ కళ్ళెదుట ఉంటుంది. నేను అభ్యాసీ స్థితిని నా స్వంత నేత్రాలతో కాకుండా బాబూజీ నేత్రాలతోనే చూస్తాను. ఆ శక్తిని ఆ దివ్యశక్తి కేంద్రం నుంచి బాబూజీయే నాకు ప్రసాదించారు. ఆ దివ్యకార్యం నిర్వహించేటప్పుడు సావధానంగా ఉండాలి. బాబూజీ చెప్పినట్లుగా మీరు ఏదైనా భుజిస్తున్నారంటే దానిమీద ధ్యాస కలిగి ఉంటారు. దాని రుచిని మీరు తెలుసుకుంటారేగాని ఎదుటివారిని దాని రుచి గురించి ప్రశ్నించరు. అలాగే స్వానుభవం ద్వారా మీకు అ గ్రహణశక్తి అనుభవానికి వస్తుంది. ఆరంభంలో నాకు కూడా అంత విశ్వాసం కలగలేదు, కాని క్రమక్రమంగా వృద్ధి చెందింది. సిట్టింగ్ ఇచ్చినప్పుడు అప్రయత్నంగానే అభ్యాసీ యొక్క స్థితి కనిపించసాగింది. ప్రిసెప్టర్‌కు అభ్యాసీపట్ల ప్రేమ, సేవ చేస్తున్నానన్న భావన కలిగి ఉంటే, అది బాబూజీకి నివేదించినట్లు అవుతుంది. ఒక ఉత్తమ అభ్యాసీని అందించటమే బాబూజీకి అర్పించే మంచి సమర్పణ అవుతుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! తాత్కాలిక అనుమతికీ సంపూర్ణ అనుమతికీ గల భేదం ఏమిటి? What is the difference between Provisional Permission and Full Permission?**

**జవాబు:** ప్రిసెప్టర్‌కు అనుమతి ఇచ్చినప్పుడు అతడు ఇచ్చే సిట్టింగ్‌లో వచ్చే ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ఆ దివ్యశక్తి కేంద్రం నుంచి మాత్రమే వస్తుంది. కాని దాని పనితనంలో కొంత తేడా ఉంటుంది. ఎందుకంటే, తాత్కాలిక అనుమతి అనుదానిలో ఆ శక్తి యొక్క వినియోగం పరిమిత పరిమాణానికి చెందినదిగా ఉంటుంది. పూర్తి అనుమతి అయినప్పుడు ఆ శక్తిని వినియోగించటానికి పరిమితి ఉండదు. బాబూజీని నేను, "మీరు పరిపూర్ణమైన ప్రిసెప్టర్‌ను చేసేటప్పుడు వివేకులైనవారి సలహా తీసుకున్నారా?" అని అడిగాను. దానికి సమాధానంగా బాబూజీ నవ్వి, "దివ్యశక్తి ఒక్క బిందువైనా సరే పరిపూర్ణమైనదిగా ఉంటుంది" అని అన్నారు. కనుక అనుమతి ఇవ్వబడినప్పుడు దివ్యశక్తి సమకూర్చబడుతుంది, కాని పరిమితిలో తేడా ఉంటుంది. ఒక అభ్యాసీకి నా ఇంటిలో సిట్టింగ్ ఇవ్వమని కోరినప్పుడు నేను ఇస్తాను. కాని ఆ అభ్యాసీకి, అన్యదేశస్థుడైన మరో అభ్యాసీకి ఇచ్చిన సిట్టింగ్‌లో కొంత తేడా ఉంటుంది. ఎందుకంటే, ఆ పరదేశీయుని పూర్వస్థితి, అతని జీవనశైలి యొక్క పరిచయం లేకపోవటంవలన అతనికి ఇచ్చిన సిట్టింగ్ సంతృప్తికరంగా ఉండకపోవచ్చు.

ప్రిసెప్టర్‌గా అనుజ్ఞ (అనుమతి) ఇచ్చినప్పుడు శక్తిని కూడా వారే ప్రసాదిస్తారు. నాకు అనుమతి నిచ్చినప్పుడు, నేను సిట్టింగ్ ఇస్తున్న సమయంలో ఒక యోగి నా ప్రక్కనే కూర్చుని ఉన్నట్లుగా అనిపించేది. ఈ విషయం బాబూజీతో ప్రస్తావించినప్పుడు అది నిజమే అని అన్నారు. ఆ యోగి రూపంలో 'వారు' మన ఆలోచనను తెలుసుకోగలరు. మనం ఎల్లప్పుడూ దివ్యత్వంతో సంధానించబడి ఉన్నామని సాధన చేయాలి. దానివలన మన విశ్వాసం పెరిగి దానిని అనుభూతి చెందుతాం.

**ప్రశ్న: అభ్యాసీ తన ఆధ్యాత్మిక స్థితిని గురించి ప్రిసెప్టర్‌కు వివరించాల్సి ఉంటుందా? అలాగే అభ్యాసీ స్థితిని గురించి ప్రిసెప్టర్ వారికి (అభ్యాసీకి) చెప్పవలసి ఉంటుందా?**

**జవాబు:** అభ్యాసీ యొక్క స్థితి అనేది హృదయ పరివర్తన, ఆలోచనా సరళి, జీవనశైలికి చెంది ఉంటుంది. అందువలన వాటి విషయంగా తమలో మార్పును ప్రిసెప్టర్ గమనించారా అని అడగవచ్చు. చారిగారి జన్మదినోత్సవాలు జరిగిన తర్వాత ఒక బాచ్‌లోని అభ్యాసులు నా దగ్గరకు వచ్చి సిట్టింగ్ ఇమ్మని కోరారు. నేను సిట్టింగ్ ఇచ్చిన తర్వాత వారికి ఎటువంటి అనుభవం కలిగిందని నేను ప్రశ్నించాను. "బెహెన్‌జీ! మీరు మా అనుభూతి గురించి అడుగుతున్నారా!" అని ఆశ్చర్యపోయారు. తిరిగి, వారు చాలా ఆనందంతో 'బాగుంది' అని చెప్తూనే తమ సెంటర్‌లో ఇటువంటి ట్రాన్స్‌మిషన్ పొందలేకపోతున్నట్లుగా చెప్పారు. అంతేగాకుండా వాళ్ళ ప్రిసెప్టర్స్, అభ్యాసుల కండిషన్ గురించి వారిని అడగరాదని ఆదేశిస్తున్నట్లుగా కూడా చెప్పారు. దీనినిబట్టి ఆ ప్రిసెప్టర్స్, ట్రాన్స్‌మిషన్ ఇవ్వలేకపోతున్నారని, వారు ఏమీ ఇవ్వలేకపోయినప్పుడు, కండిషన్ (స్థితి) గురించి ఏమని అడగ్గలరని చెప్పాను. "నేను ఇవ్వగలిగాను కనుక మీ స్థితి గురించి చెప్పగలుగుతున్నాను" అని అన్నాను. బాబూజీ యొక్క శక్తి పనిచేస్తోంది కనుక, ఎలాంటి అనుభవం కలిగిందని ప్రశ్నించగలుగుతాము. ప్రిసెప్టర్ అభ్యాసీతో అతని స్థితి బాగుందని చెప్తే అభ్యాసీకి శక్తి, ప్రోత్సాహం, ధైర్యం –అన్నీ సమకూరతాయి. బాబూజీ సమస్తమూ ఇస్తున్న దాని మూలంగా ప్రిసెప్టర్లు, అభ్యాసులు కూడా లాభం పొందుతారు. కనుక అభ్యాసుల స్థితి గురించి ప్రిసెప్టర్ వాకబు చేయాల్సిన అవసరం ఉంది. నేనే కాదు, శ్రీరామచంద్ర మిషన్‌లో ఉన్న ఏ ప్రిసెప్టర్ అయినా ఆ పని చేయాలి. వేరే అభ్యాసులకు నేను గ్రూపు సిట్టింగ్ ఇచ్చినప్పుడు ఏ ఒక్కరూ కూడా ట్రాన్స్‌మిషన్ పొందలేకపోయారు. నేను అప్పుడు ఇలా ప్రార్థించాను: "బాబూజీ మహరాజ్! వీరందరూ ట్రాన్స్‌మిషన్ పొందాలని ఇక్కడకు వచ్చారు. వీరిపై మీ దయ చూపండి" అని. ఆ తర్వాత నా పని నన్ను చేయమన్నట్లు నా మనస్సులో అనిపించింది. శ్రీరామచంద్ర మిషన్‌లో చేరినవారు ప్రాణాహుతి పొందుతారు. నేను బాబూజీ మహరాజ్ ప్రెజన్స్ (ఉనికిని) అనుభూతి చెంది, అప్పుడు వారికి (అభ్యాసులకు) ఆ దైవంతో కనెక్షన్ కల్పించి ట్రాన్స్‌మిషన్ ఇవ్వదలచాను. అప్పుడు ఆత్మ బాబూజీతో కనెక్షన్ పొందింది. ఆ విధంగా ఆత్మ ఆ దివ్యశక్తిని పొందింది. కాని (Bondage) బంధనం మాత్రం తొలగిపోలేదు. ఈ ఆలోచన ద్వారా ట్రాన్స్‌మిషన్ జరిగింది. ఆ శక్తి యొక్క ఛాయ, కొంత వెలుగు కనిపించాయి.

**దివ్యశక్తి కేంద్రంతో సంధానించబడనటువంటి వారెవరితోనైనా మీరు కనెక్షన్ ఏర్పరచుకుంటే మీరు పొందేది ఏమీ ఉండదు.**

బాబూజీ నన్ను ప్రిసెప్టర్‌గా చేసిన మూడు సంవత్సరాల తర్వాత "నేను పని చేస్తున్నప్పుడు మీ కృపవలన ఆ పని జరుగుతున్నట్లుగా తెలుస్తోంది" అని నేను వ్రాశాను. అప్పుడే నన్ను బాబూజీ ప్రిసెప్టర్‌గా చేసినట్లు తెలుసుకోగలిగాను. ప్రిసెప్టర్‌గా చేసిన వెంటనే వారిచ్చే శక్తిని జీర్ణించుకోవటం సాధ్యపడదు. వారిపట్ల ప్రేమ, వారి స్మరణ మరియు వారితో కనెక్షన్ ఉన్నప్పుడు మాత్రమే దానిని జీర్ణించుకోగలుతారు. **ప్రిసెప్టర్, అభ్యాసీ వేర్వేరుగా భావించకూడదు. తాను ప్రిసెప్టర్ అనీ, ఎదుటివారు అభ్యాసీ అనీ భావనచేస్తే అది వేర్పాటుగా అయి బాండేజి (ఒక బంధనాన్ని అనగా పరిమితమైపోవటం) ఏర్పడుతుంది. అందుచేత ప్రిసెప్టర్ తానొక (దివ్య) సేవకుడిగాను, బాబూజీ తనకు సేవచేసే అవకాశం కల్పించినట్లుగాను భావించుకోవాలి.**

**ప్రశ్న: బెహెన్‌జీ! అనంతయాత్ర 900వ ఉత్తరంలో "అగోచరాలు కూడా నీవు గోచరించ (దర్శించ) గలవు" అని బాబూజీ మిమ్మల్ని అభినందించారు. అదేమిటో దయచేసి వివరించండి!**

**జవాబు:** మీరు ఈ ప్రశ్న అడగటం మూలంగా, మీలో ప్రతి ఒక్కరూ ఈ స్థితిని పొందగలిగేట్లు చేయమని బాబూజీని ప్రార్థించాను. ఎందుకంటే, వారు అందరికోసం ఈ భూమి మీదకు దిగివచ్చారు కనుక! ఇంకా వివరంగా చెప్పాలంటే, నేను ఇప్పుడు మాట్లాడుతున్నాను; వారు ఇక్కడ లేరు, ఉన్నారు అన్న ఆలోచన లేదు. కాని టచింగ్‌గా అనగా ఉన్నారన్న స్పృహ ఉంది. కాని కనిపించటం లేదు. కాని ఎప్పుడైతే స్మరణ ద్వారా వారి ఉనికి తలపుకు వస్తుందో వారు ఇక్కడ ఉన్నట్లుగానే అనిపిస్తుంది. ఎందుకంటే, దైవం సర్వవ్యాపి కదా! వారికి మానవాళిపట్ల ప్రేమ ఉంది, మానవాళిని ఉద్ధరించటానికే వచ్చారు. ఎప్పుడైతే ఇటువంటి ఆలోచన కలుగుతుందో, వారితో మనకు కనెక్షన్ ఏర్పడి వారి అటాచ్‌మెంట్ మూలంగా బాబూజీ మన ఎదుటనే, కుర్చీలో కూర్చుని మనల్ని ఆ అంతిమ సత్యం (రియాలిటి) దిశగా తీసుకుపోతున్నట్లు కనిపిస్తుంది. అగోచరమైనదాని దర్శనం అంటే ఇదే. దీనిని మాటల్లో వర్ణించటం సులభం కాదు.

నేను ఈరోజు ఉదయం ఇక్కడకు వచ్చేముందు, మీరందరూ బాగా పురోగతి చెందాలని, భోగ్ నుంచి విముక్తులై ముందుకు సాగిపోవాలని బాబూజీని ప్రార్థించాను. నేను ఏదైనా వ్రాస్తున్నప్పుడు, "నీ పురోగతి ఏమిటి?" అని ఎవరో అడిగినట్లు ఉంది. అప్పుడు నాకు అనిపించింది పురోగతి అను మాట ఆ స్థితికి సరైన పదం కాదని! మనస్సు లేదా బుద్ధితో కలిగే ప్రతి మాటను మనం వ్రాయలేము. ఆ విధంగా మైండ్ నుంచి వచ్చే మాటల్ని హృదయం అంగీకరించదు.

**ప్రశ్న: ఆపేక్ష – ఉపేక్ష లేదా అనుబంధం – నిరసన, ఈ రెండిటికిగల భేదం ఏమిటి? What is the difference between Attachment and Indifference?**

**జవాబు:** ఏదైనా చెడును గురించి చెబుతున్నట్లయితే అది (Indifference) ఉపేక్ష లేదా నిరసన (విముఖత్వం) అవుతుంది. (Attachment) ఆపేక్ష లేదా అనుబంధం అనేది భౌతికమైనది, అనగా శరీరానికి సంబంధించినది. కనుక రెండూ మంచివి కావు. ఎందుకంటే, వైరాగ్యం చెందాలంటే రాగద్వేషాలకు అతీతంగా ఉండాలి. అనుబంధం (ప్రేమ) అనేది దైవంపట్ల ఉండాలి. అందరిలోను బాబూజీ (దైవం) ఉన్నారు కనుక ఎవరిపట్లా విముఖత (ద్వేషం) ఉండకూడదు. రాగద్వేషాలకు అతీతంగా ఉండటమంటే ఎల్లప్పుడూ సమభావం కలిగి

ఉండటమే. అదే సామ్యగతి. నేను బాబూజీకి లేఖ వ్రాస్తూ నా స్థితిని గురించి ఇలా తెలిపాను: "అభ్యాసీలలో నేను మిమ్మల్నే చూస్తున్నాను. నాకు ఎవరిపట్ల ప్రేమగాని, నిరసనగాని లేవు" అని. ఇది ప్రేమ-ద్వేషం లేని సామ్యగతి, ఇదే వైరాగ్యం. బాబూజీ అందరిలో ఉన్నారు కనుక, బాబూజీని ప్రేమించేవారికి ద్వేషం కలగదు.

ఒకసారి ఈశ్వర సహాయ్‌గారు బాబూజీతో "విజయవాడలో నేను ఆ గదిలోకి వెళ్ళగానే గాఢనిద్ర ఆవహించినట్లయ్యింది" అని అన్నారు.

నేను (కస్తూరీజీ) విజయవాడ వెళ్ళినప్పుడు అదేమిటో తెలుసుకోవాలని అనుకున్నాను. ఆ ఇంట్లో అంతటా తిరిగాను. అంతటా బాబూజీ ఉనికిని, వారి హృద్యమైన స్మరణానుభూతిని చెందాను. అది హృదయంలోని ప్రేమానుభూతిగా తోచింది.

ఒకసారి ఒక సమావేశంలో ఒకామె ద్రాక్షపండ్లు బాబూజీ ముందు ఉంచుతూ, "ఇవి రుచికరంగా, మీకు బలం చేకూర్చేవిగా ఉంటాయి, తీసుకోండి" అంది. దానికి ప్రతిగా బాబూజీ "ఇవి నాకు సరిపడవు. అందుచేత నేను ఇష్టపడను" అని అన్నారు. అదే సమయంలో రెండో వరుసలో ఉన్న మరొకామె వచ్చి, "బాబూజీ, ఈ ద్రాక్షపండ్లు మీకోసం, అందరికోసం తెచ్చాను. మీరు తీసుకొని అందరికీ పంచండి" అని తను తెచ్చినవాటిని బాబూజీకి ఇచ్చింది. అప్పుడు బాబూజీ, "ఓహో ఇవా! నాకు ఇష్టమే ఇవి" అని అంటూ అవి తీసుకొని అందరికీ పంచారు. ఒకరు ఇస్తే ఇష్టపడటానికి, మరొకరు ఇస్తే నిరాకరించటానికి గల కారణం, అందరిపట్ల సమభావం ఒకరు ప్రదర్శిస్తే, మరొకరు ప్రత్యేక భావం ప్రదర్శించటమే! బాబూజీ అందరికీ పంచుతారేకాని స్వయంగా ఆశించరు.

కొన్ని సంవత్సరాలక్రితం ఒక తుఫాన్ రోజు రాత్రి బాబూజీ విజయవాడలో డాక్టర్‌గారి ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. తలుపు తీసిన తర్వాత లోపలికి వెళ్ళి "నాకు చాలా ఆకలిగా ఉంది" అన్నారు. అది దేహ సంబంధమైన ఆకలి కాదు. మనలో తపన ఉన్నప్పుడు ఆర్తిని తీర్చటానికి మన ద్వారం వద్దకు వస్తారు 'వారు'.

ఒకసారి వరదాచారిగారు బాబూజీతో "అందరూ దైవాన్ని కలవటానికి షాజహాన్‌పూర్ వస్తున్నారు. ఇది అందరికీ సాధ్యమా!" అని అడిగారు. దానికి సమాధానంగా "అందరూ భగవంతుడిని చూడాలని వస్తున్నారు. భక్తులను కలుసుకోవటం భగవంతుని బాధ్యత. వాళ్ళంతా తపనతో వచ్చారు కాబట్టి భగవంతుడు అక్కడ కూర్చొని ఉన్నాడు" అని అన్నారు. అనగా అభ్యాసులలో తపన ఉంటే దైవమే వారికోసం తరలివెళ్తాడు.

మనం ధ్యానంలో దివ్యజ్యోతి ఉందని అనుకున్నప్పుడు, దైవంతో కనెక్ట్ అవుతాము. అప్పుడింక ఆ లైట్ అనగా కాంతిని గురించిన ఆలోచన లేకుండా ఏమి ప్రత్యక్షమవుతుందో అని, దానికోసం ఎదురుచూడాలి. ఒకసారి ఒక అభ్యాసీ 6 సంవత్సరాలుగా ధ్యానంలో దివ్యకాంతిని గురించే తాను ధ్యాస ఉంచుతున్నట్లుగా బాబూజీతో చెప్పాడు. అప్పుడు బాబూజీ, ఆ అభ్యాసీతో "నీవు దివ్యకాంతిని గురించి ఆలోచిస్తున్నావేకాని (మననం చేసుకుంటున్నావే కాని) అది ఎక్కడి నుంచి వస్తోంది, దానికి మూలం ఏమిటి అని ఆలోచించటం లేదు" అని అన్నారు. మనం ఒక చీకటిగదిలోకి ప్రవేశించినప్పుడు కావలసినదానిని వెదకటం కోసం లైట్ వేస్తాము. తర్వాత ఆ వస్తువు కోసం వెదకటానికి ప్రయత్నం చేస్తామేకాని లైటునే మళ్ళీ మళ్ళీ వెలిగించటానికి ఆలోచన చేయము కదా!

అదే విధంగా దివ్యకాంతిలో ఆ దైవాన్ని దర్శించటానికి (వెదకటానికి) ప్రయత్నించాలి. **నేను బాబూజీకి లేఖ వ్రాస్తూ "నాకు మీ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మీరు నా ఎదుటనే ఉన్నట్లుగాను, నేను ఒక ఛాయ (నీడ) వంటి దానిలో ప్రవేశిస్తున్నట్లుగాను అనిపిస్తోంది" అని వ్రాశాను. అప్పుడు బాబూజీ దానికి బదులు వ్రాస్తూ "ఇది దివ్య మార్గం. దివ్యతేజం ప్రకాశిస్తూ ఉంటుంది.** నీవు ఆ దైవ మండలంలోనికి ప్రవేశించిన తర్వాత నెమ్మదిగా అంతిమ సత్యాన్ని (రియాలిటి)ని చేరుకుంటావు" అని వ్రాశారు.

మనం ప్రారంభంలో అనుకునే దివ్యజ్యోతి యొక్క దివ్యకాంతికి ఈ దివ్యకాంతికీ భేదం ఉంది. దీనినే బాబూజీ, 'నూర్‌చశ్మీ' (దివ్యతేజం) అనేవారు. ఆ 'నూర్‌చశ్మీ' స్థితి గురించి తెలియక నేను నా కళ్ళతో ఆ దివ్యకాంతిని (తేజాన్ని) చూసినప్పుడు కొంత అయోమయంలో పడ్డాను. ఆ స్థితి కలిగినప్పుడు ఒక గుహలాంటి దివ్యతేజస్‌లో ప్రవేశించి దానిలో మునిగిపోవటం, స్నానమాచరించటం జరిగిపోతుంది. "దైవీయ మండలాన్ని చేరుకున్నప్పుడు దివ్యత్వం నీకు దగ్గరగా ఉండి, దైవంతో అనుబంధం కలుగుతుంది" అని బాబూజీ వ్రాశారు. ఇంకా బాబూజీ మహరాజ్ నాకు వ్రాసిన లేఖలో "ఇంతకుముందు నీవు నన్ను చూస్తున్నట్లుగాను, నీ ఎదుట నేను ఉన్నట్లుగాను అనుభూతి చెందేదానివి. కాని ఇప్పుడు నీవే నా ఎదుట కనిపిస్తున్నావు" అని వ్రాశారు. ఇక్కడ భక్తికాని, స్థితికాని లేవు. కనుక దీక్షతో సాధనలో ఉన్న అభ్యాసులు ఎవరైనా సరే బాబూజీ మహరాజ్‌తో సంబంధం కలిగి ఉంటే అలాంటి వారందరూ కూడా ఈ 'నూర్‌చశ్మీ' స్థితిని పొందగలరని ఆశిస్తున్నాను.

ప్రిసెప్టర్ ఎప్పుడూ అభ్యాసీల కోసమే పనిచేస్తారు. అటువంటి (Thirst) ఆర్తిని నేను డాక్టర్ పార్థసారథిగారిలో చూశాను. అటువంటివారు చాలా అరుదుగా ఉన్నారు. వారు తమ గురించి కాకుండా అభ్యాసీల పురోగతి కొరకే తపన చెందుతూ ఉంటారు. ప్రిసెప్టర్లు, సెంటర్ నిర్వాహకులు అభ్యాసీల పురోగతి కోసం తపన చెందాలి. అప్పుడు వారు తమ స్థితిని, అభ్యాసీల స్థితిని చూడగలుగుతారు. కాని కొంతమందిలో అటువంటి తపన కనిపించటం లేదు. పట్టుదల ఉన్న అభ్యాసులు ఆ ఉన్నత దివ్యస్థితిని పొంది దానిని జీర్ణించుకోగలుగుతారు. అలా ఆర్తి, తపన ఉన్న ప్రిసెప్టర్లు అందుకు సహాయపడతారు. బాబూజీతో మీరు కనెక్షన్ పొందుతారు. ఇటువంటి ఫలితం కోసమే బాబూజీ దిగివచ్చారు కనుక సంతోషపడతారు. అభ్యాసుల ఉన్నతికి సహాయపడటంలో డాక్టర్ వి. పాండురంగారావుగారు ఎంతో కృషి చేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. భగవంతుని దరిచేరటానికి హృదయం విలపిస్తుంది. తల్లికోసం బిడ్డ ఏడ్చినప్పుడు తల్లి ఆతురతో వస్తుంది. అలాగే మన అభ్యాసులు ఆర్తితో తల్లడిల్లినప్పుడు తల్లి వంటి బాబూజీ మనల్ని దగ్గరకు తీసుకుంటారు. బాబూజీ కృప మనలోకి ప్రవహిస్తుంది. తమ సంకల్పం నెరవేరినందుకు బాబూజీ కూడా సంతోషిస్తారు. ధ్యానం నిమిత్తమాత్రంగా కాకుండా హృదయ పూర్వకంగా చేయాలి. ప్రాపంచిక జీవనంలో నిమగ్నమైపోయి వారిపై దృష్టి నిలపలేకపోయినప్పటికీ, జ్ఞాపకం రాగానే హృదయంలో వారి ఉనికిని అనుభూతి చెందటానికి అలవాటుపడాలి. మన ఆర్తితో బాబూజీ సంకల్పాన్ని నెరవేర్చి ధన్యులం కావాలి.

ఒకసారి శ్రీరాముని కంటిలో కన్నీరు చూసిన లక్ష్మణుడు కారణం ఏమిటి అని అడిగాడు. అందుకు శ్రీరాముడు– “భరతుడు దీక్షగా నేను ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తున్నాడు. అతనికి నా మూలంగా శ్రమ కలిగింది. అందుచేత ప్రేమకొద్దీ కన్నీరు వస్తోంది” అని అన్నాడు. లక్ష్మణుడు –“నేను మీవెంట ఉండి మీకు అన్నివిధాలా సహాయపడుతున్నాను కదా! మీరు బాధపడటం ఎందుకు?” అని ఊరడించాడు. తమ్మునితో “నీవు నాకు సేవ చేస్తున్నావు. అది సంతోషమే, కాని భరతుడు నాచేత అప్పగించబడిన రాచకార్యాన్నంతటినీ అయోధ్యలో నిర్వహిస్తున్నాడు. అతని హృదయం నాతో బంధించబడి ఉంది. అతను లేకుండా నేను ఉండలేకపోతున్నాను” అని చెప్తూ శ్రీరాముడు భరతుడి భక్తికి, ప్రేమకు ముగ్ధుడయ్యాడు. అతనికోసం తపించాడు. భరతుడు తననే స్మరిస్తూ తన హృదయంలో స్థానం పొందాడని శ్రీరాముడు వివరించాడు. అదే విధంగా మనం కూడా ఎల్లవేళలా బాబూజీని స్మరణలో నిలుపుకొని, శ్రద్ధ కలిగి ఉండాలి. తల్లికోసం తల్లడిల్లే పిల్లలలాగా మనం కూడా తపించాలి. అలాగే బాబూజీ దృష్టిలో మనం ఉన్నామని కూడా భావించుకుంటూ వారిని ప్రార్థించుకుంటే అనుబంధం గాఢంగా ఉంటుంది. ప్రిసెప్టర్ ఆధ్యాత్మికతను పంచాలంటే తాను ఉన్నతంగా ఆధ్యాత్మికతను పొంది ఉండాలి అని బాబూజీ చెప్పారు. నీకు ఆలోచనలు కలిగినప్పుడు, నీ జ్ఞాపకంలోకి నన్ను తెచ్చుకుని స్మరించినట్లయితే అవి నీ దగ్గరకురావు అని కూడా చెప్పారు. అలా సాధన ద్వారా బాబూజీని పొందగలిగినప్పుడు మన సాధన విజయవంతమవుతుంది.

**ప్రశ్న: ధ్యానంలోకి లోతుగా వెళ్ళటం ఎలా? దీనిలో కిటుకు ఏమిటో దయచేసి చెప్పండి?**

**జవాబు:** ఇందులో కిటుకు ఏమీలేదు. శ్రద్ధ ఉండాలి. నీవు దైవంతో కనెక్ట్ అయివుండాలి. ఎప్పుడంటే అప్పుడు హృదయంలో చూడగలగాలి. నీవు ఒక విగ్రహాన్ని తయారుచేస్తావు. దానికి ప్రాణప్రతిష్ఠ చేస్తావు, అంటే దైవాన్ని దానిలో ఇమడ్చాలనుకుంటావు. కాని దేవుడు ఏ విగ్రహాన్ని తయారుచేయలేదు. దైవం హృదయంలో ఉన్నాడని నీకు తెలుసు. కనుక విగ్రహంగాని, దానికి ప్రాణప్రతిష్ఠగాని అవసరం లేదు. ఆ విగ్రహానికి నీవే శక్తిని ఇస్తున్నావు.

ఒకసారి అనారోగ్యంతో నేను హాస్పిటల్‌లో చేరాను. బాబూజీ, “నీవెంటే నేను ఉంటాను” అని నాకు హామీ ఇచ్చారు. ఒకరోజున హాస్పిటల్ బెడ్‌మీద నేను లేకపోవడం చూసిన హాస్పిటల్ డాక్టర్ ఎక్కడికి వెళ్ళారని ప్రశ్నించారు. ప్రార్థనా మందిరానికి వెళ్ళినట్లు చెప్పాను. “ఈ మంచం వెలుగుతో ప్రకాశవంతంగా ఉంది. మీరా లేరు. ఆశ్చర్యంగా ఉంది” అన్నారు డాక్టర్.

బాబూజీ నాకు ఇచ్చిన మాట ప్రకారం నావెంటే ఉన్నారని –ఆ ప్రకాశం యొక్క అర్థం అదే అని అర్థమైంది. ఆ విషయం డాక్టర్‌కి తెలిసి “మీరు మరికొన్ని రోజులు ఈ హాస్పిటల్‌లోనే ఉంటే మిగిలిన పేషంట్స్ సంతోషంగా ఉంటారు. అయితే మీరు అనారోగ్యంతో హాస్పిటల్‌కు రావలసిన అవసరం ఉండకూడదని భగవంతుని ప్రార్థిస్తాను” అన్నారు. ఆ విధంగా బాబూజీ మనల్ని అనుసరించి రక్షణ కల్పిస్తారు. బాబూజీని భక్తితో, అర్పితభావంతో కొలవాలి. నేను మీవాడిని, మీరే నా సర్వస్వమూ అన్నట్లుగా అనుభూతి చెందాలి.

భక్తుడు లేదా సాధకుడు ఆ దివ్యకాంతి (తేజస్)ని, దైవాన్ని దర్శించగలిగి ఉండాలి. అనగా దివ్యత్వం ఏర్పడుతూ ఉండాలి. దానికి **మీ అంతట మీరుగా అభ్యాసీ లేదా సాధకుడు అని చెప్పుకొనేకంటే, మీ జీవిత విధానాన్ని గమనించినవారు మీలో ఆ దైవీయ ప్రకృతిని గుర్తించి గౌరవించేట్లుగా తయారుకావాలి. దానినిబట్టి మీరు సహజమార్గ అభ్యాసిగా గుర్తింపబడాలి.** కొంతమంది ప్రిసెప్టర్స్ విషయంలోను, అభ్యాసీల విషయంలోను సీనియర్స్, జూనియర్స్ అని విశ్లేషించటం జరుగుతుంది. అది సరైనది కాదు. దివ్యకాంతి ఎవరిలో ప్రకాశిస్తూ ఉంటుందో వారే నిజమైన అభ్యాసీకాని, సీనియర్ అయినంతమాత్రాన అభ్యాసిగా గుర్తింపబడరు. హృదయంలో దివ్యకాంతిని, ఆ కాంతి ఎక్కడి నుంచి వస్తోందో చూడగలిగిన అభ్యాసికి జూనియర్, సీనియర్ అనేవి వర్తించవు. చాలామంది సభలకు, ఆ జనసందోహాన్ని చూసి ఆనందించటానికి వస్తూ ఉంటారు కాని, నిజమైన ఆధ్యాత్మిక ప్రాప్తికోసం రారు. నిజమైన అభ్యాసులు హృదయంలో ఆధ్యాత్మిక ఆనందానుభూతిని పొందుతారుగాని జనసమూహంతో ఆనందించరు. కొంతమందికి సిట్టింగ్ ఇవ్వాలని నా హృదయంలో ప్రేరణ కలుగుతుంది. సక్రమంగా సాధన చేయని అభ్యాసులకు సిట్టింగ్ ఇవ్వాలనిపించదు. సిట్టింగ్ కావాలనుకోవటమే కాదు, దానికి తగినట్లుగా మిషన్ సమావేశాలు, ఉత్సవాలు జరుగుతున్నప్పుడు బాబూజీతో నేను, ఇతర అభ్యాసులం చిన్నపిల్లలలాగా చనువుగా వ్యవహరించేవాళ్ళం. ఏవైనా ప్రశ్నలు అడిగినప్పుడు కొన్నింటికి సమాధానం చెప్పటమో లేక చిరునవ్వుతో సరిపెట్టటమో జరిగేది.

అభ్యాసీ సోదరీ సోదరులను బాబూజీకి సమర్పణ చేయాలని ఉంది. దానివలన 'వారి'కి సంతోషం కలుగుతుంది. అప్పుడు వాళ్ళకి తెలియకుండానే సహజసిద్ధంగానే 'వారి' కృప లభిస్తుంది. ఆధ్యాత్మిక సమావేశాలు, ఉత్సవాలు జరుగుతున్నప్పుడు బాబూజీ కృప 'వారి' పాదాలను స్పర్శించి అభ్యాసులను వరించటానికి తనకు స్వేచ్ఛనివ్వమని కోరుతున్నట్లుగా ఉండేది. దానిని ఆపాలన్నా ఆగనంత స్వేచ్ఛగా, స్వచ్ఛంగా ఉండేది. బాబూజీ అనేవారు "మీరు తయారుగా ఉంటే అక్కడికి (అనంత స్థితికి) తీసుకుని వెళ్ళటానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని.

**ప్రారంభంలో దివ్యజ్యోతి హృదయంలో ఉందని భావించి ధ్యానం చేస్తాం. పోనుపోను దానిని విడిచి ఇంక ఆ దివ్యజ్యోతి ఎక్కడి నుండి వస్తోందో ఆ మూలం వెదకాలి. దాని వెనుక ఉన్న బాబూజీ మన హృదయంలోనే ఉన్నారని భావించి వారిలోనే జీవించాలి.**

'వారి' స్మరణను కలిగి 'వారి'తోనే ఉన్నాను అన్నట్లుగా ఉండాలి. అది నిరంతర స్మరణగా మారి వారితో బంధం విడదీయరానిదిగా ఉంటుంది. **ఏ పనిని చేస్తున్నా, "నేను చేస్తున్నాను" అని అనుకోకుండా నీ ద్వారా 'వారి'చేతనే ఆ పని చేయబడుతోంది అని భావించుకోవాలి.** మనం ఏదైనా పని చేస్తున్నామంటే దానిని మైండ్‌తో చేస్తున్నాం. మనం అందులో తలమునకలై ఉండవచ్చు. కాని హృదయం ఖాళీగానే ఉంటుంది. ఆ హృదయంలో వారు ఉన్న అనుభూతిని పొందాలి. అంటే మైండ్‌తో పనిచేయటం, హృదయంతో 'వారి' స్మరణను రోజంతా అనుభూతి చెందటం జరగాలి. భౌతికమైన కార్యకలాపాల్లో మునిగి ఉండి కూడా 'వారు' ఇక్కడే ఉన్నారు అని అనుకుంటే 'వారి' స్మరణలోనే నిరంతరం ఉన్నట్లయి, వారితోటి ఉన్న మన బంధం బలీయమై, మనం చేసే పని 'వారి'చేతనే చేయబడినట్లు సవ్యంగా జరుగుతుంది.

మన ఇంటికి ఎవరినైనా ఆహ్వానించి వారిపట్ల శ్రద్ధవహించకుండా మన పనిలో మనం నిమగ్నమై ఉంటే, దానిని అవమానకరంగా భావించి వారు తిరిగివెళ్ళిపోవటమూ, తిరిగి రాకపోవటమూ జరుగుతుంది. బాబూజీని మనం హృదయంలోకి ఆహ్వానించి పరాకుగా ఉన్నా కూడా 'వారు' వెంటనే తిరిగి వెళ్ళరు. మనం జ్ఞాపకం తెచ్చుకునేవరకు వేచి ఉంటారు. మనకు జ్ఞాపకం రాగానే 'వారు' ఇక్కడే ఉన్నట్లుగా తలపింపజేసి 'వారి'ని మనం మరచిపోలేదు, అని భావింపజేస్తారు.

ధ్యానం ఆరంభించిన క్రొత్తలో నాకు కూడా, ప్రాపంచికమైన రోజూవారీ కార్యక్రమాల్లో తీరిక లేకుండా ఉండి వారి స్మరణ కలిగి ఉండటం అసంభవం కదా! అని అనిపించేది. బాబూజీ చెప్పారు– "హృదయం మైండ్‌కు ఆటస్థలం" అని. అప్పుడది అర్థం కాలేదు. నేను రోజూవారీ పనులన్నీ చేస్తూ విరామం లేకుండా ఉన్నప్పటికీ వారిని స్మరించి వారితో కలిసి ఉన్నట్లుగా భావించుకునేదాన్ని. వారిని మరచిపోయానని అనుకోలేదు. నేను వారితోనే ఉంటూ వారి ఎదుటనే నేను జీవిస్తున్నట్లుగా అనుభూతి చెందాను. అంటే మనస్సు ప్రాపంచికంగా ఎంతగా విహరించినా, పరిశ్రమించినా గాని, హృదయంలోని ఆ దైవం–బాబూజీ స్మరణలోనే ఉండేది. కనుక మనస్సు హృదయమనే ఆటస్థలాన్ని విడిచిపెట్టలేదు. అప్పుడు బాబూజీ చెప్పిన ఆ వాక్యం– "హృదయం మనస్సుకు (మైండ్‌కు) ఆటస్థలం" అంటే ఏమిటో అర్థమైంది. ఇది నాకేకాదు మీ అందరికీ కూడా సులభసాధ్యం. బాబూజీ మన కోసమే దిగివచ్చారు కనుక, వారు మన హృదయంలోనే ఉన్నటువంటి అనుభూతిని నిరంతరం పొందుతూ ఉంటే, వారి ప్రేమ మనపై వర్షంలాగా కురుస్తూనే ఉంటుంది, వారి దృష్టి మనపైనే ఉంటుంది. వారి దివ్య నేత్రాల్లోనే మనం ఉంటాం. వారు తలచిన విధంగా మనం తయారైతే వారిచ్చే శక్తితో మనం వారింటికి అంటే మన **అసలు** ఇంటికి చేరుకోవటానికి ఎంతో సమయం పట్టదు.

ఇకపోతే విశ్వాసం నింపుకొని భరోసాగా ఉండటం ఎలా అనే ప్రశ్న ఉదయిస్తుంది. దానికి ఉదాహరణగా చిన్న ఉదంతం వివరిస్తాను. అక్బర్ చక్రవర్తి ఆస్థానంలో తొమ్మిదిమంది కవులు ఉండేవారు. అందులో శ్రీపతి అనేవారు ఒకరు. మంచి విష్ణు భక్తుడు. ఒక సందర్భంలో అక్బర్ తన ఆస్థానకవులు అందరికీ ఒక సమస్యాతోరణమిచ్చి దాన్ని నాలుగు పంక్తుల్లో పూరించమని ఆదేశించాడు. "నాకు అక్బరే ఆశ, ఆశలన్నీ అతడే తీర్చుతాడు" అని అర్థం ఇచ్చేదిగా ఉంది అది. ఆ సమస్య శ్రీపతి మినహా మిగిలినవారందరూ అక్బర్‌ను పొగుడుతూ పద్యం వ్రాసి పారితోషికాలు పొందారు. శ్రీపతి మాత్రం మౌనంగా ఉండిపోయాడు. తిరిగి రెండు నెలల వ్యవధి ఇచ్చి మళ్ళీ కొలువుదీరినపుడు ఆ పద్యం చెప్పాలని ఆదేశించాడు అక్బర్. ఆ సమయం గడిచింది, సభ ఏర్పాటైంది. నిర్ణీత సమయం ఆసన్నమయ్యేసరికి శ్రీపతి పద్యం పూరించలేదు కనుక హాజరుకాబోడు అని అందరూ అనుకుంటున్న సమయంలో శ్రీపతి తలదించుకుని సభలోకి వచ్చి తన స్థానంలో కూర్చున్నాడు. అక్బర్ ఆదేశంమేరకు లేచి ఆ పద్యాన్ని చదివాడు. దానిలోని ఒక పాదం– "శరణాగత్ శ్రీపత్ శ్రీపతికే" అనగా శ్రీపతి (కవి) శ్రీపతి (విష్ణుదేవుని) యొక్క శరణు పొంది ఉన్నాడు. కనుక ఎంత గొప్పవారినైనా తాను ఆశ్రయించాల్సిన పనిలేదు– అని స్ఫురిస్తుంది. అక్బర్ దానికి సంతోషించి అతడ్ని సత్కరించాడు. అంటే తాను కొలువున్న చక్రవర్తిని కూడా లెక్కచేయనంతటి ఆత్మబలం,

దైవ విశ్వాసం నిండిపోయి– దైవం మీద భరోసా అతనిలో ఉన్నాయి. కనుక మనం కూడా మనం నమ్మిన దైవం బాబూజీపట్ల, 'వారే' నా అండ అన్న విశ్వాసం ఉంచి శరణుపొందితే మన లక్ష్యం నెరవేరుతుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! దయచేసి విరాట్ హృదయం గురించి వివరించండి.**

**జవాబు:** హృదయ మండలం దాటిన తర్వాత విరాట్ మండలానికి చేరతాము. అన్ని రకాల బంధనాలు, హద్దులు దాటిన తర్వాతనే దీనిని చేరశక్యమవుతుంది. ఈ విరాట్ మండలం అనేది మనో మండలం (మైండ్ రీజియన్). దీని తర్వాత దైవీయ మండలం (గాడ్లీ రీజియన్)లో ప్రవేశించటం జరుగుతుంది. ఆ విరాట్ మండలంలో మనల్ని ఎవరో పిలుస్తున్నట్లుగాను, ఎవరో ఉన్నట్లుగాను అనిపిస్తుంది. మనం దివ్య మనస్సుతో జీవిస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఎప్పుడైతే మనం బాబూజీని హృదయంలో స్మరణ కలిగి ఉంటామో అప్పుడు పరిమితులన్నీ వాటంతటవే తొలగిపోతూ (కరిగిపోతూ) ఉంటాయి. ఈ స్మరణలో ఒకవైపు శాంతి మరోవైపు తపన ఉంటాయి, అని బాబూజీ చెప్పారు. శాంతి అంతమొందిన తర్వాత తపన మాత్రమే ఉంటుంది. ఈ తపన ద్వారా మన బంధనాలు కూడా లయమైపోసాగుతాయి.

నేను దీనిని బాబూజీకి– "నా హృదయం కరిగిపోతోంది" అని వ్రాశాను. ఈ సమయంలో మనం విరాట్‌లో జీవిస్తున్నట్లుగాను, ఎటు చూసినా ఆ విరాట్ వ్యాపించి ఉన్నట్లుగాను ఉంటుంది. దాని నుంచి బయటకు రావాలన్నా రాలేని పరిస్థితి. దీనినే విరాట్ స్థితి అంటాము. ఇక్కడ విరాట్ అంటే, బాబూజీని తలచుకుంటున్నట్లుగా ఉంటుంది.

చారీజీ జన్మదినోత్సవాలకు లక్నో వచ్చిన అభ్యాసులు చాలామంది నావద్దకు వచ్చారు. వాళ్ళు A,B,C,D వంటి పాయింట్ల గురించి అడిగారు. ఇటువంటి ప్రశ్న బాబూజీని అడిగినప్పుడు, "మీరు ధ్యానం, నిర్మలీకరణ మాత్రమే ఆచరించండి; ఆ పాయింట్స్‌తో అభ్యాసులకు పనిలేదు. ఇది నా పని" అని చెప్పారు. ఈ పాయింట్లు దేహానికి చెందినవి. ఆధ్యాత్మికతకు వీటితో పనిలేదు. పంచతత్వాలు అనగా పంచభూతాలు –నింగి, నేల, నీరు, నిప్పు, వాయువు –అందరిలోను క్లీనింగ్ చేయబడతాయి. వీటిని గురించి పట్టించుకోకుండా, హృదయంలో బాబూజీని స్మరించుకుంటూ 'వారి' అనుభూతిని పొందాలి. ధ్యానంలో శరీరంలోని అణువణువూ దివ్య ప్రకాశంతో నిండిపోతుంది. అప్పుడు పంచతత్వాలు తొలగించబడి కేవలం శరీరం మాత్రమే మిగిలి ఉంటుంది. ఒకసారి నేను చాలా జబ్బుతో ఉన్నప్పుడు మా తండ్రిగారు నా జాతకచక్రం తీసుకొని బనారస్‌లో ఒక జ్యోతిష్యుని వద్దకు వెళ్ళి నా ఆరోగ్యం గురించి అడిగారు. ఆ జ్యోతిష్యుడు దానిని చూసి ఈ జాతకానికి చెందిన వ్యక్తి ఎప్పుడో చనిపోవటం జరిగిందని, అయినా బ్రతికి ఉన్నట్లుగా తనను మోసగిస్తున్నారని నిలదీశాడు. అప్పుడు మా తండ్రిగారు బాబూజీతో ఈ విషయం ప్రస్తావించగా –"అవును, నీ కుమార్తె కస్తూరీ ఎప్పుడో మరణించింది, ఇప్పుడు ఉన్నది నా కస్తూరీ మాత్రమే. ఆ జ్యోతిష్యుడు చెప్పింది నిజమే" అని వివరించారు.

దీని అర్థం ఏమిటంటే, ఎప్పుడైతే మనం ఈ పంచతత్వాల నుంచి విడుదలైపోతామో, తర్వాత మనమింక లయావస్థలో జీవించటమే జరుగుతుంది. అనగా పాంచ భౌతిక స్పర్శ ఉండదు. లయావస్థను గురించి అభ్యాసీకి తెలియదు. బాబూజీలోనే జీవించటం జరుగుతుంది. అభ్యాసీ తను అక్కడ లేనట్లుగాను,

బాబూజీనే అక్కడ ఉన్నట్లుగాను అనుభూతి చెంది వారినే స్మరించాలి. 'నేను' చేస్తున్నాను అని పదేపదే చెప్పటంలో 'నేను' అనేది శరీరానికి చెందినదిగా ఉంటుంది. అందుచేత నోటితో కాకుండా హృదయంలో బాబూజీతో సంధానింపబడి వారే చేస్తున్నట్లుగా భావిస్తే మనకు ఏమీ అంటవు. అప్పుడు సాధ్యమైనంత త్వరగా మనం బాబూజీతో తీసుకుపోబడతాం. ఇటువంటి స్థితిని పొందిన అభ్యాసీ స్వయంగా చెబితే ఇతర అభ్యాసులకు కూడా బాగా అర్థమవుతుంది.

నేను 44 సంవత్సరాలక్రితం ఒక పుస్తకం వ్రాస్తున్నప్పుడు ఒక ఆలోచన వచ్చింది. అది ఏమిటంటే, "మనం ఇక్కడ భూమిమీద శరీరంతో జీవిస్తూ ఉండగా, బాబూజీ మహరాజ్ మనల్ని (కేంద్రమండలం) సెంట్రల్ రీజియన్ యాత్రకు ఎలా తీసుకువెళ్తారు" అని. ఆ బ్రైటర్‌వరల్డ్ (తేజోమండలం)ను దాటడం ఎలా, అను సందేహం కలిగింది. ఇంతలోనే బాబూజీ నాకు ఒక మ్యాప్ (పటం) చూపించి అందులో బ్రైటర్‌వరల్డ్ (తేజోమండలం) గుర్తింపచేశారు. అప్పుడు సెంట్రల్ రీజియన్ దాటిన తర్వాత బ్రైటర్‌వరల్డ్‌ను కేవలం స్మరించినట్లుగా చేసి దాని కేంద్రంలో మునక వేయించారు. అప్పుడే నాకు ఆ బ్రైటర్‌వరల్డ్ గురించి తెలిసింది. నేను దానిని దాటి ముందుకు వెళ్ళిన తర్వాత నాకు ఇంకేమీ కనిపించలేదు. ఈ విధంగా బాబూజీ చేస్తున్నప్పుడు వారి కృపతో నేను ఎలర్ట్‌గా (సావధానంగా) ఉన్నాను. నేను వారితో కనెక్షన్ కల్పించుకున్నాక ఆ దివ్యస్థితిని కల్పించారు. అప్పుడింక మానవ సంబంధమైన ప్రయత్నపూర్వక జాగరూకత లేకుండాపోయి ప్రకృతి తన దివ్య చైతన్యం ప్రసాదిస్తుంది. ఇలా దైవ సామ్రాజ్యం చేరగా దివ్యద్వారం తెరచి ఉంచారు. ఇప్పుడు ఆ దివ్యద్వారం నాకే కాదు, అందరికోసం తెరవబడి ఉంది.

మనం ఏ పనిచేసినా మన సంతోషం కోసమే చేస్తాం. ఆ పనిని మన కోసం కాకుండా బాబూజీకోసం, అందరికోసంచేస్తే వారూ  సంతోషిస్తారు. ఆ సంతోషంలో అభ్యాసులకు, అభ్యాసులు కానివారికి కూడా భాగం (వాటా) ఉంటుంది.

మన హృదయాంతరంలో వారిని ఎంత గాఢంగా జ్ఞాపకం చేసుకుంటూ ఉంటామో అంతగా ఆనందం లభిస్తుంది. మనలోని అణువణువూ ఆ ఆనందానుభూతిని పొందుతుంది.

'అహం' అనే దానిలో 'అ' అంటే లేదు. 'హం' అంటే మనం లేదా నేను. ఎప్పుడైతే 'నేను' అను భావం తొలగిపోతుందో అప్పుడు దాని భారం కూడా తొలగిపోయి తేలికదనం అనుభవమవుతుంది.

మరణానంతరం బాబూజీని చేరుకోవటం తేలికనుకుంటారు. అలా కాకుండా ఈ శరీరంతో ఉండగానే వారిని చేరుకోవటానికి ప్రయత్నించాలి. మనం బాబూజీ మహరాజ్‌కు మన సెల్ఫ్‌ను అర్పించుకోవాలి. హృదయం వారికి చేరాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! ధ్యానంలో లోతుగా మునిగి ఉండటం అంటే ఏమిటి?**

**జవాబు:** ఇది ఒక ఆనందకర స్థితిని కలిగి ఉండటమే. అనగా ఇది క్షణికంగా కాకుండా నిరంతరం కలిగి ఉండునట్టి స్థితి. మీరు మీ దినచర్యలో భౌతికంగా ఎన్నో పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఆ సందర్భంలో బాబూజీ మీ హృదయంలోనే ఉన్నారు, వారితో మీకు  సంబంధం ఉన్నదనీ మరచిపోవచ్చు. కాని వారి జ్ఞాపకం రాగానే, వారితో మీకున్న బాంధవ్యం, ప్రేమతో పరవశించుతున్న ఆనందం మళ్ళీ మీ హృదయంలో కలుగుతాయి. అది మీచుట్టూ అంతటా వ్యాపిస్తుంది. మీరు బాబూజీకి ప్రేమతో, భక్తితో ఇంకా ఇంకా

సామీప్యత చెందుతున్న కారణంగా ఒక ఆనందరకర స్థితి ఏర్పడటం, దానిలోనే మునిగి ఉండటం జరుగుతుంది. అనగా ఆ స్థితిలోనే మీరు బాబూజీ పాదపద్మాలచెంతనే జీవిస్తున్నట్లుగా భావించుకుంటూ ఉంటారు. ఇది ఎలాగంటే –బాబూజీ నాలోనే ఉన్నారు, బాబూజీ నాలోనే ఉన్నారు –అని మానసికంగా పదే పదే అనుకోకుండా హృదయంలో 'వారి' ఉనికిని అనుభూతి చెందాలి. ఒకవేళ మనం వారి స్మరణ లేదా జ్ఞాపకాన్ని పరాకుతో మరచినట్లు ఉన్నాకూడా వారు మనకోసం వేచియే ఉంటారు. వారి దివ్య నేత్రాలు మనవైపు చూస్తూనే ఉంటాయి. కనుక బాబూజీ మహరాజ్‌ను హృదయంలో గాఢంగా నిలుపుకొని, వారి సామీప్యతను ఇంకా ఇంకా పొందుతూ వారిలో జీవించటమే లయావస్థ అవుతుంది.

సాధారణంగా మనం బంధువులనో, స్నేహితులనో ఇంటికి ఆహ్వానించినప్పుడు లేదా వారే వచ్చినప్పుడు వారిపట్ల శ్రద్ధతో మర్యాద పాటించకపోతే తిరిగి వెళ్ళిపోతారు. అభ్యాసీ ధ్యానంచేసే సందర్భంలో **బాబూజీ స్వయంగా ఇలా చెప్పారు: "అభ్యాసీ నన్ను జ్ఞాపకం చేసుకుంటాడు, నేను అభ్యాసీ హృదయంలో ప్రవేశిస్తాను. కాని అంతలోనే అతడు ప్రాపంచిక విషయాల్లో నిమగ్నమైపోతాడు. అయినా నేను వెనుతిరిగిపోను. ఎందుకంటే, నేను అందరినీ అనంతస్థితికి తీసుకు వెళ్ళటానికే దిగివచ్చాను కనుక" అని.**

అందుచేత వారు మీ హృదయంలోనే ఉన్నారని భావించుకుని, భక్తితో, ప్రేమతో వారినే స్మరించుకుంటూ వారితోనే జీవించాలి. మీరు అలా జ్ఞాపకం చేసుకున్నప్పుడు వారు మీలో ఉన్నట్లు, మిగిలిన సమయంలో వారు మీలో లేనట్లు భావించకూడదు. ఒక్కసారి వారిని జ్ఞాపకం చేసుకుంటే చాలు, వారు మీలోనే ఉంటారు. మిమ్మల్ని చూస్తూ, గుర్తు చేసుకుంటూ ఉంటారు. కనుక ప్రతి అభ్యాసీ, మన దైవం బాబూజీపట్ల ఈ విధమైన చింతన కలిగి ఉండాలి. మనస్సుతో మీరు ప్రాపంచికమైన పనులు చేస్తూనే ఉంటారు. హృదయంలో బాబూజీయొక్క ప్రేమ, సామీప్యత, వారిలోనే జీవిస్తున్నటువంటి అనుభూతిని చెందుతూ ఉంటారు. మీరు రోజుకు ఒకటి రెండుసార్లు వారిని స్మరించుకున్నప్పటికీ రోజంతా మీరు ఈ అనుభూతిని పొందుతూనే ఉంటారు. వారి ప్రేమలో, వారి నిరీక్షణలో, వారిచ్చే దివ్యశక్తిలో మునిగి ఉండటం అంటే ఇదే!

మనస్సు ప్రాపంచికమైన పనులు నిర్వహిస్తూనే, హృదయం దైవచింతనలో మునిగి ఉండటమనేది ఒక్క సహజమార్గ విధానంలో మాత్రమే ఉంది. మరి ఇతర విధానం ఏదీ దీనికి సరిరాదు. ఇలాంటి దైవ నిమగ్నత మూలంగా, బాబూజీ స్మరణ మూలంగా దివ్యశక్తి ప్రవాహం, అందులో తడిసి స్నానమాడటం, స్వచ్ఛతనందిన సుఖానుభూతి, దివ్యశక్తిని స్వంతం చేసుకోవటంతోపాటు వారి ప్రేమను పొందటం జరుగుతుంది. మీ హృదయం వీటి అనుభూతితో నిండి పులకించిపోతుంది.

**ప్రశ్న: మనం వండుకునే పిండివంటలు, తీపి పదార్థాలు బాబూజీకి నివేదింపవచ్చునా?**

**జవాబు:** మీరు తయారుచేసిన పదార్థాలన్నింటినీ పేరుపేరున కాకుండా అన్నింటినీ బాబూజీ ముందు ఉంచి భక్తి విశ్వాసాలతో నివేదించాలి. అప్పుడు ఆ పదార్థాల అణువణువులోనూ ఆ దివ్యశక్తి నింపబడుతుంది. వాటిని ఆ పదార్థం పేరుతో రుచి చూసినట్లుగా కాకుండా ప్రతిదీ ఒక దివ్య ప్రసాదంగా భావించి సేవించాలి. ఆ ప్రసాదరూపంలో ఆ దివ్యశక్తిని గ్రహించినట్లు అవుతుంది.

ఇది ఒక సందర్భంలో అని కాదు, మనం జరుపుకునే ఫంక్షన్స్ దేనిలోనైనా అనగా జన్మదినవేడుక కావచ్చు, వివాహం కావచ్చు, మరేదైనా సమావేశం కావచ్చు, దానిని ప్రారంభించబోయేముందు భక్తితో హృదయ పూర్వకంగా బాబూజీని స్మరించి పనికి పూనుకుంటే అది నిర్విఘ్నంగా నెరవేరుతుంది. వాటిలోని మాలిన్యాలు, దోషాలు కూడా తొలగిపోయి దివ్యత్వంతో నిండిపోతుంది. బాబూజీ ఆనందిస్తారు. ఫంక్షన్‌లో పాల్గొనేవారందరూ కూడా సంతోషంగా అనుభూతి చెందుతారు. మనం ఆస్వాదించే పదార్థాలు కూడా చాలా రుచికరంగాను, దోషరహితంగాను, ప్రత్యేకత చెందినవిగాను అందరికీ అనుభవమవుతుంది. అందరికీ ఆ సందర్భం మరుపురానిదిగా అనిపిస్తుంది. కనుక ఫంక్షన్‌లో పాల్గొనే ప్రతి అభ్యాసి తన కర్తవ్యంగా భావించి బాబూజీకి తప్పనిసరిగా అలా నివేదించాలి.

బాబూజీ మహరాజ్ మనకోసం భువికి దిగివచ్చారు. దివ్యత్వాన్ని మనకు పంచటానికి వచ్చారు. వారినే స్మరించుకుంటూ, వారితోనే జీవిస్తున్నాం కనుక, వారి ఉనికిని అనుభూతి చెందుతూ ఎటువంటి ఉత్సవం జరుపుకున్నప్పటికీ అది ఒక ఆధ్యాత్మిక పండుగగా అనిపిస్తుంది. నేను వారి జన్మదిన వేడుకలు జరుపుకున్నప్పుడల్లా ఇదే విధంగా స్మరించుకొని, ఆ భావంతోనే నిర్వహిస్తాను. వారు సంతోషించి మనకు ప్రేమ పంచుతారు. శ్రీరామచంద్ర మిషన్ సభ్యులమైన మనకు వారి ఉనికిని అనుభూతి చెందకుండా ఎటువంటి ఉత్సవం జరుపుకున్నా సంతృప్తికరంగా లేకపోవటమే కాదు, అది తగదు కూడా.

**ప్రశ్న: మన మిషన్ చిహ్నంలోని స్వస్తిక్ ఏమి సూచిస్తుంది?**

**జవాబు:** ఈ స్వస్తిక్ నాలుగు దిశలను సూచిస్తుంది. అనగా సహజమార్గం నాలుగు దిక్కులా వ్యాపించి ఉందని అర్థం. మన మిషన్ చిహ్నం గురించి బాబూజీ తమ పుస్తకంలో వివరించారు. ఈ స్వస్తిక్ గుర్తు స్థానం నుంచే సహజమార్గం వ్యాపిస్తుంది. సహజమార్గం ద్వారా బాబూజీ నుంచి వచ్చే దివ్యధార ప్రవహిస్తుంది. ఆధ్యాత్మిక ప్రయాణంలో కలిగే ఒక సత్యత్వస్థితి ఇది. సహజమార్గం గుండా ప్రయాణించినప్పుడు ఇది అనుభవానికి వస్తుంది. ఈ సహజమార్గం సత్యపద్‌కు దారితీస్తుంది. సత్యపద్ అంతటా దివ్యత్వమే వ్యాపించి ఉంటుంది. అది చాలా అపారంగాను, అదితప్ప మరేదీ లేనిదిగాను ఉంటుంది. ఇక్కడినుంచే సహజమార్గం ద్వారా సూక్ష్మస్థితిగా దివ్యత్వం ప్రవహిస్తూ ఉంటుంది. అభ్యాసి సత్యపద్‌కు చేరినపుడు ఆ దివ్యధారలో మునిగిన ఆనందంలో తన్మయమైపోయి తన ఉనికినే మర్చిపోవటం జరగుతుంది. సహజమార్గ విధానం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది.

**ప్రశ్న: బాబూజీ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న వారందరికీ (లిబరేషన్) ముక్తి ఇచ్చినట్లుగా చెప్పారు. వీలుపడక వెళ్ళలేని అభ్యాసుల సంగతి ఏమిటి?**

**జవాబు:** బాబూజీ శక్తిని ఇస్తున్నారు. అది ఎంతగానో ఉంది. దానిని జీర్ణించుకోగలిగితే దేనినైనా పొందవచ్చు. బాబూజీ దిగివచ్చింది మనల్ని అందరినీ అనంతానికి చేర్చటానికే. “నేను శక్తిని ఇస్తున్నాను. కాని ఆ శక్తిని మీరు స్వంతం చేసుకోలేకపోతున్నారు. లాలాజీ సాహెబ్ నాకు ఎంతో శక్తిని ఇచ్చారు. దానినంతటినీ ఇక్కడే వదిలివెళ్తాను. ఇంక గ్రహించటం మీ వంతు” అని బాబూజీ పదేపదే చెప్పారు. అందుచేత మన ఆలోచన, ప్రయత్నమూ దానిని పొందటం కోసమే అయి ఉండాలి. ముక్తి (లిబరేషన్) అనేది చాలా చిన్న

విషయం. బాబూజీ నుంచి వస్తున్న కృపను, శక్తిని మీకు నేను అందిస్తున్నాను. దానిని మీరు స్వీకరించి హృదయంలో అనుభూతి చెందండి.

బాబూజీ అంతిమం నుండి దిగివచ్చి మనల్ని ఆ అనంతస్థితికి చేర్చదలచారు. "వారు నావారే" అని బాబూజీని మీ స్వంతం చేసుకుని దాన్ని హృదయంలో నిలుపుకోవటమే మన శ్రీరామచంద్ర మిషన్ యొక్క సహజమార్గంలోని ప్రత్యేకత. మొదట మీలో ఆలోచన కలగాలి –"వారు నా వారు" అని. ఆ తర్వాత దానిని హృదయంలో అనుభూతి చెందాలి. వారి సంకల్ప శక్తితో ముక్తి (లిబరేషన్) దానంతటదే లభిస్తుంది.

వారు మనకోసమే దిగివచ్చారు. ప్రతి ఒక్కరినీ తీసుకు వెళ్ళటానికే వచ్చారు. ఇవ్వవలసిన శక్తినంతటినీ ఇస్తున్నారు. వారు నావారే, అని మీరు అనుభూతి చెందగలిగితే వారు మీవారే అవుతారు. అప్పుడు అంతా మీదే అవుతుంది. అందుచేత మీరు వారిలో జీవించటానికి, వారి స్మరణ కలిగి ఉండటానికి, వారిని మీవారుగా అనుభూతి చెందటానికి ప్రయత్నించాలి. అది ఎంతగానంటే, వారి కంటే ఇంకేదీ మీకు ముఖ్యం కాదు అనునంతగా ఉండాలి. ఉదాహరణకు –మీ పిల్లలు ఇతరుల పిల్లలు కలిసి ఉన్నప్పుడు అందరిపట్ల మీకు సమభావం ఉంటుంది. వారు ఆటలాడుకుంటున్నప్పుడు మీ పిల్లవాడిపట్ల మీకు ప్రత్యేక శ్రద్ధ ఉంటుంది. అదే విధంగా మీ పిల్లవాడు మరియు బాబూజీ –మీ దృష్టికి వచ్చినప్పుడు మీ స్వంత బిడ్డకంటే బాబూజీకే హృదయంలో ప్రాధాన్యత ఉంటుంది. బాబూజీని మీవారుగా భావిస్తారు. ఇటువంటి అనుభూతి మీలో వృద్ధిచెందినప్పుడు మీరు వారి కృపను పొందుతారు. మీరు వారి నిరంతర స్మరణలో ఉంటూ ఉంటే, దాని ఫలితంగా వారి ప్రెజెన్స్ (ఉనికిని) అనుభూతి చెందుతారు. బాబూజీ ఏమి చెప్పారంటే, దైవం నీలో ఉన్నాడు. కనుక నీలో ఆ దైవం ఉన్నాడని భావించుకొని వారు ఉన్నారన్న అనుభూతి చెందాలి. అప్పుడు ధ్యానంలో నిన్ను కలవరపెట్టుతున్నాయని అనుకున్న ఆలోచనలు, నీ దగ్గరకు రాకుండా తొలగిపోతాయి. నీవు దివ్యానుభూతి చెందుతావు –అని బాబూజీ ఎన్నోసార్లు చెప్పారు. ఆ విధంగా దివ్యానుభూతిలో లీనమైపోయినప్పుడు ఇంక ఆలోచనలు ఏమీరావు.

బసంత్ పంచమి ఉత్సవ సందర్భంలో నేనొక పాట వ్రాశాను. అందులో –"ఆ అంతిమం మనందరినీ ఆ భూమా మధ్యలో కూర్చోవటానికి ఆహ్వానించింది. అలా ఎందుకు అంటే, బాబూజీ మనవారు అనుకుంటున్నాం కనుక, బాబూజీ మనవారైన కారణంచేత! వాస్తవంగా బాబూజీ మనలోనే ఉన్నారు. కనుక వారి కృప మన అభ్యాసులందరికీ లభిస్తోంది. ఈ ఆహ్వానం పొందటం మన అదృష్టం" అని వ్రాశాను. అలా వెళ్ళటానికి మనం సిద్ధంగా ఉండాలి. అందుచేత వారిని మనవారుగా చేసుకోవటానికి, వారు మనల్ని ఎలా తీర్చిదిద్దాలనుకుంటున్నారో అలా కావటానికి ప్రయత్నించండి. ఆ విధంగా మనం ఉన్నతినందినప్పుడు ఆధ్యాత్మికత అంతా మనదే అవుతుంది. బాబూజీని తల్లిగా భావించి, ఆ తల్లి ఒడిలో మనం ఉన్నామను అనుభూతి చెందాలి.

బాబూజీ ఒక అభ్యాసీని సెంట్రల్ రీజియన్‌కు తీసుకు వెళ్ళారు. కాని అతను అక్కడ ఉండలేకపోయాడు. దీనికి బాబూజీ ఒక చక్కని ఉదాహరణ ఇచ్చారు. ఒక తండ్రి తన కుమారునికి సౌకర్యవంతమైన మంచి గృహం నిర్మించి అందులో నివసించమని చెప్పాడు. కాని అతడు ఆ ఇంటిలో

నివసించకుండా తిరిగివచ్చి సౌకర్యంగాలేని శిథిలావస్థలోని పాత గృహంలోనే నివసించసాగాడు. ఇలా ఎందుకంటే, అతనికి అక్కడ ఆ క్రొత్త ఇంట్లో ఇక్కడ ఉన్న స్నేహితులు తోడుగా ఉండరు కనుక.

అందుచేత మన బాహ్యపరివర్తన కంటే హృదయ పరివర్తన చాలా ముఖ్యం. ఉన్నత స్థితులు కల్పించి అన్నీ ఇస్తున్నప్పటికి మనం అక్కడ ఉండలేకపోతున్నాం. మన ఆలోచనాసరళిని, జీవన విధానాన్ని సరిదిద్దుకుని మన అంతరంగంలోని అంతర్యామి (దైవం)లో జీవించటానికి ప్రయత్నించాలి. మనం సిద్ధంగా ఉంటే, బాబూజీ అందుకు సంతోషించి మనల్ని తీసుకువెళ్ళటానికి వారు సర్వసన్నద్ధంగా ఉంటారు. వారు ఎంత దివ్యత్వం ఇచ్చినప్పటికీ మనం పొందలేకపోతున్నామంటే మన హృదయంలో దానికి తగిన ఖాళీ లేదన్నమాట.

నేను సిట్టింగ్ ఇస్తున్నప్పుడు ప్రేమతో బాబూజీ ఇచ్చే శక్తినంతటినీ అభ్యాసీల్లోకి మళ్ళిస్తున్నాను. కాని దానిని కొద్దిమంది మినహా చాలమంది స్వీకరించలేకపోతున్నారు. అలా స్వీకరించలేనివారి చుట్టూ ఆ శక్తి ఆవరించి ఉంటుంది. కారణం హృదయంలో దానికొరకు ఖాళీ లేకపోవటమే. దానికొరకు భక్తితో, శ్రద్ధతో ప్రయత్నిస్తే ఆ శక్తిని శ్వాస ద్వారా, స్పర్శ ద్వారా తమదిగా చేసుకోగలుగుతారు. మనం వారు ఇచ్చే ప్రాణాహుతిలో మునిగి వారి ప్రేమను చూరగొనాలి. వారి ధ్యాసలోనే మునిగి ఉంటే చెడు ఆలోచనలుగాని, బరువైన అనుభవాలుగాని మన హృదయాన్ని తాకవు.

ఇందుకు బాబూజీ చెప్పిన ఉదాహరణ ఏమిటంటే, “నీవు విమానంలో ప్రయాణిస్తూ భూమినుండి ఎత్తుగా పైకి పోతున్నకొద్దీ వత్తిడి పెరిగి శ్వాస కూడా కష్టమనిపిస్తుంది. అదే విధంగా ఆధ్యాత్మికంగా ఉన్నతినందుతున్నప్పుడు తేలికదనం అనగా భార రహితంగా అవుతున్నట్లు అనుభూతి కలుగుతుంది. ఇంకా ఉన్నతంగా వెళ్ళినకొద్దీ ఆ తేలికదనం యొక్క అనుభూతిని కూడా మరచిపోవటం జరుగుతుంది” అని చెప్పారు. బాబూజీ మనల్ని అంతిమ స్థితికి చేర్చేందుకు తగినట్లుగా మనల్ని తీర్చిదిద్ది సిద్ధం చేయటంలో బాగా నిమగ్నమై ఉన్నారు. అందుచేత మనం వారితో అనుసంధానమై వారికి ఆ సహకారాన్ని ఇవ్వాలి. అప్పుడే వారిచ్చేదానిని మనం పొందగలుగుతాం. బాబూజీ మహరాజ్ మనల్ని ఎలా తయారు చేయాలనుకుంటున్నారో అలా పరివర్తన చెందగలమని, వారి కోరికకు అనుగుణమైన ఆలోచనతోను, దృఢ సంకల్పంతోను వారి శరణాగతిని పొందినట్లయితే వారు తగిన విధంగా స్పందించి మన ఉన్నతికి తోడ్పడతారు. మీ హృదయాన్ని వారికి అనుసంధానం చేయండి; ఫలితం చూడండి. అందరినీ అంతిమం తీసుకు వెళ్ళాలనుకున్న ‘వారి’ సంకల్పం సాఫల్యం చేయటానికి ఆత్మ విశ్వాసంతో బాబూజీకి సహకరించండి.

ఒక అభ్యాసీ మాస్టర్ ఈశ్వర సహాయ్‌గారిని “మనకు కుటుంబ పనులు, ఉద్యోగ విధులు నిర్వర్తించటానికే చాలా సమయం పడుతుంది. మరి ఆధ్యాత్మికత కొరకు ఎక్కువ సమయం కేటాయించటం ఎలా?” అని ప్రశ్నించాడు.

ఈశ్వర సహాయ్‌జీ దానికి సమాధానంగా “బాబూజీ ఉద్యోగరీత్యా కోర్టుకు వెళ్ళటం, బజారు పనులు చేయటం, అభ్యాసులకు సిట్టింగ్స్ ఇవ్వటం చేసేవారు. ఇంటి పనులు, మిషన్ పనులు స్వయంగా పర్యవేక్షించేవారు. అయినప్పటికీ నిరంతరం అభ్యాసుల ఆత్మోన్నతి గురించే ఆలోచిస్తూ ఉండేవారు. మధ్యలో

ఎవరైనా అభ్యాసీ సిట్టింగ్‌లో తన కోసం నిరీక్షిస్తున్నట్లుగా గమనిస్తే అతనికి సిట్టింగ్ ఇచ్చేవారు. పగలంతా శ్రమించినప్పటికీ రాత్రి కూడా నిద్రపోకుండా అభ్యాసుల గురించి ఆలోచిస్తూ పనిచేస్తూ ఉండేవారు.

ఒకసారి దీనిని గమనించిన నేను బాబూజీతో, "చాలా ప్రొద్దు పోయింది, నిద్రపోండి బాబూజీ" అని అన్నప్పుడు వారు, "బిటియా! లాలాజీ సాహెబ్ నాకు ఇంకా నిద్రకు ఉపక్రమించమని ఆజ్ఞను ఇవ్వలేదు. వారు దానిని ఇవ్వగానే నిద్రపోతాను" అని అన్నారు.

బాబూజీ ఆ విధంగా ప్రాపంచిక వ్యవహారాలు, బాధ్యతలతోపాటు, రాత్రిళ్ళు ఆధ్యాత్మిక పనులతో తలమునకలై ఉండేవారు. అదే విధంగా మనం కూడా ప్రాపంచికమైన విధులు నిర్వర్తిస్తూనే వారితో మన హృదయాన్ని అనుసంధానంచేసి ఉంచాలి. ఒక బిడ్డ తన తల్లికోసం ఎలా తల్లడిల్లిపోతుందో అదే విధంగా మనం కూడా హృదయంలో మన దైవం బాబూజీ కోసం తపించాలి.

**ప్రశ్న: 'స్థితి'లో మునిగిపోయి ఉండటం ఎలా?**

**జవాబు:** ఈ ప్రశ్న మొదటి బ్యాచ్‌లో వచ్చిన అభ్యాసులూ అడిగారు. సమాధానం చెప్పాను. ఐనా కాని నేను ఇంటికి తిరిగి వెళ్ళాక దానిని ఇంకా సులభంగా చక్కగా ఎలా చెప్పాలి అనే ఆలోచన వచ్చింది. దాని ఫలితంగా తిరిగి మీకు ఆ విషయం సులభంగా అర్థంకావటానికి ఇలా చెబుతున్నాను.

బాబూజీ మహరాజ్ 'మునిగి' ఉండే స్థితిని ఆలోచనారహితమైన ఆలోచన ద్వారా పొందవచ్చునని చెప్పారు. ఇది ఎలా సాధ్యపడుతుంది? అనే ప్రశ్న వెంటనే నాలో తలెత్తింది. అప్పుడు ఒక విద్యార్థికి ఉపాధ్యాయుడు బోధించిన రీతిలో బాబూజీ నాకు దానిని గురించి వివరించారు.

ముందుగా మీరు దైవం మీలోనే ఉన్నాడని భావించుకొనండి. దైవం మీలోనే ఉన్నాడన్న 'భావన' మీలో కుదురుకొన్నది కనుక ఆ 'ఆలోచన' అనేదాన్ని విడిచిపెట్టి దైవం అక్కడ ఉన్నట్లుగా 'అనుభూతి' చెందండి. దైవం మీలోనే ఉన్నాడు అనుకునే భావన లేదా ఆలోచనను (ఒక సూచనగా) ఒక్కసారి మాత్రమే చేయాలి. మళ్ళీ మళ్ళీ అవసరం లేదు. ఎప్పుడైతే మీలో దైవం ఉన్న అనుభూతిని పొందుతున్నారో అది గాఢమవుతుంది, అప్పుడు మీరు ఆ స్థితి లేదా అనుభూతిలో మునిగిపోతున్నట్లుగా ఉన్న భావనలోనే మునిగి ఉండండి.

అనగా ఆలోచన ద్వారా అనుభూతి వస్తుంది. అనుభూతి కలిగిన తర్వాత ఆలోచన అంతర్ధానమవుతుంది. అనుభూతిలో మునిగి ఉండాలనే కోరిక కలిగిన తర్వాత మునిగి ఉండటమే జరుగుతుంది. అప్పుడు అనుభూతిలో మునిగి ఉండాలనే ఆలోచన కూడా అంతరించిపోయి పూర్తిగా మునిగి ఉండటమే జరుగుతుంది. ఈ విధంగా మీరు ఆ అనుభూతిని, మునిగి ఉండే స్థితిని, దానిలోని ఆనందాన్ని ఆస్వాదిస్తారు. పై విధంగా మీరు సాధన చేసినట్లయితే 'స్థితి'లో మునిగి ఉండటాన్ని సాధించటంలో మీరు విజయం పొందుతారు. బాబూజీ నాకు వివరించిన దానిని మీకు తెలియజేశాను. కనుక మీరు ఈ రోజు నుంచే దీనిని ఆచరించటానికి ప్రారంభించండి.

మీరు ధ్యానంలో కళ్ళు మూసుకోగానే అలా చేస్తే మీకు కలిగే స్థితులన్నింటిలోను అలా మునిగి ఉండగలిగితే, అది చాలా గొప్పగా ఉపయోగమవుతుంది. తద్వారా, బాబూజీ మహరాజ్‌లో మీకు లయావస్థ

కలుగుతుంది. ధ్యానంలో మీకు సూక్ష్మత, బాబూజీ యొక్క సామీప్యత అనుభూతికి వస్తాయి. అప్పుడు మీ ఆలోచనను వాటిమీదకు మళ్ళించి ఆ స్థితిలోనే మునిగి ఉంటున్నట్లుగా భావించుకోవచ్చు. అప్పుడు 'భావంలేని భావం'తో 'స్థితి'లో మునిగి ఉంటారు.

బాబూజీ నాకు నేర్పిన విధానాన్ని మీకు నా శాయశక్తులా వివరించాను. మీరూ ప్రయత్నించి ఫలితాన్ని ఆస్వాదించండి. **'అనుభూతి' మాత్రమే బాబూజీతో మనకు సంబంధం కల్పిస్తుంది.** హృదయంలో వారి ఉనికిని అనుభూతి చెందాలి. అంతేకాని బాబూజీ నా హృదయంలో ఉన్నారు అని పదే పదే అనుకోవటంవలన లాభం ఉండదు. **భావనతో ప్రారంభమైన 'మునిగి' ఉండటం –దానిని విస్మరించటం ద్వారానే 'స్థితి'లో మునిగి ఉండటం జరుగుతుంది.**

అందుచేత అభ్యాసులు బాబూజీ చెప్పిన ఆధ్యాత్మిక విషయాలను అర్థం చేసుకుని ఆచరించాలి. దీనికి ఒక ఉదాహరణ మీ ముందు ఉంచుతున్నాను. మీకు మొదటగా నదిలో స్నానం చేయాలనే తలంపు వస్తుంది. నదిలోకి దిగి నిలుచుని నెమ్మదిగా నీటిలో మునిగి స్నానం చేస్తూన్న దాని అనుభూతిని అనుభవిస్తారు. ఇప్పుడు నదిలోకి దిగి స్నానం చేయాలని వచ్చిన ఆలోచన కార్యరూపం దాల్చింది కనుక, ఆ ఆలోచన యొక్క అవసరం పోతుంది. స్థితిలో 'మునిగి' ఉండటం అనే దానిని అర్థం చేసుకోవటానికి ఇది కూడా ఒక ఉదాహరణ. ఇటువంటి ఉదాహరణల ద్వారా నేను మీకు అర్థంచేయగలిగితే మీరు కూడా ఈ గ్రహించుకున్న దానిని ఇతరులకు చెప్పి గ్రహింపు చేయగలగటానికే ఇంత విపులంగా వివరిస్తున్నాను.

డెన్మార్క్ దేశం నుంచి వచ్చిన ఒక ప్రిసెప్టర్ అడిగిన ప్రశ్న.

**ప్రశ్న: కొంతమంది అభ్యాసులు ధ్యానంలో కూర్చోగానే అందులో మునిగిపోతారు. మరికొందరు ధ్యానంలో నిమగ్నం కాలేరు. అటువంటి వారిని ధ్యానంలో మునిగేట్లుగా చేయటం ఎలా?**

**జవాబు:** అటువంటి సందర్భంలో ప్రిసెప్టర్, అటువంటి అభ్యాసులకు కూడా తమ దివ్య కృపను అనుగ్రహించమని బాబూజీని వేడుకోవాలి. అటువంటివారిని ప్రిసెప్టర్ తనకు తానుగా మార్చటం సాధ్యంకాని పని. అది బాబూజీకి మాత్రమే సాధ్యం కనుక, ప్రిసెప్టర్ యొక్క తలంపు లేదా అభ్యర్థన మూలంగా బాబూజీ శక్తి వారిమీద పని చేస్తుంది.

నేను బాబూజీని ఇలా ప్రార్థించాను: "బాబూజీ మీరు నాకు దివ్యశక్తిని, దివ్య ప్రేమను ప్రసాదించారు. వీటిని అభ్యాసులకు కూడా అందిస్తాను. వారు కూడా మీ దివ్య ప్రేమలో, దివ్యశక్తిలో మునిగిపోవాలి" అని. కొంతమంది అభ్యాసులు ఎన్ని సిట్టింగులు తీసుకున్నా ట్రాన్స్‌మిషన్ పొందుతున్న అనుభూతి కలగటంలేదని చెప్తూ ఉంటారు. అటువంటి వారిని గుర్తించి వారితో ధ్యానంలో బాబూజీ ఇచ్చే ప్రాణాహుతితోపాటు, వారి దివ్య ప్రేమ కూడా ప్రసారమవుతున్నట్లు భావించుకోమని చెప్పాలి. ఆ విధంగా వారిలో ఆ భావం కలుగజేసినప్పుడు, రెండవ సిట్టింగ్‌లో వారిలో మార్పు వచ్చి ట్రాన్స్‌మిషన్ మరియు వారి దివ్య ప్రేమను పొందుతున్నట్లుగా అంగీకరిస్తారు. ఇలా చేయటం వలన మంచి ఫలితం ఉంటుంది. "రిసీవర్ (అనగా ట్రాన్స్‌మిషన్ తీసుకునే అభ్యాసి) కరక్టుగా లేనప్పుడు, బాబూజీ, మీరు ఏం చేస్తారు?" అని అడిగినప్పుడు వారు, "నేను ప్రయత్నించి అభ్యాసులను అందుకు అర్హులుగా చేస్తాను" అని చెప్పారు.

ఈశ్వర్ సహాయ్‌గారు ఒకసారి బాబూజీని "ధ్యానంలో ట్రాన్స్‌మిషన్ పొందుతున్నప్పుడు తేలికదనం యొక్క అనుభూతుని ఎందుకు పొందుతాము?" అని ప్రశ్నించారు. దానికి జవాబుగా బాబూజీ "ఎంత బరువునైనా మోయగలనుగాని అహం (ఎగో) యొక్క బరువును మాత్రం మోయలేను" అని చెప్పారు. అహంతో కూడియున్న అభ్యాసి యొక్క బరువు మోయలేనిది కనుక, అభ్యాసి హృదయం నుంచి ముందుగా బాబూజీ దానిని తొలగిస్తారు. ఆ బరువు తొలగించగానే తేలికదనం అనుభవమవుతుంది.

**అభ్యాసీ: నేను నా హృదయ స్థానంలో ట్రాన్స్‌మిషన్ యొక్క అనుభూతిని పొందుతున్నాను.**

**బెహెన్‌జీ:** బాబూజీ ఇస్తున్నటువంటి ట్రాన్స్‌మిషన్‌ను మైండ్ రీజియన్‌లోగాని, హార్ట్ రీజియన్‌లోగాని ఇంకా ఎక్కడైనాగాని దానిని అనుభూతి చెందవచ్చు. ఎందుకంటే, నీవు బాబూజీలోనే నివసిస్తున్నావు కనుక అనుభూతి ముఖ్యంకాని, ఎక్కడ అనేది ముఖ్యం కాదు. నేను చాలా విషయాలు చెప్పాలనుకుంటున్నాను. కాని ఇంగ్లీషు భాషలో ఆధ్యాత్మికతకు చెందినటువంటి సరైన పదాలు లేవు. చాలా తేడా ఉంటుంది మరి. హిందీలో సామ్యావస్థ అనే దానిని ఇంగ్లీషులో బ్యాలెన్స్‌డ్ స్టేట్ అంటాము. ఈ రెండింటి అర్థంలో తేడా ఉంది. ఎలాగంటే స్టేట్ అను పదం విస్తృతమైన ఆవరణను సూచిస్తుంది. ఉదాహరణకు యు.పి. స్టేట్ తీసుకుంటే ఇందులో అనేక నగరాలు షాజహాన్‌పూర్, లక్నో మొదలైనవి ఉన్నాయి. అంటే ఒక స్థానం కాకుండా అనేక ప్రాంతాలుగా ఉంటుంది. కాని సామ్యావస్థ అనేది ఒక రీజియన్. దానికి ఒక కేంద్రం అనగా మధ్యగా ఉండే స్థానం ఉంటుంది. అక్కడకు చేరినప్పుడు అనగా ఆ స్థితికి చెందిన కేంద్రానికి చేరినప్పుడు సామ్యావస్థను అనుభూతి చెందుతాము. బ్యాలెన్స్‌డ్ స్టేట్, దీనిని ఇంగ్లీషులో అన్నప్పుడు ఒక ప్రాంతానికి చెందినదిగా అర్థమవుతుంది. కాని ఒక స్థానానికి పరిమితమై ఉండదు. అనగా ఆ స్థితి యొక్క అసలైన అర్థం కాకుండా డొంక తిరుగుడుగా ఉంటుంది. సామ్యావస్థలో మెయిన్ సెంటర్‌కు చేరి ఆ సమతుల్యతను (బ్యాలెన్స్‌ను) అనుభూతి చెందుతాం.

బాబూజీ నన్ను ఆ రీజియన్‌లో ఆ స్థితికి చేర్చినప్పుడు నా శరీరం అంతా దివ్యకాంతితో నిండిపోయి నిశ్శబ్దత ఆవహించింది. నేను పాట పాడుతున్నప్పుడు కూడా ఆ నిశ్శబ్ద స్థితియే నాకు అనుభవమవుతూ ఉండేది. నేను ఆ కేంద్రానికి చేరినప్పుడు ఆ ప్రాంతం అంతా సమతుల్యత వ్యాపించి ఉన్నట్లుగా అనిపించింది. ఆ కేంద్రం నుంచి సమస్థితి యొక్క నిజతత్వం వెల్లడవుతున్నట్లుగా గ్రహించాను.

ఒక అభ్యాసీ నన్ను (హృదయ మండలం) హార్ట్ రీజియన్, (మనో మండలం) మైండ్ రీజియన్, (కేంద్ర మండలం) సెంట్రల్ రీజియన్‌లను గురించి అడిగాడు. నేను మౌనం వహించాను. నేను నాలో కలిగిన స్థితులను గురించి వివరిస్తూ బాబూజీకి వ్రాసినప్పుడు వారే ఆ స్థితులను ఏమని చెప్తూతారో, అవి ఏమిటో, వాటి గురించి వివరించేవారు. అంతేకాని నేను వాటి వివరం చెప్పమని ఎప్పుడూ బాబూజీని అడగలేదు. అందుచేత బాబూజీలో లీనమైతే అన్ని స్థితులనూ అభ్యాసీకి వారు కల్పించటమూ, అభ్యాసీ పొందటమూ జరుగుతుంది.

**ప్రశ్న: మనం గమ్యం చేరుతున్నట్లు ఎలా తెలుసుకోగలం?**

**జవాబు:** అది లయావస్థకు చెందిన అంశం. ముందుగా మూడు స్థితులు ఉంటాయి. అవి సామీప్యత, సాలోక్యత, సారూప్యత. బాబూజీకి చేరువవుతున్న అనుభూతి సామీప్యతా స్థితి; బాబూజీ ఉన్నచోటనే తానూ వారితో ఉంటున్న అనుభూతి సాలోక్యతా స్థితి; తన రూపం చూసుకోవాలి అని అద్దంముందు నిలబడితే అందులో బాబూజీ రూపమే ప్రతిబింబించటం, అలాగే బాబూజీకి కూడా తన రూపం చూసుకోవాలనుకుని అద్దంముందు నిలబడితే ఆ అభ్యాసి రూపమే ప్రతిబింబించడం జరిగితే, దీనినే సారూప్యతాస్థితి అని వివరించాల్సి ఉంటుంది. ఇంక మిగిలింది సాయుజ్యతా స్థితి. అంటే ఈ స్థితిలో బాబూజీలో విలీనమైపోవటమే! ఇంక నీ ఉనికిగాని, ఎరుకగాని ఉండవు. ఇదే మరపుస్థితి. ఈ స్థితుల అనుభూతిని బాబూజీకి వ్రాసినప్పుడు, ఆ స్థితుల పేర్లు వారు చెప్పగా నాకు తెలిశాయి. కనుక స్థితుల అనుభవానందం ముఖ్యంకాని, వాటి పేర్లు తెలుసుకోవటం ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఈ మరపుస్థితిని పొందాలని, దాన్ని అనుభూతి చెందాలని ఆశిస్తున్నాను. మీరు ధ్యానంలో కూర్చున్నప్పుడు ఒక ఛాయ (నీడ)లాగా ఈ స్థితి వస్తుంది. దానిని గ్రహించి ఆ స్థితిలో మునిగి ఉండటానికి ప్రయత్నించాలి. ఆ అనుభూతి మూలంగా దానిని వ్రాయగలుగుతారు.

**ప్రశ్న: ఆ స్థితిలో వచ్చిన ఛాయను (నీడను) పట్టుకోవచ్చునా?**

**జవాబు:** వీలుపడదు. నీవు ప్రయత్నించినా సాధ్యపడదు. కనుక ఎప్పుడు ఏ స్థితి కలిగినా (ఆలోచన వదిలిపెట్టి) దానిలో మునిగి ఉండటమే ముఖ్యం. ఎంతో జాగరూకతతో (అలర్ట్‌గా) ఉండి దానిని గ్రహించి అనుభూతి చెందాలి. స్థితి యొక్క ఆనందాన్ని ఆస్వాదించాలి. నాలో నిద్రలోనైనాసరే ఏమైనా స్థితులు కలిగినప్పుడు ఆ తర్వాత వాటిని సవివరంగా వ్రాసుకునేదాన్ని. బాబూజీ తమ పరిశోధనకు నన్ను ఎంచుకుని అన్ని స్థితులు అనుగ్రహిస్తున్నారు కనుక నా విధిగా గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా సావధానంగా ఉండేదాన్ని.

డాక్టర్ వరదాచారిగారు ఒకసారి బాబూజీతో "నన్ను ప్రశంసిస్తూ– ఈమె చాలా సిన్సియర్, సెన్సిటివ్; అందుకే ప్రతి ఒక్క స్థితిని అనుభవ పూర్వకంగా వ్రాయగలుగుతున్నది" అని చెప్పారు. అప్పుడు నేను కలగజేసుకుని– మానవులందరూ కూడా సెన్సిటివే! బాగా స్పందించగలరు కాని అది ఈ ఆధ్యాత్మిక విషయంలోతప్ప –అని అన్నాను. సిన్సియర్ అంటే ఇలా అర్థం చేసుకోవాలి– సత్‌సంగ్‌లో కూర్చున్న మీరంతా నేను సిట్టింగ్ ప్రారంభించినంతనే బాబూజీ ప్రక్కనే ఉన్నారనుకుంటూ, వారి సామీప్యతను అనుభూతి చెందుతూ ట్రాన్స్‌మిషన్ ఇవ్వటంవలన అభ్యాసికి ఆ అనుభూతి కలుగుతుంది. అంతేగాని నా గొప్పతనం ఏమీకాదు. అలాగే సీనియర్ అనుకోవటం కూడా. అభ్యాసిని గమనించినంతనే అతనిలో బాబూజీ కనిపించాలి. అటువంటివారు సిన్సియర్ అనుకోవాలి. సిన్సియర్, సీనియర్ అని ఎవరిని అనుకోవాలంటే, ఏ అభ్యాసీ అయితే బాబూజీని ప్రేమతో, భక్తితో తన స్మరణలో నిలుపుకుంటారో అతడే సిన్సియర్, సీనియర్ అనిపించుకుంటాడు.

**ప్రశ్న: (డెన్మార్క్ ప్రిసెప్టర్) మీరు అందరు అభ్యాసుల స్థితిని చూడగలరు. ఏమైనా ఇవ్వగలరు. నేను ప్రిసెప్టర్‌గా అభ్యాసికి బహుమతిగా ఏదైనా ఉన్నత ఆధ్యాత్మిక స్థితిని కల్పించాలనుకున్నప్పుడు ఏమి చేయాలి?**

**జవాబు:** మొదటగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే, ఇది బాబూజీ నాకు ఇచ్చిన బహుమతి. ఒక అభ్యాసి యొక్క స్థితిని తెలుసుకోదలచినప్పుడు– ఆ అభ్యాసి నీ ఎదుట సిట్టింగ్‌లో కూర్చుని ఉండగా అతని గురించి నీలో కలిగిన (ఫీలింగ్) అనుభూతియే అతని స్థితిగా ఉంటుంది.

ఆ ప్రిసెప్టర్– "ఇది (Reflection) ప్రతిబింబంగా ఉన్నదని నేను తెలుసుకున్నాను" అని చెప్పినప్పుడు నేను ఇలా చెప్పాను: "నీవు అందుకోసం ప్రయత్నించవద్దు. అప్రయత్నంగానే అది నీ దృష్టికి వస్తుంది" అని.

బాబూజీకి నేను ఒకసారి వ్రాసిన ఉత్తరంలో రెగ్యులర్ (క్రమబద్ధ) అభ్యాసిని, రెగ్యులర్ కానిఅభ్యాసిని గుర్తించటం ఎలా? అని వ్రాశాను. ఆ తర్వాత నేను షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు బాబూజీ ఆ విషయం నన్ను చెప్పమని తిరిగి అదే ప్రశ్న నాకు వేశారు. ఏమని అంటే, ఆ ఇద్దరిని ఎలా గుర్తించాలో నీవు చెబితే నేను కూడా తెలుసుకుంటాను –అని చమత్కారంగా.

దానికి సమాధానంగా నా అభిప్రాయం ఏమి చెప్పానంటే, "కొంతమంది అభ్యాసులు నావద్దకు వచ్చినప్పుడు, వారు నన్ను కోరకుండానే సిట్టింగ్ ఇవ్వాలనిపిస్తుంది. మరికొందరి విషయంలో వారు సిట్టింగ్ కావాలని కోరినప్పటికీ తిరస్కరించాలని అనిపిస్తుంది. ఆ ఫలితాన్నిబట్టే వారిద్దరినీ గుర్తించవచ్చు" అని చెప్పాను. అందుచేత అభ్యాసుల్లో అలసత్వం, అశ్రద్ధ ఉంటే పురోగమించలేరు.

ఒకసారి ప్రిసెప్టర్లు ఇద్దరు నావద్దకు వచ్చారు. వారు నాతో డాంబికంగా రోజుకు 10 నుంచి 12 వ్యక్తిగత సిట్టింగులు, 6 నుంచి 7 వరకు గ్రూపు సిట్టింగులు ఇస్తున్నట్లుగా చెప్పారు.

అభ్యాసులు కూడా చాలామంది, ఎక్కువ సిట్టింగులు తీసుకోవటం మూలంగా ముందుకు పోతున్నామనుకుంటారు. మన బాబూజీ విషయంలో ఆ విధంగా ఆశించలేము. ఎందుకంటే, ప్రతిదీ బాబూజీపట్ల గల ప్రేమతో ముడిపడి ఉన్నాయి కనుక. బాబూజీ మనకు పంచే ప్రేమకు మరెవ్వరూ సాటిరారు. మనం ధ్యానం చేసేది ఆ అహంకారం తొలగించుకోవటనికే కదా! నేను, ఆ వచ్చిన ఆ ప్రిసెప్టర్లను, మీరు అభ్యాసులకు సిట్టింగులు ఇవ్వటంలోనే మీ సమయం వెచ్చిస్తున్నారు; మీ కొరకు ధ్యానం చేయటానికి మీకు తీరిక దొరకటం లేదు కదా! మరి మీరేమి పొందుతున్నారు –అని అడిగాను. వారు మౌనం వహించారు. వారు అసలు విషయాన్ని అర్థం చేసుకోలేదు.

**అభ్యాసీ: బాబూజీ మహరాజ్ సామాన్యులను ప్రిసెప్టర్లుగా చేస్తున్నారు. మానవ మాత్రులుగా భౌతిక జీవితంలో బలహీనతలు ఉన్నప్పటికీ వారి దివ్య ప్రేమతో కనెక్షన్ ఇస్తున్నారు. ఇది వారి గొప్పతనమే కదా!**

**బెహెన్‌జీ:** బాబూజీ మహరాజ్‌తో కనెక్షన్ ఏర్పడిన కారణంగా అహం కరిగిపోయి ఇతర బలహీనతలు కూడా వారి దరిజేరవు. బాబూజీని ప్రార్థించటం ద్వారా అభ్యాసుల దురలవాట్లు, ఇతర బలహీనతలు తొలిగిపోయి నిర్మలంగా తయారుకావటంతో వారికి మంచి కలుగుతుంది. బాబూజీ దివ్యపురుషుడు కనుక ప్రతి ప్రిసెప్టర్, అభ్యాసులను బాబూజీకి సంధానపరచి వారి ఉన్నతికి కృషి చేయాలి.

నేను ఒకసారి బాబూజీతో– "నేను సిట్టింగ్‌లో కూర్చున్నప్పుడు ప్రశాంతత, ఆనందం కలగాలని కోరుకునేదానిని. కాని మీరు ఎప్పుడూ వాటిని నాకు ఇవ్వలేదు. నేను సిట్టింగ్‌లో కూర్చుని అంతర్ముఖమైనప్పుడు (హృదయంలోపలికి చూసుకున్నప్పుడు) నా దేహస్థితి కూర్చున్నట్లుగా అనిపించకుండా ఒక నిశ్శబ్ద స్థితి మాత్రమే అక్కడ ఉన్నట్లు అనిపించింది. అది ఎటువంటి కోరికలు లేనిస్థితిగా అర్థం చేసుకున్నాను. నేను ఏదో ఆలోచనకు తావిద్దామనుకున్నా ఏమీ చేయలేని మునిగిపోయిన పరిస్థితిగా ఉంటుంది" అని చెప్పాను.

డెన్మార్క్ అభ్యాసి ఒకరు నాతో ఇలా అన్నారు: "మేము ఇక్కడికి వచ్చేప్పుడు ఏవైనా ప్రశ్నలు అడగాలనుకున్నప్పటికీ ఇక్కడకు వచ్చిన తర్వాత మా మైండ్ అంతా ఖాళీగా ఉండటంవలన అడగలేకపోతున్నాము" అని. దానికి స్పందించి నేను ఇలా చెప్పాను:

అభ్యాసులు వచ్చేముందు నేను వారికి ఏదైనా చెప్పగల్గాలని బాబూజీ మహరాజ్‌ను వేడుకునేదాన్ని. దానితోపాటు వారికి ఏదో కొంత ఆధ్యాత్మిక లబ్ధిని ఇవ్వాలని, దానిని వారు పొందగల్గాలని ప్రార్థించేదాన్ని. సాధారణంగా అభ్యాసులుగా వచ్చినవారు మొదటి మూడు సిట్టింగులు తీసుకుని శ్రీరామచంద్ర మిషన్‌లో సభ్యులై, సహజమార్గ పద్ధతిని అనుసరిస్తారు. విధానాలు, నియమాలు పాటిస్తారు. అయితే దీనిని ఒక ఆర్గనైజేషన్‌గా (సంస్థగా) భావిస్తారు. అసలైన శ్రీరామచంద్ర మిషన్‌కు ఒక లక్ష్యం ఉంది. ఆ లక్ష్యసాధనయే ప్రధానాంశం. అటువంటి మూలాల భావాలతో ఉన్న ఈ శ్రీరామచంద్ర మిషన్‌లో చేరటం కష్టం. ఎలాగంటే, బాబూజీ మహరాజ్ అంతిమం నుంచి దిగివచ్చి, ప్రతి అభ్యాసికి ఆత్మోన్నతి కల్పించి అంతిమం (అనంత స్థితికి) చేర్చటానికి సంకల్పించి ఉన్నారు. అందుచేత ఈ మిషన్‌లో చేరినవారు అందుకోసం శ్రమించవలసి ఉంటుంది. కనుక ఒక సంస్థగా భావించుకోవటంలోను, ఒక నిశ్చిత లక్ష్యాన్ని సాధించటంలోను కొంత అశక్తత ఉంటుంది. ఈ మన శ్రీరామచంద్ర మిషన్ ప్రతి ఒక్కరూ అంతిమం చేరే విధంగా నిర్దేశిస్తుంది, సాధింపజేస్తుంది.

**ప్రశ్న: బాబూజీ మహరాజ్, అంతిమానికి బాట తీర్చిదిద్దిన కృషివలన ఇప్పుడు నూతనంగా చేరిన అభ్యాసులు వేగంగా ఆధ్యాత్మికోన్నతిని పొందగలుగుతున్నారు, అవునా?**

**జవాబు:** అవును. బాబూజీ మహరాజ్ అంతిమం చేరే మార్గాన్ని ఇప్పుడు సులభతరం చేశారు. అభ్యాసి ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితులు పొందుతున్నకొద్దీ బాబూజీ సహాయం ఎక్కువగా అవసరం ఉంటుంది. ఇంకా ఇంకా  ఉన్నత స్థితులు పొందటానికి వారు అన్ని ఏర్పాట్లుచేసి, మనరాక కోసం నిరీక్షిస్తూ ఉన్నారు. కనుక ఇక్కడ మనం భౌతికంగా దర్శించిన బాబూజీ మహరాజ్ ఎంతో దివ్య సౌందర్యంతో కనిపిస్తారు. మొదట బాబూజీతో మనకు ఉన్న భౌతికమైన అనుబంధం ఆధ్యాత్మికంగా ఎదుగుతున్నకొద్దీ సత్యత్వం (రియాలిటీ)తోగల అనుబంధంగా మారుతుంది.

**ప్రశ్న: నేను సిట్టింగ్ తీసుకునేటప్పుడు ట్రాన్స్‌మిషన్‌ను అనుభూతి చెందలేకపోతున్నాను. ఆ ట్రాన్స్‌మిషన్‌ను అనుభూతి చెందాలి అంటే,  నేను ఏ విధంగా మారాలి?**

**జవాబు:** దీనికి కారణం మీకు వచ్చే ఆలోచనలే అని నేను ఎప్పుడూ చెప్తూ ఉంటాను. ఆలోచనల గురించే మీరు ఆలోచిస్తూ ఉంటారు. ఆలోచనలు వస్తున్నట్లుగా అనుకోవటం కూడా ఒక ఆలోచనయే. బాబూజీ

మహరాజ్ చెప్పింది ఏమిటంటే, "ట్రాన్స్‌మిషన్‌కు అవరోధం కలిగించే ఆలోచనలు నీకు వచ్చినప్పుడు దైవం నీలో ఉన్నాడని భావించాలి" అని. బాబూజీ ఇచ్చే ట్రాన్స్‌మిషన్ పొందటానికే ధ్యానంలో కూర్చున్నట్లుగాను, బాబూజీని దర్శించటానికి, వారితో అనుబంధం పెంచుకోవటానికి సిట్టింగ్ తీసుకుంటున్నట్లుగాను భావించుకొని అలా అనుభూతి చెందితే, ఆలోచనలు తొలగిపోయి ట్రాన్స్‌మిషన్ యొక్క అనుభూతి కలుగుతుంది.

**ప్రశ్న: పిల్లలను సహజమార్గ విధానంలోకి ప్రవేశపెట్టడం ఎలా?**

**జవాబు:** నీవు సహజమార్గంలో నివసిస్తున్నట్లయితే నిన్ను చూసి పిల్లలు బాబూజీ మహరాజ్ గురించి తెలుసుకొని అర్థం చేసుకుంటారు.

**ప్రశ్న: బాబూజీ మహరాజ్, పిల్లలు అభ్యాసులుగా చేరటానికి 18 సం॥లు వయస్సు ఉండాలని నిబంధన పెట్టారు కదా! ఎందుకని?**

**జవాబు:** సాధన చేయటానికి వయస్సుతో నిమిత్తం లేదు. అర్థం చేసుకోగలిగి ఉండాలి. తల్లిదండ్రులు తెలివైనవారు. పిల్లల విద్యాభ్యాసానికి విఘాతం కలిగితే ఏవో కారణాలతో ఇతరులమీద నింద మోపుతారు. అందుచేత విద్యార్థులైన పిల్లలు సహజమార్గంలో చేరినప్పటికి ఇతర వ్యాపకాలతో చదువుమీద శ్రద్ధపెట్టక పరీక్షల్లో తప్పినట్లయితే, పిల్లలు –ధ్యానం మూలంగా శ్రద్ధగా చదువుకోలేకపోయాము. అందుచేత తప్పినట్లుగా, తప్పించుకుని నిందమోపుతారన్న ఉద్దేశ్యంతో అలా చెప్పారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో "హుజూర్! ఒక అభ్యాసీ తన కుమారునికి 18 సం॥ల వయస్సు నిండుతోంది కనుక మిషన్‌లో చేర్పించుతాను, అని కోరుతున్నాడు" అని అన్నారు. అందుకు బాబూజీ, సరే అని అంగీకరించారు. అయినా కాని అతడు 8 రోజులైనా రాకపోయేసరికి బాబూజీ ఆ అభ్యాసీని పిలిచి "మీ కుర్రవాడు ఎందుకు రాలేదు" అని ప్రశ్నించారు. అప్పుడు అతడు "నా కుమారుడు మద్యం సేవించి ఉండటంతో రాలేకపోయాడు" అని చెప్తూ ఆ కుర్రవానికి మద్యం సేవించే అలవాటు ఉందని, మిషన్‌లో చేర్పించినట్లయితే ఆ అలవాటు మానతాడనే అభిప్రాయంతో తాను ఆ విధంగా ప్రయత్నించానని చెప్పాడు. కనుక అభ్యాసులు దాపరికం లేకుండా వాస్తవాన్ని బాబూజీకి తెలియజేయాలిగాని గోప్యంగా ఉంచకూడదు.

బాబూజీ ఏమి చెప్పేవారంటే, "విద్యార్థులు ఒక్క 5 నిముషాలు ధ్యానంలో కూర్చుని, బాబూజీ మహరాజ్ తమ చెంతనే ఉన్నట్లుగాను, వారి నుంచి ప్రాణాహుతి వస్తున్నట్లుగాను భావించుకుని చదువు ప్రారంభించాలి" అని. అంతటితో బాబూజీని మర్చిపోకూడదు. కనుక విద్యార్థులు– బాబూజీ తమను గమనిస్తూనే ఉన్నారని, శ్రద్ధగా చదువుకొని ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తే బాబూజీ సంతోషిస్తారని, వారి సంతోషం కొరకే తాను శ్రమించాలి అని భావించుకోవాలి.

పిల్లలు చెడు అలవాట్లకు గురైనప్పుడు తల్లిదండ్రులు వారిని తమచెంత కూర్చోబెట్టుకుని బాబూజీని ప్రార్థించాలి. అప్పుడు ప్రాణాహుతి యొక్క అనుభూతి, దాని సుగుణం వారి హృదయం నుండి వీరి మనస్సులో నాటుకుని క్రమంగా సన్మార్గులవుతారు. కుటుంబీకులందరూ సామూహికంగా ధ్యానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

**ప్రశ్న: ప్రిసెప్టర్‌గారు ఏదైనా విషయం చెబుతున్నప్పుడు నా నేత్రాలు మూతబడిపోతాయి. ఆ సమయంలో నేను బలవంతంగానైనా కళ్ళు తెరచి ఉండాలా లేదా కళ్ళు మూసుకుని ఉండిపోవచ్చునా?**

**జవాబు:** ఎవరైనా, ఏదైనా విషయం చెబుతున్నప్పుడు కళ్ళు తెరచి సావధానంగా వినాలి. అలాకాకుండా కళ్ళు మూసుకుని పరధ్యానంగా ఉంటే, అది సోమరితనం లేదా నిర్లక్ష్యంగా భావించాలి. ఆధ్యాత్మికతలో అప్రమత్తంగా ఉండాలేకాని ఏమరుపాటు తగదు. వారు చెప్పేది మనకోసమే కనుక, శ్రద్ధ వహించాలి. విషయాలు ఆలకించకపోతే ఇంకేమి ఆచరించగలరు?

నేను బాబూజీవద్దకు వెళ్ళినప్పుడు వారు ఏమి చెబుతారోనని నా చెవులు రిక్కించి వినేదానిని. ఆ విధంగా మనం సచేతనంగా ఉండాలి. బాహ్యంగానే కాకుండా, మన హృదయంలోనే ఉన్న బాబూజీ ఎప్పుడు ఏమి సందేశం ఇస్తారోనని, దానిని గ్రహించటానికి సావధాన చిత్తంతో ఉండాలి. అదే విధంగా మెలకువగా ఉన్నప్పుడే కాకుండా నిద్రలో ఉన్నప్పుడు కూడా ఏదైనా సంకేతం లేదా కుదుపు అనుభూతి చెందినప్పుడు దానిని కూడా గ్రహించటానికి సిద్ధంగా ఉండాలేకాని అశ్రద్ధ చేయకూడదు. ఈ విధమైన శ్రద్ధ, ఆచరణ మూలంగానే బాబూజీ చెప్పిన విషయాలు నేను వ్రాసి మీకు వివరించగలిగాను. అలా ఉన్నప్పుడే అభ్యాసీ పురోగమిస్తాడు.

**ప్రశ్న: ప్రాణాహుతి ప్రవాహం అభ్యాసి శరీరంలోకి ఏ భాగం లేదా ఏ అవయవం నుంచి ప్రవేశిస్తుంది?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ ఇచ్చే ప్రాణాహుతి ధార మన హృదయంలో నుంచి శరీరంలోకి ప్రవేశించి శరీరమంతటా విస్తరిస్తుంది. శరీరంలోని అణువణువూ దానితో నింపబడుతుంది. ఆ ప్రాణాహుతి ధార అలా ప్రవహించి మనలోని మాలిన్యాలను (అనవసరమైన విషయాలను) తొలగిస్తుంది.

**ప్రశ్న: స్వామి వివేకానంద వంటి గొప్ప మహాత్ముడు పిన్నవయస్సులోనే ఎందుకు మరణించాడు? మరికొంతకాలం జీవించి ఉంటే ఇంకా కొంత ఆధ్యాత్మిక సేవ చేసి ఉండేవారు కదా!**

**జవాబు:** ఇది నాకు సంబంధించినది కాదు. జీవన్మరణాలు భగవంతునిచేత శాసించబడతాయి. కనుక భగవంతుడ్నే అడగాలి.

**ప్రశ్న: ఒకసారి నేను ధ్యానంలో కూర్చునప్పుడు ఒక అశరీర (అదృశ్య) వాణి వినిపించింది. అదేమంటే, "నీవు అంతిమంలోకి త్రోసివేయబడ్డావు. ఇంక ప్రాణాహుతి గురించి మరచిపో. బాబూజీని మాత్రం స్మరణలో నిలుపుకుంటే సరిపోతుంది" -అని. అది వాస్తవమా లేక భ్రమా, ఊహనా?**

**జవాబు:** ఇందులో కొంత వాస్తవమూ కొంత ఊహ రెండూ ఉన్నాయి. అశరీరవాణి అనేది నీ ఊహ. ట్రాన్స్‌మిషన్ పొందుతున్నావు, కనుక బాబూజీ మహరాజ్‌ను అనుభూతి చెందుతున్నావు. వారిని జ్ఞాపకంలో నిలుపుకోవటమూ వాస్తవమే, కాని అంతిమంలోనికి నెట్టివేయబడటం మాత్రం అవాస్తవం. అదే జరిగి ఉంటే నీవు ఇప్పుడు ఉండేదానివి కావు. ఈ ప్రశ్నను అడిగిన ఆమెచేత మళ్ళీ తన ప్రశ్నను మరోసారి చెప్పమని అడిగిన తర్వాతనే నేను ఈ సమాధానం చెప్పాను. ఎందుకంటే, అభ్యాసిని పరిశీలించడం కూడా ఒక ముఖ్యాంశం కనుక. అంతిమంలో ఆలోచనారహిత స్థితి మాత్రమే ఉంటుంది. అందుచేత ఏ ఆలోచనతోను అక్కడ ఉండలేరు.

**ప్రశ్న: నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్దవాడు ఒక ప్రమాదంలో మరణించాడు. అతని ఆత్మ రెండవ కుమారునికి కలలోకి వచ్చి భయపెడుతూ కొట్టినట్లు, తిట్టినట్లుచేసి –'అమ్మను ప్రేమగా చూసుకో' అని అంటుందని, చెబుతున్నాడు. దీనికి పరిష్కారం ఏమిటో దయచేసి చెప్పండి.**

**జవాబు:** మీరు ఆ చనిపోయిన కుమారుని ఆత్మకు శాంతి సమకూర్చమని బాబూజీని ప్రార్థించండి. రెండవ కుమారుని విషయం కూడా బాబూజీకి నివేదించి, అతడు కూడా ఆధ్యాత్మికంగా ఉన్నతి చెందాలని బాబూజీని వేడుకోవాలి. చనిపోయిన కుమారుడు మీ చరణాలవద్దనే ఉన్నాడు, మీ కృపతో అతనికి ఉన్నతి కలిగించమని ప్రార్థించాలి. ఆ విధంగా తల్లిగా మీరు మీ కుమారుని ఆత్మను బాబూజీకి నివేదించాలి.

**ప్రశ్న: ధ్యానంలో ఒక్కొక్కసారి సంతోషానుభూతి కలుగుతుంది. ఒక్కొక్కసారి అటువంటి అనుభూతి కలగదు. ఎందుచేత?**

**జవాబు:** కొన్నిసార్లు మన హృదయం బాబూజీ యొక్క సామీప్యతను అనుభూతి చెందినప్పుడు సంతోషం కలుగుతంది. కాని ఆలోచనల మూలంగా మన దృష్టి మరలినందువలన ఆ సంతోషాన్ని పొందలేము. అందుచేత మనకు సంతోషం కలిగించినటువంటి స్థితిని జ్ఞాపకం చేసుకుంటూ ఇతర ఆలోచనలకు గురికాకుండా అందులోనే మునిగి ఉంటే ఆ సంతోషాన్ని, ఎప్పుడూ పొందే విధంగా సాధించుకోవచ్చు. అంతేకాని బాబూజీ ఇచ్చే ట్రాన్స్‌మిషన్‌లో హెచ్చుతగ్గులు ఉండవు. ఆలోచనలు ఇబ్బంది కలిగిస్తున్నట్లయితే –"నేను బాబూజీతోనే ఉన్నాను, అంతటా వారే ఉన్నారు" అని అనుకుంటే అవి తొలగిపోయి నీకు తృప్తి కలుగుతుంది. మనం పొందవలసింది సంతోషం కాదు, 'బాబూజీ'ని, అని గ్రహించాలి. వారికి ఆత్మ సమర్పణ చేసుకొని, వారి ప్రేమ గురించి, వారి దర్శనం గురించి, సాక్షాత్కారం గురించి తలచుకుంటూ ఉంటే, వారు నిన్ను ఎలా తయారుచేయాలో అలా తయారుచేస్తారు.

**ప్రశ్న: నేను ధ్యానంలో కూర్చున్నప్పుడు వెన్నెముక క్రిందిభాగంలో వత్తిడిని అనుభూతి చెందుతున్నాను. దాని భావం ఏమిటి? దయచేసి వివరించండి.**

**జవాబు:** బాబూజీ నుంచి వచ్చే ప్రాణాహుతి శక్తి మన శరీరంలోని అణువణువునూ చేరి, మనలోని శక్తి కేంద్రాలను జాగృతం చేస్తుంది. అది జరిగినప్పుడు ఇటువంటి అనుభూతి, ఒక్కొక్కరిలో ఒక్కొక్కచోట, లేదా ఒకేసారి ఎక్కువ కేంద్రాలలోను శక్తిని చైతన్యపరచటం వలన అలా కలుగుతుంది. నేను బాబూజీకి ఈ సందర్భంగా వ్రాసిన ఉత్తరంలో– "నా శరీరంలోని ప్రతి అణువునుంచి శక్తి విడుదలవుతున్నట్లుగా అనుభూతి చెందుతున్నాను" అని వ్రాశాను. మన అభ్యున్నతి కొరకు వారు ఏమి చేయాలో అది చేస్తారు. మనం దానిని అనుభూతి చెందాలి.

**ప్రశ్న: సాయుజ్యస్థితి అంటే ఏమిటి? నేను ఆ స్థితికి చేరగలనా?**

**జవాబు:** బాబూజీ అందరినీ అంతిమ స్థితికి తీసుకుని వెళ్ళటానికే వచ్చానని ప్రకటించారు. కనుక ఏ స్థితియైనా సంభవమే. అది నాకు మాత్రమేకాదు అందరికీ సాధ్యమే. ఈ స్థితుల గురించి నా పుస్తకాల్లో వ్రాయటమేకాదు నిన్నటిరోజున కూడా వివరించాను. సామీప్యత, సాలోక్యత, సారూప్యతా స్థితులు తర్వాత కలిగేది సాయుజ్యతా స్థితి. దీని ఫలితంగా బాబూజీలో లయం కావటం జరుగుతుంది. బాబూజీ భూమిమీదకు

దిగివచ్చింది అందరినీ అంతిమానికి తీసుకువెళ్ళే సంకల్పంతోనే! అందుచేత ఫలానా స్థితి కలుగుతుందా లేదా అనిగాని, నేను అక్కడకు చేరగలనా లేదా అనిగాని సంశయం రాకూడదు. అందరికీ అన్నీ సాధ్యమే. ఈ సందర్భంలోనే బాబూజీ చెప్పిన ఈ మాటలు అర్థం చేసుకోవాలి. స్థితులు పొందాలనే కాంక్ష లేదా వ్యామోహం లేదా తాపత్రయం ఉండకూడదు. దైవాన్ని దర్శించాలనే తపన, సాక్షాత్కారం పొందాలనే లక్ష్యం మాత్రమే ఉండాలి. పాయింట్లు, స్థితులు గురించిన ఆలోచన అనవసరం. అందుచేత బాబూజీ మహరాజ్‌కు మనల్ని అర్పించుకోవటమే ప్రధానం. వారు మనకు అంతిమం చేరే మార్గం చూపి, చేరటానికి శక్తిని ఇస్తున్నారు. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలేగాని, ప్రయాణించేటప్పుడు అటు ఇటు చూస్తూ దృష్టిని అప్రధానమైన విషయాలమీదకు మరల్చకూడదు. వారు చేయి చాపారు కనుక వారిచేతిని అందుకుని సాగిపోవటమే మన కర్తవ్యం.

బాబూజీ ఇచ్చిన ప్రతి పనిలోనూ, ప్రతి కదలికలోనూ వారిని జ్ఞాపకం చేసుకుంటూ, వారిలోనే జీవించినట్లయితే బాబూజీకి సంతోషం కలుగుతుంది. అలాగే మన హృదయం వారి ప్రేమతో నిండిపోయి ఆనందంతో జీవిస్తాం. ఈ విధంగా ఆచరిస్తూ బాబూజీ మహరాజ్‌ను మీరు ప్రార్థించినట్లయితే వారు చాలా సంతోషిస్తారు. మిమ్మల్ని ఆ విధంగా జీవింపజేయాలని నేను కూడా బాబూజీని ప్రార్థిస్తున్నాను.

డాక్టర్ పార్థసారథి గార్కి, అనసూయమ్మ గారికీ, వారి కుటుంబ సభ్యులందరికీ, అభ్యాసులందరికీ కూడా బాబూజీ ఆశీస్సులు ఉంటాయి.

**ధ్యానంలో అనుభూతి కలగటం లేదు –అనేది సాధారణంగా అభ్యాసుల నుంచి వ్యక్తమయ్యే బాధ, దానిని పొందటం ఎలా?**

ధ్యానంలో అనుభూతి చెందటానికి ఈ విధంగా ప్రయత్నించండి: **మీరు ధ్యానంలో కూర్చునప్పుడు –"బాబూజీ నాలో ఉన్నారు. బాబూజీ నావారు, నేను బాబూజీకి చెంది ఉన్నాను" అను ఆలోచనాభావంతో కళ్ళు మూసుకొని బాబూజీ మీ ఎదుటే ఉన్నట్లుగా ధ్యానంలో నిమగ్నమవ్వండి.** ఇంకా మనుస్సు దారికి రాకపోతే –హృదయంలో పై ఆలోచననే మళ్ళీ చేయండి. క్రమంగా మీ హృదయంలో బాబూజీ మహరాజ్ యొక్క ఉనికిని, 'వారు' ట్రాన్స్‌మిషన్ ఇస్తున్నట్లు, దానిని మీరు పొందుతున్నట్లు అనుభూతి చెందుతారు. మీరు ఆ విధంగా దైవానికి దగ్గరై అనగా బాబూజీని సమీపించి వారిని కలుస్తున్నట్లుగా వారు మీకోసం ఎదురు చూస్తున్నట్లుగా అనుభూతి చెందండి. అప్పుడు బాహ్య జగత్తుకు చెందిన ఆలోచనలు ఏవైతే ధ్యానంలో కలవరపెడుతూ, దివ్యానుభూతి చెందకుండా అడ్డుపడుతుంటాయో, అవి సద్దుమణుగుతాయి. అప్పుడు ధ్యానంలో నిమగ్నత, అనుభూతి కలుగుతాయి. కనుక పై సమస్యకు ఇదే మంచి పరిష్కారం.

దీనిని సూక్ష్మంగా చెప్పాలంటే, ముందుగా ఆలోచన చేయటం– "నాలో బాబూజీ ఉన్నారు. బాబూజీ ఎదుటే నేను ఉన్నాను. వారు నావారు, నేను వారికే చెంది ఉన్నాను. వారికి నేను దగ్గరవుతున్నాను" అని. తర్వాత ఆ ఆలోచనలోనే మగ్నమై వారికి దగ్గరవుతున్న అనుభూతిని, వారి ప్రత్యక్షతను అనుభూతి చెందాలి. ఆ అనుభూతిలోనే మునిగి ఉండాలి, బాహ్యాలోచనలను లెక్కచేయకుండా. ఇది చాలా సులభమైన విధానం. ఉదాహరణగా చెప్పాలంటే, మీరు నది ఒడ్డున నిలబడతారు. స్నానం చేయాలనుకుంటారు. కాని అందులోకి దిగి లోతుకు వెళ్ళి మునకలు వేయకుండా స్నానం చేసిన అనుభూతిని పొందలేరు.

ధ్యానంలో కూడా ఆ దివ్యప్రవాహంలో మునిగి దివ్యానుభూతిని చెందుతూ అందులోనే మునిగి ఉండాలి. హృదయంలో బాబూజీని కలుసుకోవాలి. ఎంతోమంది అభ్యాసులు ధ్యానం చేస్తున్నారు, కాని ఎంతమంది ధ్యానంలో లోతుగా నిమగ్నమైపోతున్నారు అనేదే ప్రశ్న. బాహ్యప్రపంచపు ఆలోచనల్లో చిక్కుకుపోతారు. అలా కాకుండా దృష్టిని పూర్తిగా అంతరంగంలోకి మళ్ళించి, దివ్యప్రకాశం, అందులో బాబూజీ ప్రత్యక్షత, సామీప్యత మరియు ప్రేమను అనుభూతి చెంది, వారిలోనే జీవించటం అలవరచుకోవాలి. అప్పుడు మీ హృదయం కూడా ఆ విధమైన జీవితాన్ని అలవాటు చేసుకుంటుంది. కనుక ధ్యానంలో ఈ విధంగా దృష్టి నిలపాలి. నిరంతర స్మరణ వలన బాబూజీతో అనుబంధం పెరుగుతుంది.

**ప్రశ్న: నేను ధ్యానంలో కూర్చునప్పుడు ప్రాణాహుతి వస్తున్నట్లుగా అనుభూతి చెందుతాను. కొంత సమయానికి మిరుమిట్లుగొలిపే కాంతిని, బాబూజీని దర్శించుతాను. అంది మంచిదేనా?**

**జవాబు:** అది మంచిదే. బాబూజీ యొక్క సామీప్యత అనుభవమవుతోంది. అది చాలా మంచిది. వారు దివ్యపురుషులు. మీ ఆంతరికం దివ్యత్వంతో నిండి అటువంటి అనుభూతి కలుగుతోంది. బాబూజీకి కృతజ్ఞత తెలుపుకోండి.

**ప్రశ్న: దివ్యజీవనం చేయటం ఎలా?**

**జవాబు:** ఆలోచనా విధానంలోను, ప్రవర్తనలోను ఆధ్యాత్మికత వుట్టిపడాలి. ఆంతరికం మార్పు చెందాలి. మనల్ని గమనించినవారికి ఆధ్యాత్మిక సంస్థకు చెందిన వ్యక్తిగా మనం గుర్తింపబడాలి.

**ప్రశ్న: కోపాన్ని నియంత్రించటం ఎలా?**

**జవాబు:** లౌకిక జీవనంలో దానిని అణచటం సాధ్యపడదు. కాని దానిని జయించాలంటే నీవు ఈ విధంగా ఆలోచన చేయాలి: "నేను ఒక ఆధ్యాత్మిక సంస్థకు చెంది ఉన్నాను. నేను బాబూజీతో ఉన్నాను. నేను వారి దివ్యశక్తితో జీవిస్తున్నాను" అని మననం చేసుకుంటూ మన సహజమార్గ విధానంలో జీవించటానికి ప్రయత్నిస్తే క్రమంగా ఆ కోపంబారినుంచి విముక్తి పొందుతావు.

**ప్రశ్న: బెహెన్‌జీ! దయచేసి మీరు అనుభూతి చెందిన ఆ అంతిమ స్థితిని గురించి వివరించండి.**

**జవాబు:** బాబూజీ నా ఎదుట ఉన్నారు. అదొక అనుభూతి. మాటల్లో వర్ణింపనలవికానిది. ఎవరికి వారు దర్శించవలసిందేకాని ఒకరు చెప్పేదికాదు. ఇది నా పుస్తకాల్లో చాలాచోట్ల వ్రాశాను. బాబూజీ మహరాజ్ ద్వారా మీరు ఏదైనా పొందగలరు.

ఒకసారి డాక్టర్ వరదాచారిగారు బాబూజీతో "నేను సెంట్రల్ రీజియన్‌లో ఉన్నానని అనుకుంటున్నాను. అది నిజమేనా?" అని అడిగారు. అప్పుడు బాబూజీ– "నీవు సెంట్రల్ రీజియన్‌లో ఉన్నావని అనుకుంటున్నావు. అది సెంట్రల్ రీజియన్ అని నీకు ఎలా తెలుసు?" అని ప్రశ్నించారు.

అది బాబూజీ ఇచ్ఛప్రకారం జరుగుతుంది. నాకు ఏ రీజియన్ గురించీ తెలియదు. నా అనుభూతి గురించి బాబూజీకి తెలియజేసినప్పుడు, వారు నిర్వచించినదానినిబట్టి అది ఫలానా రీజియన్ అని నాకు తెలిసింది. బాబూజీ పరిశోధనా ఫలితంగా ప్రతి రీజియన్‌లోకి నిరభ్యంతరంగా, నిరాటంకంగా వెళ్ళటం జరిగింది. వారి ప్రాణాహుతిని పొంది పురోగతిని సాధించండి. అంతేకాని రీజియన్ల గురించి, పరమానందం

గురించి ఆలోచించనవసరం లేదు. సమయం వచ్చినప్పుడు వారే మీకు దర్శనమిస్తారు. నేను పుస్తకాలు వ్రాసేటప్పుడు స్థితుల గురించి, రీజియన్ల గురించి విపులంగా గ్రహింపజేసేవారు. వాటిని పొందటానికి మీరు కూడా స్వయంగా ప్రయత్నించండి.

**ప్రశ్న: బాబూజీ ఎక్కువగా అభ్యాసిని స్థూలత్వం నుంచి సూక్ష్మత్వం చెందమని చెప్పేవారు. ఆ స్థూల, సూక్ష్మత్వాలు ఏమిటి?**

**జవాబు:** స్థూలత్వమనేది 'అహం'కారంతో కూడుకొని ఉంటుంది. అది చాలా భారమైనది కూడా. బాహ్యప్రపంచంలో లౌకిక వ్యవహారాల్లో మునిగి ఉండటంచేత ఈ స్థూలత్వం ఏర్పడుతుంది. ఇది క్రమంగా తగ్గుతున్నకొద్దీ తేలికదనం లేదా సూక్ష్మత్వం చెందటం జరుగుతుంది.

అసలు ఈ అహంకారం అంటే ఏమిటి? ఎప్పుడైతే నీవు ఈ భౌతిక దేహం గురించి ఆలోచిస్తావో అప్పుడు 'నేను' అని అనుకుంటావు. అనగా నీవు ఒక ప్రత్యేకతను సంతరించుకుంటున్నావు. భిన్నమైన ప్రకృతిని సృష్టించుకుంటున్నావు. అలా కాకుండా మొదట దైవం నీలో ఉన్నాడు అను భావాన్ని పెంచుకో. అప్పుడు బాబూజీ నీలోనే దర్శనం ఇస్తారు. నీ అంతరంగంలో బాబూజీ (దైవం) ఉన్నారని అనుకొని వారి స్మరణలో ఉంటే ప్రాణాహుతి ప్రసారమవుతూ ఉంటుంది. క్రమంగా నిన్ను గురించిన ఆలోచన ఉండదు, కనుక అహం అనగా ఐనెస్ (నేను అనుభావం) తగ్గుతూ ఉంటుంది. దైవంతో అనుబంధం బలపడుతూ ఉన్నకొద్దీ 'నేను' అను భావం బలహీనపడుతూ ఉంటుంది.

ఈ ఇల్లు నాది. ఈ ఆస్తి నాది. వీరు నావాళ్ళుగా భావించే దేహ బాంధవ్యాన్ని వదిలించుకుంటూ దివ్యబాంధవ్యాన్ని నెలుకొల్పుకోవాలి. 'నేను' చేస్తున్నాను అని అనడానికి బదులుగా దైవంచేత, దైవం కొరకు చేయబడుతోంది అని గ్రహించి, తదనుగుణంగా వ్యవహరిస్తే ఆ 'ఐ'నెస్ అనగా 'నేను' అను అహంభావం యొక్క భారం తొలగిపోతూ ఉంటుంది. కనుక అహం-'నేను' అనేది భౌతిక దేహానికి జోడించబడిన ఆలోచన. అదే స్థూలత్వానికి కారణం. అలా కాకుండా బాబూజీకి జోడించిన (అనుసంధించిన) ఆలోచన దివ్యత్వానికి చెందినదిగాను, సూక్ష్మత్వం కలిగించేదిగాను ఉంటుంది. అందుచేత 'నేను' అనుదానిని బాబూజీకి సంధానపర్చాలి. ఈ దేహ, నామ, రూపాలకు ప్రయోగించే 'నేను'ను ఆ రియాలిటీకి (సత్యత్వానికి) చెందునట్లుగా చేస్తే అది దివ్యత్వం చెందుతుంది. Self is the Divine Shadow. అనగా 'నేను' అనేది దైవం యొక్క ఛాయగా (నీడగా) వివరించారు బాబూజీ. ఏ పని చేసినా కూడ దైవస్మరణలోనే ఉండి దైవపరంగానే చేస్తే అందులో అహం ఉండదు. దైవకార్యంగానే అవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, మనం తలపెట్టే పనిని 'స్వ'కార్యంగా కాకుండా దైవకార్యంగా భావించి, నిమిత్తమాత్రంగా చేసినట్లయితే స్థూలత్వానికి అవకాశం ఉండదు.

పాపం-పుణ్యం అంటే ఏమిటి? భారతదేశం అంతటా ఎప్పుడూ ఈ రెండింటి గురించే చర్చ జరుగుతూ ఉంటుంది -అని విదేశీ పర్యటనలో బాబూజీని ప్రశ్నించారు. అప్పుడు బాబూజీ ఇలా చెప్పారు: ఇంగ్లీషులో రెండు పదాలు SIN, SUN అనువాటిని పరిశీలిస్తే రెండింటిలోను మొదటి అక్షరం, చివరి అక్షరం ఒక్కటే. మొదటి మాట మధ్యన 'I' (నేను) ఉంటే రెండవ మాటలో మధ్యన 'U' (నీవు) ఉంది.

'I' అనేది 'Self' (అహం) కాగా 'U' అనేది డివైన్ అనగా దైవం. మొదటిదానిలో కర్త 'నేను' అయితే రెండవదానిలో కర్త 'నీవు' అవుతుంది. 'I' (నేను)ని 'U' (నీవు)తో కనెక్ట్‌చేస్తే అది (Divine) దైవానికి చెందినదిగా అవుతుంది –అని చెప్పారు. అంటే నీ సెల్ఫ్ (నేను అను అహంభావం)ను దైవంతో అనుసంధానం చేయాలి అని అర్థం. ఒక శబ్దాన్ని దురుపయోగంచేస్తే ఎంత మార్పు ఉంటుందో చూడండి. శబ్దాలను అపార్థం చేసుకోకూడదు.

ప్రతి మనిషిలోను ఈశ్వరాంశ ఉంది. ప్రతిదీ ఈశ్వరార్పితంచేసి దివ్యత్వం చెందవలసిన మనం, నాది, నాది –అంటూ దిగజారిపోతున్నాం. (ఇహం–పరం ఎలాంటివో నేను –నీవు కూడా అటువంటివే.)

**ప్రశ్న: కోపం వచ్చినప్పుడు బాబూజీని స్మరిస్తే అణగారిపోతుంది. మనం నిగ్రహించుకుంటాము. కాని ఎదుటివారు మనం సహనం కోల్పోయేట్లుగా, ఉద్రేకపరచేట్లుగా మాట్లాడుతుంటారు. అప్పుడు సంయమనం ఎలా పాటించాలి?**

**జవాబు:** కోపం అనే గుణాన్ని నీవు తొలగించుకున్నప్పుడు ఇతరులు నీలో కోపాన్ని కలిగించలేరు. కోపం నుంచి నీకు నీవే రక్షణ కల్పించుకోవాలి. నీ ప్రవర్తన మర్యాదపూర్వకంగా ఉన్నప్పుడు ఎదుటివారి కోపం నిన్ను స్పర్శించదు. నీలోని దివ్యత్వం ఆ కోపాన్ని తొలగించి వేస్తుంది. మనం జీవన విధానాన్ని క్రమబద్ధీకరించుకుంటే కోపం అనేది హృదయాన్ని తాకదు, అని బాబూజీ చెప్పారు. అందుచేత మనం బాబూజీలో జీవించాలి. అహం (నేను) అనేది కోపానికి గురిచేస్తుంది కనుక దానిని తొలగించుకోవాలి. అప్పుడు అహంవలన కలిగే స్థూలత్వం తొలగిపోయి సూక్ష్మత్వం చెందుతావు. ఆ విధంగా సూక్ష్మత్వం చెందినప్పుడు దైవానికి చాలా దగ్గరవుతూ ఉంటావు. తద్వారా సాలోక్యస్థితి కలుగుతుంది. ఈ స్థితిలో దైవం నీలోనే ఉన్నట్లుగాను, నీవు దైవంలోనే జీవిస్తున్నట్లుగాను అనుభూతి చెందుతావు. సూక్ష్మత్వం వలన నీవు పురోగమనం చెందటమూ అవుతుంది. నేను ఇతరులకు సమాధానం చెపుతున్నప్పుడు బాబూజీయే చెబుతున్నట్లుగాను, 'వారు' నా ఈ శరీరంతో పని చేయిస్తున్నట్లుగాను అనిపించేది. దీనినే బాబూజీ సాలోక్యస్థితి అని చెప్పారు.

**ప్రశ్న: దయచేసి సాలోక్యస్థితిని గురించి వివరించండి.**

**జవాబు:** ముక్తి (లిబరేషన్) స్థితిని పొందటానికి ముందు మూడు స్థితులు ఉన్నాయి. అవి వరుసగా సామీప్యత, సాలోక్యత, సారూప్యతా స్థితులు. బాబూజీ (దైవం) నీలో ఉన్నాడను భావన కలగ్గానే నీ నేత్రాలు వారినే చూస్తూ ఉంటాయి. వారు నీ ఎదురుగానే ఉన్నట్లు అనుభూతి చెందుతావు. ఇంకా, నీ చుట్టూ అన్ని దిక్కులలోనూ వారే ఉన్నట్లుగాను, నీ ఉనికిని నీవు గుర్తించలేకపోతున్నట్లుగాను అనుభూతి కలుగుతుంది. లోపల, బయట వారే వ్యాపించి ఉన్నట్లుగా ఉంటుంది. బాబూజీకి చేరువ కావాలనే తపన వలన ఈ విధమైన స్థితి కలుగుతుంది. ఇదియే మొదటి దైవ సామీప్యతా స్థితి. ఆ స్థితి యొక్క ఆనందంలో మునిగిపోయి, దానిని స్వంతం చేసుకున్నాక రెండవ స్థితియైన సాలోక్యస్థితిలోకి ప్రవేశించటం జరుగుతుంది. అప్పుడు నీవు ఈ ప్రపంచంలో నీ పరిసరాలలో జీవిస్తున్నట్లుగా కాకుండా బాబూజీతోనే, వారి ప్రపంచంలో, వారి ఆవరణలోనే జీవిస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఇది సాలోక్యతాస్థితి. ఈ విధంగా సామీప్యత, సాలోక్యత

స్థితులను నీవు స్వంతం చేసుకున్నాక కలిగే విచిత్రస్థితియే సారూప్యతా స్థితి. ఈ స్థితిలో నాకు కలిగిన అనుభూతి ఏమిటంటే, అద్దంముందు నిలబడి నా తల దువ్వుకోవాలని ప్రయత్నించినప్పుడు నాకు బాబూజీ ముఖమే కనిపించింది. నా ముఖం అక్కడ లేకపోయేసరికి ఆ ప్రయత్నం విరమించుకున్నాను. అదే విధంగా, అక్కడ బాబూజీ తమ గడ్డం చేసుకోవటానికి అద్దంముందు కూర్చున్నప్పుడు వారికి అద్దంలో నా రూపమే కనిపిస్తూ ఉండటంచేత, వారు కూడా ఆ ప్రయత్నం మానుకున్నారు. ఇటువంటి స్థితినే సారూప్యతా స్థితి అని బాబూజీ చెప్పారు. కనుక మీరు బాబూజీకి అర్పితమైపోయి వారితోనే జీవించగలిగితే సహజమార్గ విధానం ద్వారా మీరు ఈ స్థితులన్నింటినీ పొందగలుగుతారు. ఈ స్థితులను మీలో నేను చూడగలగాలని కోరుకుంటున్నట్లుగా మీకు నేను అనేకసార్లు చెబుతున్నాను.

ఇంక 4వ స్థితి –సాయుజ్యతా స్థితి. ఈ స్థితిలో నీవు (అభ్యాసి) బాబూజీలో లయమైపోవటం జరుగుతుంది. ఆ అనుభూతి ఎలా ఉంటుందో చూడండి. నీవు ఎక్కడ ఉన్నావు అని ఆలోచన కలిగినప్పుడు బాబూజీ శరీరాన్ని స్పర్శించినట్లుగానే ఉంటుంది. అనగా అంతటా బాబూజీ వ్యాపించి ఉండటమేగాని నీ అస్థిత్వం (ఉనికి) అంటూ ఉండదు. నాలోని ఇటువంటి స్థితిని గురించి బాబూజీకి తెలిపినప్పుడు వారు దానికి సంతోషిస్తూ తమ పరిశోధన ఫలించిందని తెలియజేశారు. దీనినే సాయుజ్యస్థితిగా వారు పేర్కొన్నారు. కనుక బాబూజీపట్ల ప్రేమ, అర్పితభావం ఉంటే ఆ లయావస్థను ఈ ప్రపంచంలో, ఈ కాలంలో ఎవ్వరైనా పొందగలగడం సులభతరమైనదే. బాబూజీ నాకు ఈ స్థితుల గురించి తెలియజేస్తూ నేను పొందిన అనుభూతులను అందరకీ తెలియజేయమని ఆదేశించారు. అనుభూతి (ఫీలింగ్) ముఖ్యంకాని, ఏ స్థితిలో ఉన్నదీ తెలుసుకోవటం ముఖ్యం కాదు.

వారి కృప, ప్రేమ మూలంగా అన్ని స్థితులూ కలుగుతాయి. “సమస్త మానవాళిని అంతిమం చేర్చటానికి నేను వచ్చాను” అని బాబూజీ పదేపదే చెప్పారు. అందరూ ఆ స్థితులను పొందటానికి సాధనచేసి సాధించగలిగితే బాబూజీ చాలా సంతోషిస్తారు. కనుక సాధనచేసి బాబూజీలో లయావస్థను పొందండి.

**ప్రశ్న: నా గుండె చప్పుడు ‘లబ్‌డబ్’ అని కుకాండా ‘రామ్–రామ్’ అని చప్పుడు చేస్తున్నట్లుగా ఉంది. ఇది వైద్యులకు కూడా అంతుబట్టటం లేదు. ఈ పరిస్థితి గురించి దయచేసి వివరించండి!**

**జవాబు:** బాబూజీ పేరు రామచంద్ర, కనుక ఈ ‘రామ్’ శబ్దం బాబూజీకి వర్తిస్తుంది. నిరంతర స్మరణలో అభ్యాసి మునిగిపోయినందున శరీరంలోని ప్రతి అణువు బాబూజీ స్మరణలోనే మునిగి ఉండటం ప్రారంభమవుతుంది. ప్రతి అణువు కూడా దివ్యత్వంతో నిండిపోతుంది. ఇది చాలా మంచి స్థితి. దీనినే హిందీ భాషలో ‘**అన్‌హద్**’ అంటారు. ఒక రకంగా ఇది సామీప్యతా స్థితిలో మునిగి ఉండునట్టి స్థితి. వారి ధ్యానంలో ఉండగా నాలో ఒక ధ్వని వెలువడింది. ఈ స్థితి నేను కావాలని ప్రయత్నించినది కాదు; దానిని బాబూజీ అనుగ్రహించారు.

**ప్రశ్న: ధ్యానం చేసిన తర్వాత మగతగా (డల్‌గా) ఉండటమూ, నిరాసక్తతగా చురుకుదనం లేకపోవటమూ జరుగుతోంది. దీనికి కారణం ఏమిటి?**

**జవాబు:** ధ్యానంలో నీకు తెలియకుండానే బాబూజీ మహరాజ్‌లో మునిగి ఉండటం జరుగుతుంది. ఆ తెలియని అనుభూతిని మగతగా భావించటం జరుగుతోంది. ఇంక రెండవది– చురుకుదనం లేకపోవటం లేదా అచేతనంగా ఉండటం. ఇది ఎందుకంటే, నీవు ఈ బాహ్య జగత్తులో జీవిస్తున్నప్పటికీ దానిపట్ల నిరాసక్తత ఉంటుంది. అప్పుడు ఆంతరిక జీవనం ప్రారంభమవుతుంది. అనగా బాహ్యజీవనంపట్ల నిరాసక్తి, ఆంతరిక జీవనంపట్ల ఆసక్తి కలగటం మూలంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. దీనినే హిందీ భాషలో **'ఉదాసీ'** అంటారు. (అంటే ఒక విధంగా మానసిక నిర్లిప్తత లేదా మౌనస్థితిగా చెప్పవచ్చునేమో!)

**ప్రశ్న: నేను 3 నెలలకు పూర్వం మిషన్‌లో చేరాను. రోజంతా ధ్యానంలో కూర్చోవాలని అనిపిస్తుంది. ఇంటిపనులు చేసుకోవాల్సి ఉంటుంది. ఎలా సమన్వయం చేసుకోవాలి?**

**జవాబు:** మీరు సహజమార్గ విధానంలో జీవిస్తున్నారు. నిద్రలేస్తూనే బాబూజీని స్మరించండి. వారి స్మరణతోనే ఏ పని అయినా చేయండి. రోజంతా మనస్సు పనుల్లో నిమగ్నమై ఉండటంవలన, పూర్తిగా బాబూజీని స్మరించటం సాధ్యంకాదు. అందుకు సులభమైన మార్గం ఏమిటంటే, "బాబూజీ! నేను మీ దానను. మీరు నా వారు. నేను మీతోనే ఉన్నాను. నాకు ఏమీ తెలియదు. నేను చేసేదంతా మీ కోసమే చేస్తున్నాను" అని తలచుకొని వారు మీ ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతూ పనిభారం వహించాలి. పనిలోపడి మర్చిపోయినప్పటికి బాబూజీ గుర్తుకురాగానే మళ్ళీ ఇదే విధంగా తలచుకొని అప్పటివరకు వారితోనే ఉన్నట్లుగా భావించుకోవాలి. ఈ విధంగా బాబూజీ స్మరణ, లౌకిక బాధ్యతలు సమతూకంలో జరుగుతుంటాయి. మీరు చేసే పని బాబూజీ సంతోషంకొరకే చేస్తున్నట్లుగా భావిస్తూ వారి స్మరణలో ఉంటే, వారితో అనుబంధం పెరుగుతుంది. అదే నిరంతర స్మరణగా కొనసాగుతుంది. ధ్యానంలో ఎంతసేపు గడుపుతున్నాము అనేది ముఖ్యంకాదు. నిరంతర స్మరణే ముఖ్యం. మీ పని భారమంతా వారిదిగానే భావించటం వలన సంస్కారాలు అంటవు. ప్రాపంచికమైన ఆలోచనలనుంచి మీకు స్వేచ్ఛ లభిస్తుంది. బాబూజీని స్మరించుకోవటంమనేది హృదయ పూర్వకమైన దివ్య అనుభూతిగా ఉండాలేకాని అనేకమార్లు నేను మీ దానను, మీరు నావారు అని మానసికంగా ఉచ్చరించుకోవటంగా ఉండకూడదు. ఇలా చేస్తే బాబూజీ దివ్యరూపం మీ ఎదుటనే ఉండి, మీకోసం నిరీక్షిస్తున్నట్లుగా అనిపిస్తుంది. వారి అనుగ్రహం లభిస్తుంది. సహజమార్గ విధానాన్ని, విషయాలను బాగా అర్థం చేసుకొని ఆచరిస్తే శీఘ్రంగా పురోగతి చెందవచ్చు.

**ప్రశ్న: కోపాన్ని అదుపులో ఉంచుకోవటానికి మర్యాదపూర్వకంగాను, మృదువుగాను మాట్లాడాలని చెప్పారు. కాని నేను ఎంత మర్యాదగా, అణకువుగా మాట్లాడినప్పటికీ బంధువులు నన్ను సతాయిస్తూ, ప్రేరేపిస్తున్నారు. దీనిని ఎలా నిభాయించుకోవాలి?**

**జవాబు:** ఆధ్యాత్మిక విషయాలను ప్రాపంచిక విషయాలతో పోల్చలేము. మీరు ప్రశాంతంగా ఉండటంతోపాటు మీ బంధువులను కూడా ప్రశాంతంగాను, సామరస్యంగాను ఉండమని అభ్యర్థించండి. బాబూజీని– నేను మీదానను, మీరు నావారు –అనుకుంటూ వారికి మీ సమస్యను నివేదించండి. పొరపొచ్చాలు లేకుండా

గృహంలో శాంతి అలుముకునేట్లుగా సమయోచితంగా, సందర్భానుసారంగా వ్యవహరించి సామరస్యం నెలకొల్పండి. ఆధ్యాత్మిక జీవనంలో సహనం ఉంటుంది కనుక దానిని కుటుంబ జీవనంలో కూడా అలవర్చుకోవాలి.

**ప్రశ్న: అభ్యాసీలలో సోదరభావం, ప్రేమ లోపిస్తున్నాయి. దయచేసి దీనిని గురించి చెప్పండి.**

**జవాబు:** ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. తోటి అభ్యాసులను గౌరవించాలి, ప్రేమించాలి. నేను ప్రతిసారీ చెబుతూనే ఉన్నాను –జీవన విధానం ఎలా ఉండాలి, ప్రేమ ఏ విధంగా ఉండాలి, ఆలోచన ఎలా ఉండాలి అనే విషయాల గురించి. ఒకరికొకరు ప్రేమాభిమానాల వాతావరణం సృష్టించుకోవాలి. బాబూజీపట్ల విశ్వాసం కలిగి ఉండాలి. ప్రాపంచిక వాతావరణంలో కాకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో జీవించాలి. బాబూజీనుంచి అంతా మనం నేర్చుకుంటున్నాము. సహజమార్గ విధానంలో ఎలా మార్పు చెందాలో మీ హృదయమే చెబుతుంది. మీ జీవన విధానం, ప్రవర్తన, సోదరభావం పెంపొందుంచుకొనండి. మీకు మీరుగా మార్పు చెందామనుకోవటం కాదు. మిమ్మల్ని గమనించిన ఇతరులు మీరు సహజమార్గ విధానాన్ని అనుసరిస్తున్నట్లుగా గుర్తించాలి. మనం పవిత్రత చెందినకొద్దీ బాబూజీ అనుగ్రహం లభిస్తూ ఉంటుంది.

అభ్యాసులు బాబూజీగారి ఇంటికి వెళ్ళినప్పుడు, బాబూజీయే స్వయంగా తమ వరండాలో నుంచి వాళ్ళకు ఎదురుగా వెళ్ళి ఆహ్వానించి, కూర్చోబెట్టి అతిధి మర్యాదులు చేసేవారు. స్వయంగా అన్నపానాదులు ఏర్పాటు చేసేవారు. వారిని చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. ఒకసారి మా తల్లిగారు బాబూజీగారి ఇంటిలో 42 రోజులు ఉండటం జరిగింది. అప్పుడు వారు ఎంతో శ్రద్ధగా విసుగు విరామం లేకుండా ప్రేమతో అతిథ్యం ఇచ్చారు. **మనం ఇతరులపట్ల కనబరిచే శ్రద్ధ, ప్రేమలో ఆడంబరం, ఆర్భాటం లేకుండా హృదయ పూర్వకంగా ఉండాలి; నిజాయితీగా ఉండాలి.**

**ప్రశ్న: విశ్వాసం అంటే ఏమిటి?**

**జవాబు:** మనం ధ్యానంలో కూర్చునప్పుడు హృదయం బాబూజీని స్మరించుకుంటున్న అనుభూతిని పొందుతుంది. ప్రాణాహుతిని గ్రహిస్తూ ఉన్న అనుభూతి కలుగుతుంది. దానివలన బాబూజీపట్ల విశ్వాసం వృద్ధి చెందుతుంది. ఒక అభ్యాసి బాబూజీవద్దకు వచ్చి తనకు విశ్వాసం అంటే ఏమిటో అర్థంకావటంలేదని చెప్పాడు. అప్పుడు బాబూజీ ఆ అభ్యాసిని కళ్ళు మూసుకుని తన ఎదుట కూర్చోమని చెప్పారు. అతడు అందుకు అంగీకరించి కూర్చుని ఉండగా బాబూజీ ప్రాణాహుతి ప్రసారంచేసి, నీలో ఎటువంటి అనుభూతి కలిగిందని ప్రశ్నించారు. ఆ అభ్యాసి తన హృదయంలో ఏదో చెప్పలేని దివ్యానుభూతి కలిగిందని చెప్పగా –విశ్వాసానికి ఇదే మూలాధారమని బాబూజీ చెప్పారు.

**ప్రశ్న: పూజ (ఆరాధన)కి, ధ్యానానికి గల భేదం ఏమిటి?**

**జవాబు:** పూజను జీవితపర్యంతం చేస్తూనే ఉండాలి. దీనిలో ఎప్పుడూ ఏదో చేయటమే ఉంటుంది. పొందేది ఏమీ ఉండదు. చేసినంతసేపు ఏదో తృప్తి మాత్రమే ఉంటుంది. తర్వాత దానిని మర్చిపోతాము. అనగా మళ్ళీ మళ్ళీ చేయటం, మానివేయటం జరుగుతుంది. ఆ ఆనందం, తృప్తి తాత్కాలికమేగాని నిలకడగా ఉండవు. దైనందిన కార్యక్రమాల్లో మునిగిపోగానే మర్చిపోతాము. మా ఇంటిలో కూడా రాముడు,

కృష్ణుడు మొదలైనవారి చిత్రపటాలు, విగ్రహాలు ఉండేవి. నేను కూడా పూజ చేశాను. అందుచేత అనుభవ పూర్వకంగా చెబుతున్నాను. రామాయణం పఠించినప్పుడు మాత్రం ఆనందం కలుగుతుంది, తర్వాత పోతుంది.

మన ధ్యానంలో బాబూజీ ప్రాణాహుతిని ప్రసారం చేస్తారు. హృదయంలోనే దైవం ఉన్నాడన్న విశ్వాసం మూలంగా మన ధ్యాస నిరంతరం దైవం మీదనే నిలిచి ఉంటుంది. ఈశ్వరీయ ధార ప్రవహిస్తూ ఉంటుంది. బాబూజీ మనకు దివ్యానందాన్ని ప్రసాదిస్తారు. అనవసరమైనవన్నీ తొలగిపోతూ హృదయంలో దివ్యత్వం నింపబడుతుంది. అనగా బాబూజీ మహరాజ్ ప్రాణాహుతి మరియు వారి కృప మూలంగా మన అహం తొలగిపోయి దివ్యత్వం పొందుతాం. మన జీవితపు అంతిమక్షణాల్లో బాబూజీని (దైవాన్ని) జ్ఞాపకం చేసుకోలేకపోయినప్పటికీ వారు మనల్ని మరచిపోరు. మనవెంటే ఉంటారు. ఆ విధంగా వారు వరమిస్తున్నారు. వారి ప్రేమ నిరుపమానమైనది. దీనినిబట్టి మనం కూడా ఇతరులను ఎలా ప్రేమించాలో నేర్చుకోవాలి. వారి ప్రేమలో, స్మరణలో మనం జీవించాలి. ఇలా జరిగినప్పుడు మనలో మంచి ఆలోచనలు వస్తాయికాని చెడు ఆలోచనలు దరికిరావు. సహజమార్గంలో ఇటువంటి ఉత్తమ జీవన విధానం ద్వారా మనకు ఆత్మోన్నతి కలుగుతుంది.

ఒక అభ్యాసి బాబూజీతో– "నేను చదువుకోలేదు. మాకు స్కూలు సమీపంలో లేనందువలన విద్యాభ్యాసం చేయలేకపోయాను. అందుచేత మీ పుస్తకాలు చదివే అదృష్టం నాకు లేకపోయింది" అని తన వ్యధను వెలిబుచ్చాడు.

అతని బాధకు స్పందించిన బాబూజీ "నీవు దిగులు చెందాల్సిన అవసరం లేదు. నీ హృదయంలోని ప్రేమను నేను చూడగలుగుతున్నాను. దేవుడు కూడా చదువుకోలేదు. ఏ భాషా 'అతని'కి తెలియదు. అనుభూతి ఒక్కటే 'అతని' భాష" అని ఊరడించారు. కనుక చదువురానివారు చదవలేకపోతున్నామని నిరుత్సాహపడనవసరం లేదు. బాబూజీని స్మరణలో నిలుపుకుంటూ ఉంటే, వారి పాదాలు స్పర్శిస్తూ ఉన్నట్లే! అప్పుడు అహం (ఎగో) నిన్ను స్పర్శించదు. బాబూజీ భూమి మీదకు అనంతం నుండి దిగివచ్చింది మనకోసమేనని చెప్పారు. అందుచేత వారివైపే నీ హృదయదృష్టి సారించి వారినే దర్శించాలి. వారు మనల్ని చూస్తున్నట్లుగాను, మనల్ని వారితోపాటు ముందుకు తీసుకుని వెళ్తున్నట్లుగాను అనుభూతి చెందాలి. ఈ విధమైన భావన, ఆచరణ మన ఉన్నతికి తోడ్పడతాయి. బాబూజీపట్ల ప్రేమను పెంచుకోవాలి. వారినే ఆధారంగా, వారే మనకు దిక్కుగా భావించుకోవాలి.

**ప్రశ్న: ప్రార్థన చేయకుండానే ధ్యానంలో ప్రాణాహుతిని పొందుతున్నాను. కాని ధ్యానానికి ముందు ప్రార్థన చెప్పుకోవాల్సిన అవసరం ఉందా?**

**జవాబు:** అవసరం లేదు. విధిగా ప్రార్థన చేయటానికి మనం నేరస్థులం కాదు. వారిని ఆరాధిస్తున్నాం. మన హృదయంలోకి ఆహ్వానిస్తున్నాం. బాబూజీ కూడా అలా చేయాల్సిన అవసరం లేదనే చెప్పారు. కాని రాత్రి నిదురించబోయేముందు విధిగా ప్రార్థన చేయాలి. ఎందుకంటే, పగలంతా పనుల్లో ప్రయాసపడి ఎన్నో ఆటుపోట్లకు గురై ప్రశాంతత కోల్పోయి ఉంటాము. అలాగే బాబూజీని స్మరించలేకపోయి ఉంటాము. అందుచేత ప్రార్థన ద్వారా మళ్ళీ తీరికగా వారికి అర్పించుకోవటం, తద్వారా ప్రశాంతత, ఉపశమనం

పొందటమూ జరుగుతుంది. వారి సహాయాన్ని అర్థించటం జరుగుతుంది. ధ్యాన సమయంలో వారి ఉనికిని అనుభూతి చెందాలి. కాని యాంత్రికంగా ప్రార్థన చేయాల్సిన అవసరంలేదు.

**ప్రశ్న: నేను అఫీస్‌లో పనిచేస్తున్న సమయంలో ఉన్నట్లుండి ట్రాన్స్‌మిషన్ వస్తుంది. అప్పుడు వెంటనే ధ్యానంలో కూర్చోవాలనే బలీయమైన కోర్కె కలుగుతుంది. ధ్యానంలో కూర్చునేవరకు మనస్సు కుదుటపడదు. అప్పుడు పది నిమిషాలు ధ్యానంచేసిన తర్వాత చాలా ప్రశాంతత ఏర్పడుతుంది. దీనిని ఏమనుకోవాలి?**

**జవాబు:** ఇది చాలా మంచిది. కొన్నిసార్లు మన ఆలోచన అంతరాంతరాల్లోకి వెళ్ళినప్పుడు, బాబూజీ నుంచి ప్రాణాహుతి హృదయంలోకి ప్రవేశిస్తుంది. ఆఫీస్‌లో చేస్తున్న పనిని బాబూజీ పక్షాన, వారి ఆనందం కోసమే చేస్తున్నట్లుగా భావించుకోవాలి. అప్పుడు పనితోపాటు నిరంతర స్మరణ కూడా కొనసాగుతుంది.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్న సమయంలో శిరస్సులో ఎడమప్రక్కన అప్పుడప్పుడు వైబ్రేషన్స్ (కదలికలు) వస్తాయి. కుడివైపు తలపై జలదరించినట్లవుతుంది. దీని అర్థం ఏమిటి?**

**జవాబు:** ట్రాన్స్‌మిషన్ ప్రభావం మూలంగా, ఎక్కడ ఏది అవసరమో అది జరపబడుతుంది. అది బాబూజీ చేపట్టే చర్య ఫలితంగా అలా జరుగుతుంది.

"బాబూజీ మహారాజ్! మీతోపాటు అనంత యాత్ర చేయటానికి మేము సిద్ధంగా ఉన్నాము. మేము పరిస్థితులకు బానిసలం; ఎన్నో బలహీనతలు, లోపాలు ఉన్నాయి. అయినా మీతోపాటు నడిచి లక్ష్యం చేరాలనే కోరిక ఉంది. మీ కృపాకటాక్షం వలన తప్పక విజయం సాధిస్తాము. మీరు మావారు, మేము మీవారము" అని తలచుకుంటే మనం ముందుకు పోతాం. మీ అందరికీ ఇదే నా సందేశం.

జ్ఞాపకం రావటం అంటే ఏవేవో జ్ఞాపకం వస్తాయి. కాని ఇక్కడ జ్ఞాపకం రావటమంటే అది బాబూజీ గురించి జ్ఞాపకం రావటమే. దానికొరకే మనం ప్రయత్నించాలి. అది మళ్ళీ మరచిపోనిదిగా కూడా ఉండాలి. బాహ్య జగత్తులో మైండ్‌కు విలువ ఉంది, కాని ఆధ్యాత్మిక విషయంలో హృదయానికే మైండ్ కంటే ఎక్కువ ప్రాధాన్యత ఉంది. చెడు ఆలోచనలకు తావివ్వకూడదు. ఎందుకంటే, మైండ్‌కు ఆటస్థలం వంటిది హృదయం. హృదయం పవిత్రంగా ఉండాలి. హృదయ పూర్వకంగా వచ్చే ఆలోచనల్లో బాబూజీయే నిండి ఉండాలి. బాబూజీ మనవారే అనే జ్ఞాపకం రాగానే హృదయంలో నిజంగా బాబూజీ మనవారే అనే అనుభూతి కలుగుతుంది. మామూలుగా ఆలోచనలు వస్తూ ఉంటాయి. ఒక ఆలోచనలో ఉంటూ ఉన్నప్పుడు మరొక ఆలోచన రాగానే ఆ ఆలోచన తొలగిపోతుంది. కాని "బాబూజీ మనవారే" అని వచ్చిన బాబూజీ గురించిన ఆలోచన, ఆలోచనగా కాకుండా జ్ఞాపకంగా అలాగే నిలిచిపోతుంది. అలా జ్ఞాపకంలో నిలుపుకోవటానికి తపన చెందాలి. అసలు మనం ధ్యానంలో ఎందుకు కూర్చుంటున్నాం? బాబూజీ మహరాజ్ దర్శనం పొందటానికి, వారిని ప్రేమించటానికి. ధ్యానానికి కూర్చున్నది ఇందుకొరకైతే, మనం వేరే ఆలోచనల్లో మునిగిపోతూ ఉంటాము. అసలు విషయం మర్చిపోతూ ఉంటాము. చూడండి, ఒక వస్తువు మనకు బాగా నచ్చినట్లయితే అలాంటి వస్తువు మరొకదాన్ని చూసినా మనకు ఆ నచ్చిన వస్తువే కళ్ళెదుట కనిపిస్తూ ఉంటుంది. అదే విధంగా బాబూజీ గురించిన జ్ఞాపకం ఎలా ఉండాలంటే, మళ్ళీ ప్రయత్నించనటువంటిదిగా ఎప్పటికీ ఉండాలి.

ప్రిసెప్టర్లు అభ్యాసులలో దైవంకోసమైన అశాంతిని రేకెత్తించాలి. అలాంటి అశాంతిని కలిగించగలిగితే అదే మంచి పని. ఎందుకంటే, దానివలన అభ్యాసిలో బాబూజీని ఎలా పొందాలి, ఎప్పుడు పొందగలుగుతాను అనునటువంటి తపన ప్రారంభమవుతుంది. ఆ తపన ద్వారా అతని సాధనలో దీక్ష కలుగుతుంది. అందుచేత అభ్యాసుల్లో తపనతో ప్రేరణ కలిగించగల శక్తిని, సామర్థ్యాన్ని ఇవ్వమని బాబూజీని నేను ప్రార్థిస్తున్నాను. బాబూజీ దివ్య సౌందర్యాన్ని, ప్రేమను పొందాలను తపన కలిగించునటువంటి పని అన్నింటికంటె మంచిది. మనిషికి ఒక కర్తవ్యం ఉంటుంది. బాబూజీ అనుగ్రహం పొందటం మన కర్తవ్యం.

మీరు అందరూ ఇక్కడ సమావేశమయ్యారు. ఒకరికొకరు ఏ ఊరు నుంచి వచ్చిందీ, ఏ ప్రాంతం నుంచి వచ్చిందీ, ఎలా వచ్చిందీ చర్చించుకుంటూ ఉంటారు. మనకు కావాల్సింది అది కాదు. అందరూ సమావేశమవుతున్నది ఒక్కందుకే, అది బాబూజీని స్మరించుకోవటం కొరకే, వారి ప్రేమను, కృపను మరియు ఈశ్వరీయతను పొందటానికే. ఈశ్వరుని చేరటం మన అంతిమ లక్ష్యం. అందుకే ఇక్కడ మనం సమావేశమయ్యాము. వారు మనందరినీ అంతిమస్థితికి చేర్చటానికే దిగివచ్చారు. కనుక వారి ప్రేమను, సామీప్యతను అనుభవం చెందాలి. వారిని ప్రాప్తం చేసుకోవాలి. వారు మన హృదయంలోనే ఉన్నారు. మనందరి దృష్టి వారి మీదనే ఉండాలి. అంతకుమించిన ఇతర ఆలోచనలు సరికాదు.

**వారిని ఈ విధంగా ప్రార్థించాలి: "ఓ స్వామీ! మీరు మా జీవిత ధ్యేయం. మీరు మాలోపల ఉన్నారు. మేము మీ సామీప్యతతో మీ కృపను, శక్తిని, మిమ్మల్ని పొందాలి. మీరు మావారు. మీ దర్శనం పొందుతాం. మీ దివ్య సౌందర్యాన్ని దర్శించుకుంటాము"** అని ఒక్కసారి హృదయ పూర్వకంగా ప్రార్థించాలి. అంతేకాని దానినే మళ్ళీ మళ్ళీ అనుకోవటం అనవసరం. ఒక్కసారి జ్ఞాపకం రావటమంటే హృదయం కరుగుతున్న బాధ అనుభవం కావాలని బాబూజీ చెప్పారు.

దైవం సర్వత్రా, సమస్తమందు ఉన్నాడు. అలాగే మీలోనూ ఉన్నాడు. బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా ధ్యానంలో కూర్చోవటమంటే, మీ దృష్టినంతటినీ దైవం మీద కేంద్రీకరించటమే. బాబూజీ మీలో కూర్చుని ఉన్నారు. మీకోసం వేచి ఉన్నారు. "అందరినీ అంతిమం చేర్చటానికే దిగివచ్చాను" అని బాబూజీ చెప్పారు. కనుక వారి ఆశయం నెరవేరాలంటే, మీరు అందుకు సహకరించాలి. మనకోసం వారు వరదహస్తాన్ని అందిస్తున్నారు, కనుక వారి చేతిలో చేయి కలిపి వారిని అనుసరించటానికి సిద్ధంకావాలి. వారికి మిమ్మల్ని మీరు పూర్తిగా అర్పించుకోవాలి. 'నేను' అనుకుంటున్న మీ అహంను వారికి సమర్పించాలి. బాబూజీ అన్నారు– "నాకు సెల్ఫ్ (అహం) లేదు. అందుచేత మీరు నాకు ఏది అయినా అర్పించాలి అనుకుంటే మీ 'అహం'ను నాకు సమర్పించండి" –అని. అనగా మనం వారి స్వంతమైపోవాలి.

నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను, అని మనం అనుకుంటున్నామంటే ఆ భావం శరీరానికి, మనస్సుకు చెందినదిగా ఉంటుంది. అలా కాకుండా 'నేను' స్థానంలో బాబూజీయే చేస్తున్నట్లుగా అన్వయించుకుంటే అంతా 'వారి'కే సమర్పించుకున్నట్లు అవుతుంది. కనుక అహంను తొలగించుకోవటానికి ఇదొక మార్గం; దానిని ఇలా సాధన చేయండి. ప్రతి పనిలోనూ నిన్ను మరచి 'వారి'నే చూస్తూ 'వారి'నే తలుస్తూ చేసినట్లయితే ఆత్మ సమర్పణకు అనువైన మార్గం ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక జీవనానికి ఇది చాలా

ముఖ్యం. 'నేను' అను అహంభావం పూర్తిగా మరచిపోవటమే లయావస్థ. అప్పుడు అర్పించుకోవటానికి మనవద్ద ఏమీ ఉండదు. ఉన్నదంతా బాబూజీయే. బాబూజీ మీ కళ్ళెదుటనే ఉన్నట్లుగాను, వారే అంతా చేస్తున్నట్లుగాను మీరు అనుభూతి చెందుతున్నట్లయితే నిదానంగా మీలో లయావస్థ ఏర్పడుతుంది. లయావస్థ అనేది దివ్యత్వానికి ఒక వెలుగు లాంటిదని, అది ముఖ్యావసరమని బాబూజీ చెప్పారు. కనుక దైనందిన జీవితంలో, దినచర్యలో ఇటువంటి ఆచరణ జరిగి తద్వారా మార్పు చెందాలి. మీరు ఏది చేస్తున్నప్పటికీ ఆ ఆలోచన, క్రియ మీదికాకుండా బాబూజీకి కనెక్ట్ చేసినట్లయితే అహం అదృశ్యమై (కరిగి)పోతూ లయావస్థకు దారితీస్తుంది. మిమ్మల్ని మీరు మరచిపోతూ హృదయంలో బాబూజీని స్మరిస్తూ మీరు వారి పవిత్ర పాదాలచెంతనే ఉన్నట్లుగా అనుభూతి చెందాలి.

నేను సహజమార్గ విధానం ద్వారా, చేస్తున్న ప్రతి పనినీ నాకు బదులుగా 'బాబూజీ'నే ఆ స్థానంలో నిలుపుకొని ఆచరించినప్పుడు, 'నేను' అనేది నా శరీరానికిగాని, నా పేరుకుగాని చెందలేదు. నిత్యజీవితంలో ప్రతి చర్యలోనూ బాబూజీ సంకల్పంగానే భావించుకోవటాన్ని తెలుసుకొని, "నీవు లయావస్థ దారిలోకి వస్తున్నావు" అని బాబూజీ వివరించారు. నేను 25 సంవత్సరాల తర్వాత పుస్తకం వ్రాస్తున్నపుడు, ఈ లయావస్థ క్రమం ఏదో అర్థం చేసుకున్నాను. కనుక అభ్యాసి స్వానుభవం ద్వారా తెలుసుకోవాలేగాని, ఒకరు వివరించితే తెలిసే విషయం కాదు. అనుభూతి ద్వారా దానిని అర్థం చేసుకోవటం సులభం.

దక్షిణ భారతదేశం నుండి అభ్యాసులు కొంతమంది వస్తూ ఉంటారు. వారు ఫలానా ఊరు నుంచి వచ్చాము అను చెబుతూ ఉంటారు. అలాగే కొంతమంది విజయవాడ నుంచిగాని, హైదరాబాద్ నుంచిగాని వచ్చినవారు కూడా తమ ప్రాంతాన్ని గురించి తలచుకుంటారు. అయినా మనకు ప్రాంతం ముఖ్యంకాదు. అందరూ శ్రీరామచంద్ర మిషన్ అభ్యాసులే. అభ్యాసులకు మధ్య వేర్పాటు ఉండకూడదు. అందరికోసం దిగివచ్చిన బాబూజీ మహరాజ్‌కు చెందిన అభ్యాసులు మాత్రమే అంతా. బాబూజీని చేరటమే అందరి లక్ష్యంగా ఉండాలి. **సామాన్యంగా నది వెళ్ళి సాగరంలో సంగమం చెందుతుంది. అటువంటిది సముద్రమే ఎదరు వచ్చి నదిని కలుపుకుంటే ఎలా ఉంటుందో, అలాగే అభ్యాసులమైన మనల్ని, హృదయాన్ని అర్పించుకున్న మనల్ని, దివ్యసాగరంలో దారి ఇచ్చి బాబూజీయే మనల్ని తమలో చేర్చుకోవటానికి ఎదురు చూస్తున్నారు. కనుక ఇది చాలా మంచి సమయం. మనం సిద్ధం కావాలి.**

ప్రశ్న: **"Simplicity ends in Divinity, Divinity ends in real essence."**

**"నిరాడంబరత (సూక్ష్మత్వం) దివ్యత్వంలో ముగుస్తుంది. దివ్యత్వం సత్యత్వసారంలో అంతమైపోతుంది" దయచేసి దీనిని వివరించండి.**

**జవాబు:** (So many say the simplicity is the covering of Babuji Maharaj -This is wrong) చాలామంది నిరాడంబరత (సూక్ష్మత్వం) అనేదానిని బాబూజీ యొక్క (ఆచ్ఛాదనం) 'ఆవరణ'గా భావిస్తారు. కాని అది సరైనది కాదు. నేను నా పుస్తకంలో వ్రాశాను కూడా. ఇక్కడ నిరాడంబరత అనేది ఒక దివ్య ప్రకృతి. ఆ దివ్య ప్రకృతి (దివ్య వాతావరణం) మన ముందు వ్యాపించి ఉంది. (If you say the simplicity is the Godly nature, then it will be the nature of a person. This is wrong. Babuji Maharaj's simplicity means the Divine nature.) ఈ నిరాడంబరతను దైవీయ స్వభావంగా

భావించితే అది తప్పు. అది వ్యక్తిత్వానికి చెందినదిగా ఉంటుంది. దీనిని మనం దివ్య ప్రకృతిగానో, (దివ్యావరణ) లేదా దివ్య వాతావరణంగానో అర్థం చేసుకోవాలి. బాబూజీ మహరాజ్ మనలో ఉన్నారు –అని అనుకోగానే వారిని మన హృదయంలో దర్శించటం, అనుభూతి చెందటం జరుగుతుంది. వారు మనల్ని ఆవరించి (ఆక్రమించి) ఉన్నట్లుగా అనిపిస్తుంది. నేను బాబూజీకి వ్రాసిన ఉత్తరంలో – నా పర్యావరణమంతా దివ్యత్వం ఆవరించి ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను –అని వ్రాశాను. దానికి సమాధానంగా "నీవు ఆ దివ్యావరణతో సంధానించబడి ఉన్నావు" అని బాబూజీ వ్రాశారు. కనుక ఆ నిరాడంబరత లేదా సూక్ష్మత్వం ఆ దివ్యత్వంలో కలిసిపోవటంగా భావించాలి. దివ్యత్వం నుంచి వేగంగా పొందిన స్థితి ఫలితం ఇది. ఈ విధంగా నిరాడంబరత (Simplicity) సూక్ష్మత్వంగా అవుతూ అంతమై దివ్యత్వం చోటుచేసుకుంటుంది. దీనిని ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకోవటం ద్వారా సత్యత్వస్థితి రాదు. అందుకుగాను బాబూజీని దర్శించుకుంటూ, వారి దివ్యానుభూతిని పొందుతూ, వారి సామీప్యతను పొందటం ద్వారానే ఈ నిరాడంబరత, దివ్యత్వంగా పరివర్తనం చెందుతుంది. ఆ దివ్యత్వంలో లయంకావలసిన అవసరం, కాగల అవకాశం మీ ముందు ఉంది.

దైవం (Divine) దివ్యత్వం (Divinity) యొక్క సారం; దివ్యత్వం యొక్క మూలం. అనుభవపూర్వకంగా చెప్పాలంటే, నేను బాబూజీయొక్క దివ్యాకర్షణలో ఉన్నట్లుగా అనుభూతి చెందేదానను. వారు నన్ను తమలోకి తీసుకుంటున్నట్లుగా అనుభవమయ్యేది. నేను నా శరీరాన్ని తాకటానికి ప్రయత్నించినప్పుడు, ఆ చర్య నా శరీరానికి కాకుండా బాబూజీని తాకినట్లుగాను, బాబూజీయే స్వయంగా వారు వారి శరీరాన్ని స్పర్శిస్తూ ఉన్నట్లుగాను అనిపించింది. ఇదియే దివ్యత్వంలో లయం చెందునటువంటి స్థితి. ఆ దివ్యత్వం బాబూజీ మహరాజ్ వారిది. దాని మూలాధారం వారే. దివ్యత్వం ఆ సత్యత్వసారంలో అంతమైపోవటం అంటే బాబూజీలో లయమైపోవటమే.

ప్రశ్న: **Babuji says, "The knowledge I want to impart to you all, is stressing upon you to know Him who knows all." Please explain.**

**"మీ అందరికీ నేను విడమర్చి గట్టిగా చెప్పేది ఏమిటంటే, ఎవరైతే సర్వజ్ఞులై ఉంటారో వారిని తెలుసుకొనండి" అని బాబూజీ చెప్పారు. దయచేసి వివరించండి.**

**జవాబు:** బాబూజీ చెప్పిన మాట వాస్తవం. ఇందులో బలవంతంకాని, భారంకాని ఏమీ ఉండదు. మీరు పొందే దివ్యానుభూతులే మీ జ్ఞానం. బాబూజీ కూడా అదే చెప్పారు. ధ్యానంలో మీరు పూర్తిగా మైమరచిపోయినప్పుడు పొందే సూక్ష్మత్వం, తేలికదనం, ఆనందంలో పూర్తిగా మునిగిపోండి. ఆ అనుభూతివలన మీకు విశ్వాసం కలుగుతుంది. ఆ విధంగా మీలో భక్తి విశ్వాసాలు కలిగినప్పుడు బాబూజీ కృపాకటాక్షం మీకు లభిస్తుంది. ఇదంతా అనుభూతి ద్వారానే తెలుస్తుంది.

బాబూజీ నన్ను ప్రిసెప్టర్‌గా చేశాక నేను చాలామంది అభ్యాసులకు సేవ చేశాను. అయినా నాకు పూర్తిగా విశ్వాసం ఉండేదికాదు. అభ్యాసులను వారు తీసుకొన్న సిట్టింగ్ ఎలా ఉందని ప్రశ్నించినప్పుడు వారు బాగుందని జవాబు ఇచ్చేవారు. వారు తృప్తిని, ఆనందాన్ని అనుభవించినట్లుగాను చెప్పేవారు.

అయినప్పటికి ఏదో కొరత ఉన్నట్లే అనిపించేది. ఆ విధంగా జరిగిన మూడు సంవత్సరాల తర్వాత అనుగ్రహించిన స్థితిలో నాలో కాన్ఫిడెన్స్ వచ్చింది. ఆ తర్వాత నేను అభ్యాసులకు సిట్టింగ్ ఇస్తున్నప్పుడు నా పనిమీద తృప్తి, పూర్తి విశ్వాసం కలిగింది. అభ్యాసులకు ట్రాన్స్‌మిషన్ ఇస్తున్న సమయంలో బాబూజీయే ఇస్తున్నారని అనుకుంటే ప్రిసెప్టర్‌కు వారి శక్తియొక్క అనుభూతి కలగదు. అందుచేత మనం (ప్రిసెప్టర్లు) బాబూజీలోనే జీవించాలి. ట్రాన్స్‌మిషన్ ఇచ్చేప్పుడు మన హృదయం దివ్యశక్తి కేంద్రంతో అనుసంధానమై ఉంటుంది. అప్పుడు బాబూజీ ఇచ్చిన పనిని చేయగలుగుతాం. నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను అని అనుకోకుండా 'వారి'ని ఆధారం చేసుకుని ట్రాన్స్‌మిషన్ ఇచ్చినట్లయితే అభ్యాసి పొందిన స్థితి మనకు కూడా సంతృప్తికరంగా ఉండటం, బాబూజీ నుంచి వచ్చే శక్తిని జీర్ణించుకోవటం జరుగుతుంది. ఆ విధంగా పూర్తి స్థాయిని పొందగలుగుతాం. అభ్యాసి కూడా బాబూజీ మహరాజ్‌నుంచి ఆ శక్తి వస్తున్నట్లుగా అనుభూతి చెంది దానిని చెప్పగలగాలి. అదే అతని జ్ఞానం; దానినే వినాలని బాబూజీ కోరుకుంటారు.

ప్రశ్న: **"Philosophy is the way of Thinking. Yoga is the way of Doing. Realisation is the way of Undoing"- Please explain.**

**"తత్త్వజ్ఞానం (ఫిలాసఫి) అనేది ఒక ఆలోచనా విధానం, యోగం అనేది ఒక ప్రక్రియ, సాక్షాత్కారం అనేది ఒక నిష్క్రియ (క్రియా రహితం) అన్నారు బాబూజీ. దయచేసి దీనిని వివరించండి.**

**జవాబు:** ఈ ప్రశ్నను అభ్యాసులు ఎంత బాగా అర్థం చేసుకుంటారో తెలుసుకుందామని అనుకుంటున్నాను. అందుకోసం వేచియుంటాను కూడ. ఫిలాసఫీ అంటే బాబూజీ దృష్టిలో ధ్యానంలో బాగా లోతుగా మునిగి ఉండటం, బాబూజీ సామీప్యతను పొందటం, దానిని అర్థం చేసుకోవటంగా ఉంటుంది.

ధ్యానం చేయటం అంటే, మనం ధ్యానంలో ఉద్దేశ్యపుర్వకంగా కూర్చుంటాము. అది ఏమిటంటే, ప్రాణాహుతిని పొందటం, నిర్మలీకరణ చేసుకోవటం, దివ్యానుభూతులు పొందటం. ఈ ధ్యాన ప్రక్రియ ద్వారా మనం దైవంతో అనుసంధానమవుతాం. ఇదే యోగం.

సాక్షాత్కార విషయంలో మనం తెలివితో చేసేది ఏమీ ఉండదు. అనగా లయావస్థ కలిగినప్పుడు ఏమైనా ఆలోచన చేయాలన్నా ఆలోచన చేయలేనటువంటి స్థితి. ఎందుకంటే, ఆ సమయంలో మనం బాబూజీలోనే జీవిస్తూ ఉంటాము. మనం అంటూ వేరుగా లేని స్థితి. ఈ శరీరంతో ఏది చేసినప్పటికి అది వారిదిగానే ఉంటుంది. దైవంతో అనగా బాబూజీతో అనుసంధానమైపోయి వారిలో జీవించటమే జరుగుతుంది. ఈ సత్యత్వం అనేది అనుభూతికి అందేది మాత్రమేగాని మాటల్లో వర్ణించటానికి అలవికానిది. బాబూజీ కోరుకునేది కూడా అభ్యాసి అనుభవం ద్వారానే జ్ఞానం పొందాలని. కనుక అభ్యాసులందరూ కూడా బాబూజీ ఆశించినట్లుగా కావటానికి మరీ మరీ కృషి చేయిండి.

**ప్రశ్న: సాక్షాత్కారం అను మాటకు అసలైన అర్థం - మరణానికి మరణం లేదా అంతానికి అంతం అని బాబూజీ చెప్పారు. దయచేసి వివరించండి.**

**జవాబు:** మీలో దహించివేస్తున్నంతగా తపన కలిగినప్పుడు దానికి సమాధానం మీకే తెలుస్తుంది.

**ప్రశ్న: సాక్షాత్కారం యొక్క సంపూర్ణ సాఫల్యం పొందటానికి ఆత్మ విలీనం ఒక్కటే (Self Dissolution) మార్గమని చెప్పారు. అదిఏమిటి?**

**జవాబు:** బాబూజీకి మీ ఆత్మసమర్పణ చేసుకోవటమే దానికి పరిష్కారం. మీరు బాబూజీలో లయం కావాలి. అనుభూతి చెందాలి, అర్థం చేసుకోవాలి. అలా జరగకుండా దానిని పొందలేరు. ధ్యానంలో మీకు ఆ ఆనందం కలుగుతుంది. ఈ విషయాలన్నీ నా పుస్తకాల్లో వ్రాశాను.

**ప్రశ్న: Babuji says, "Fear is the production of Lower Mind and Love is the production of Higher Mind." Please explain.**

**"మైండ్ యొక్క దిగువస్థాయిలో భయం, ఎగువస్థాయిలో ప్రేమ జనిస్తాయి. మరియు ప్రేమ చైతన్యమైనప్పుడు భయం తొలగిపోతుంది" అని బాబూజీ చెప్పారు. దయచేసి దీనిని వివరించండి.**

**జవాబు:** మీరు దైవాన్ని ప్రేమించాలి. భగవద్గీతలో శ్రీకృష్ణుడు నిన్ను పూర్తిగా తనకు సమర్పించుకొనమని చెప్పాడు. కనుక సంపూర్ణ విశ్వాసంతో ఆత్మసమర్పణ చేసుకోవటమే ఏకైక మార్గం. అప్పుడు మీ బాధ్యత దైవానిదే అవుతుంది. అందుచేత భయం వదలి దైవంపట్ల ప్రేమను పెంచుకోవాలి. అది ఉన్నతంగా ఉంటుంది.

**ప్రశ్న: "శక్తి అందరిలోను ఉంది. కాని దానిని స్వాగతించే వైఖరి మాత్రం లేదు" అని బాబూజీ చెప్పారు. అదేమిటి?**

**జవాబు:** దైవం నీలోనే ఉన్నాడు. అనగా ఆ దివ్యశక్తి నీలోనే ఎప్పుడూ ఉంటుంది. నీ ఆలోచనంతా ఈ ప్రాపంచికంగానే విహరిస్తూ ఉంటే నీవు ఆ దివ్య ప్రపంచానికి చేరలేవు. భగవంతునితో నీవు సంధానమైతే నీకు ఆ శక్తి వస్తుంది. అలా అనుసంధానం కాకుండా ఆ శక్తి సమకూరదు; దాని జాడ తెలియదు. సాధన ద్వారా దైవంమీద దృష్టి నిలిపి సాధించుకోవాలి. నీవు నీమీద ఆధారపడకుండా దైవంమీద ఆధారపడటానికి ప్రయత్నించాలి. ఆ విధంగా బాబూజీలో లయావస్థను సాధించుకుంటే 'శక్తి' నీ వశమవుతుంది.

**ప్రశ్న: "ప్రతి ఒక్కరూ సాక్షాత్కారం పొందవలసిన అవసరం ఉన్నమాట వాస్తవమే. కాని దానిని పొందాలన్న తపన ఎవ్వరికీ లేదు" అన్నారు. దయచేసి వివరించండి.**

**జవాబు:** ఈ ప్రశ్న మిమ్మల్నే అడుగుతున్నాను. అలా ఎందుకు అనుకోవాల్సి వస్తోంది? ఎందుకంటే, మీ ఆలోచన, శ్రద్ధ అన్నీ మీరు సృష్టించుకున్న ఈ ప్రపంచానికే అంటిపెట్టుకుని ఉన్నాయి. అసలైన విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. ఈ సృష్టికి కర్త ఎవ్వరు అనే ఆలోచన కూడా లేదు. దైవం అంతటా తానై, అందరిలోను తానుగా ఉన్నాడు. అందరినీ ప్రేమిస్తున్నాడు. ఆ ప్రేమ సూత్రంతోనే మనందరితోనూ కలిసి ఉంటున్నాడు. మీరు తరచిచూస్తే ఆ దివ్యసౌందర్యం ఎక్కడినుంచి వస్తోందో తెలుసుకోగలుగుతారు. ఆ దైవాన్ని గురించి ఆలోచించకుండా, దైవంతో సంబంధం కల్పించుకోకుండా –వ్యవహరించటం మానుకొని వారినే ప్రేమిస్తూ, వారితోనే జీవిస్తూ ఉంటే మీకు తప్పకుండా సాక్షాత్కారం సాధ్యపడుతుంది. దీనికొరకు నేను నా సాధనా మార్గంలో అనుసరించిన సులభమార్గం ఏమిటో చెబుతాను.

మీ ఆలోచన ఎలా ఉండాలంటే, బాబూజీ మహరాజ్ చాలా ప్రియమైన వారు, దివ్య సౌందర్యవంతులు, వారి ప్రేమ ప్రపంచమంతటా వ్యాపించి ఉంది, అని అనుకుంటూ వారి ధ్యాసలోనే మునిగి ఉండాలి. ఒకసారి నేను ఒక పెద్ద గులాబీపువ్వు ఎంతో అందంగా ఉన్నట్లు చూశాను. దాని అందానికి మురిసిపోయాను. వెంటనే అనిపించింది –బాబూజీ మహరాజ్ ఇంతకంటే ఇంకా అందంగా ఉంటారని; ఈ గులాబీపువ్వు అందం వారి సౌందర్యంతో పోలిస్తే చాలా స్వల్పం మాత్రమే అని. ఈ విధంగా మీ ఆలోచన, ఆచరణ కొనసాగితే 'వారి'పట్ల అనుబంధం పెరిగి మీకు ఆధ్యాత్మిక ఉన్నతి కలుగుతుంది.

**ప్రశ్న: ఆధ్యాత్మికంగా ముందుకు పోతున్నప్పుడు అనుభూతులు పొందటం తప్పనిసరి అనిగాని, అలా అనుభూతులు పొందకపోయినట్లయితే ప్రోగ్రెస్ (పురోగమనం) లేదనీ భావించవలిసి ఉంటుందా?**

**జవాబు:** ఇక్కడ తప్పనిసరి అనే పదం ప్రయోగించటం తప్పు. ధ్యానంలో దైవంమీద దృష్టి నిలుపుతాం, అనుభూతులు ఉంటాయి. మీరు దైవంతో సహజీవనం చేయాలనుకుంటే ముందుగా మీలో విశ్వాసం ఉండాలి. అందుకు తగినట్లుగా మీ జీవన విధానం, ఆలోచనా విధానం, తపన తీరు మార్పు చెందాలి. సాక్షాత్కారం పొందటానికి ఇవి అవసరం. ఎవ్వరైనా అభ్యాసి అనుభూతి కలగటంలేదని చెబుతున్నారంటే, అతడు ప్రోగ్రెస్ అవుతున్నట్లేకాని అతడు పొందే అనుభూతిని వివరించలేకపోతున్నట్లుగా బాబూజీ చెప్పారు. ధ్యానంలో కూర్చుని ప్రయత్నించాలి. పొందే తేలికదనాన్ని, దాని ఆనందాన్ని అనుభవిస్తూ అందులో మునిగి ఉండాలి. భక్తి, విశ్వాసం ఉండాలి. ధ్యానం చేస్తున్నది భగవత్ సాక్షాత్కారం కోసమనే ఆలోచన, లేదా తలంపు ఉండాలి. బాబూజీ మీలోనే ఉన్నారని, మిమ్మల్ని ప్రేమిస్తున్నారని, మీరు వారిని ప్రేమిస్తూ వారితోనే జీవిస్తున్నారనే ఆలోచన, అభిరుచి ఉంటే అనుభూతి రావటంలేదని అనుకోవటానికి అవకాశం ఉండదు. మీరు అలా భావించలేకపోవటమే అసంతృప్తికి కారణం.

**ప్రశ్న: "How to develop Sensitivity?" సూక్ష్మగ్రాహ్యతను ఎలా వృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** ఇది ప్రయత్నపూర్వకంగా సాధించబడదు. మీరు ధ్యానంలో కూర్చునప్పుడు దైవాన్ని పొందాలనే తపన ఉండాలి. అప్పుడు ఏదో అనుభూతి కలుగుతుంది. అలా కలిగిన అనుభూతిలో మునిగి అందులో జీవించాలి. దానిని గురించే స్మరించుకోవాలి, అర్థం చేసుకోవాలి. అప్పుడు మీకు ఆ సూక్ష్మగ్రాహ్యత అలవడుతుంది.

**ప్రశ్న: ప్రార్థనలో –నీవే ఏకైక దైవానివి, శక్తివి అని చెప్పబడింది. దానినిబట్టి బాబూజీ యొక్క మహాశక్తియే ఈ సృష్టి సమస్తాన్ని నియంత్రిస్తున్నదా?**

**జవాబు:** ఈ ప్రశ్ననుబట్టి, ఆ సర్వశక్తుడైన బాబూజీయే మనందరినీ ఆ అంతిమంకు తీసుకువెళ్ళటానికి దిగివచ్చారు అను విషయాన్ని పూర్తిగా విశ్వసించలేకపోతున్నావని భావించాలి. ఈ ప్రశ్న తగదు.

**ప్రశ్న: మనం దైవంలోనే జీవిస్తున్నామని, బాబూజీలోనే జీవిస్తున్నామని అనుకుంటే ఈ భౌతిక ప్రపంచంలో జీవిస్తూ బాధ్యతలు నిర్వర్తించటం, ఆలోచించటం ఎలా?**

**జవాబు:** ఇది సహజమార్గ విధానం. మనం ఆధ్యాత్మిక జీవనంలో ఉన్నత స్థితులు పొందగలమని బోధిస్తుంది. ఈ భౌతిక ప్రపంచంలో జీవిస్తున్నాం కదా! అనే ఆలోచన పెట్టుకోవటం సరైనది కాదు. మీరు ఒక

ఆలోచన లేదా సంకల్పం తీసుకోవాలి. మనల్ని ఉద్ధరించటానికి దిగివచ్చిన ఆ దైవం, బాబూజీ మహరాజ్‌లోనే మనం జీవిస్తున్నామని అనుకోవటమేకాదు హృదయంలో అనుభూతి చెందాలి. అప్పుడే మన సంస్థ లక్ష్యం బోధపడుతుంది, నెరవేరుతుంది కూడ.

**ప్రశ్న: ఒక అభ్యాసి తన వెన్నెముకలోను, ఇతర శరీర భాగాల్లోను, హృదయంలోను కంపనాలు (వైబ్రేషన్స్) అనుభూతి చెందుతున్నాడు. అలా ఎందుకని?**

**జవాబు:** తమ యొక్క ప్రాణాహుతి శరీరంలోని ప్రతి అణువులోను పని చేస్తుందని బాబూజీ చెప్పారు. ఆయా శరీర భాగాల్లో అవసరమైనమేరకు అతడిని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దటానికి ట్రాన్స్‌మిషన్ పనిచేస్తుంది. అటువంటి కంపనల, స్పందనల మూలంగా ట్రాన్స్‌మిషన్ పనిచేస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

**ప్రశ్న: నేను ధ్యానం చేస్తున్నప్పుడు కొన్ని కుదుపులు కలిగి క్రిందికి దిగి వస్తున్నట్లుగాను, ఆకాశంవైపు చీకటిగా ఉన్నట్లుగా ఉంటూ శరీరం వణుకుతున్నట్లుగా ఉంటుంది. ఎందుచేత?**

**జవాబు:** కుదుపులు అనేవి కొన్ని పాయింట్ (బిందువు)లను చైతన్యం చేయటానికి వస్తాయి. వణుకుతున్నప్పుడు కళ్ళు తెరచి చూసి మళ్ళీ ధ్యానంలోకి వెళ్ళాలి. ధ్యానంలో బాబూజీలో నిమగ్నమై ఉన్నప్పుడు మన ఇంద్రియాలు ఊర్ధ్వముఖంగా ప్రయాణించటం జరుగుతుంది. ధ్యాన ఫలితం ఉన్నతంగా వెళ్ళటమేకాని దిగజారటంగా ఎప్పుడూ ఉండదు.

ఆమధ్య అభ్యాసులు కొంతమంది జూలైలో ఉత్సవాలు ముగిసిన తర్వాత నావద్దకు వచ్చారు. అందులో ఒకరు ఒక మంచి ప్రశ్న అడిగారు. అది ఏమిటంటే, **లివింగ్ మాస్టర్‌మీద ధ్యానం చేసిన ఫలితం ఏమిటి?** అని. అతడు ధ్యానం చేస్తున్నప్పుడు తన హృదయంలో బాబూజీయే కనిపిస్తున్నారని, వారివైపే తన హృదయం ఆకర్షించబడుతున్నదని చెప్పాడు. నేను అతడ్ని- నీ హృదయం బాబూజీవైపు ఆకర్షించబడుతుండగా నీవు నీ లివింగ్ మాస్టర్‌లోనే జీవిస్తూ, వారి మీదనే ఎందుకు ధ్యానం చేస్తున్నావు? అని ప్రశ్నించాను. నీవు నీలో ఉన్న దైవం (బాబూజీని) గుర్తించి కూడా లివింగ్ మాస్టర్ అనుకుంటూ శరీరంమీద దృష్టి ఉంచుతున్నావు కనుక, ఆధ్యాత్మిక రంగంలో మొదటిస్థాయికి చెందినటువంటి జన్మరాహిత్యాన్ని కూడా నీవు పొందలేవు. ఇంక మోక్షం, ముక్తి అనేవి అసలేవి ప్రాప్తించవు. దైవంపైన ఉంచాల్సిన దృష్టిని శరీరంమీద ఉంచుతున్నందువలన ఆత్మోన్నతి కలగదు అని చెప్పాను. కనుక చైతన్యవంతంగా ఉండి బాబూజీతో ఆత్మీయత, అనుబంధం నెలకొల్పుకోవాలి.

ఒకసారి ఈశ్వర సహాయ్‌గారు బాబూజీతో –"నేను మీమీద దృష్టి ఉంచి ధ్యానం చేస్తున్నాను, చాలా బాగుంది" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "నీవు నీలో ఉన్న దైవం మీదనే దృష్టి నిలపాలి. ఆ దివ్యత్వం మీదనే ధ్యానం చేయాలి" అని చెప్పారు. అందుచేత సాక్షాత్కారం పొందాలంటే హృదయంలో ఉన్న దైవం (బాబూజీ) మీదనే ధ్యానం చేయాలి.

బాబూజీ మహరాజ్ జన్మదిన వేడుకల సందర్భంగా నాకు ఒక దృశ్యం కనిపించింది. బాబూజీ వచ్చి కుర్చీలో కూర్చుని అందరి హృదయాలలో దివ్యత్వం నింపుతున్నట్లుగాను, అందరికీ తల్లి మాదిరిగా ప్రేమ పంచుతున్నట్లుగాను ఆ దృశ్యంలో కనిపించింది. కనుక తల్లి ప్రేమ వంటిది వారి ప్రేమ, చాలా ఆత్మీయంగా ఉంటుంది.

**ప్రశ్న: "What is Balanced existence?"**

**సమతుల్య స్థితి అంటే ఏమిటి?**

**జవాబు:** సమతుల్యత ఒక ఆధ్యాత్మిక స్థితి. మానసిక స్థిరత్వస్థితి వేరు. దానిలో నిలకడ చెదరితే మార్పు కలగవచ్చు. కాని ఆధ్యాత్మికమైన సమతుల్య స్థితి ఒకసారి ప్రాప్తించాక చెక్కుచెదరదు. ఒక సందర్భంలో బాబూజీకి నేను ఇలా వ్రాశాను: "నన్ను ఎవ్వరైనా చూడగలిగితే నా శరీరంలోని ప్రతి కణమూ సమతుల్య స్థితిలో ఉన్నట్లుగా చూడవచ్చు. నా శరీరస్థితి పూర్తిగా అదే స్థితిలో ఉంది" అని. దానికి సమాధానంగా "నేను ఇప్పుడు నిన్ను ఒక **సెయింట్** అని చెప్పగలను" అని బాబూజీ వ్రాశారు. ఈ స్థితి మొదట సమత్వ దశతో ప్రారంభమవుతుంది. ప్రతి స్థితికీ ఒక కేంద్రం. అది పూర్తి శక్తివంతంగా ఉంటుంది కనుక, అది చివరకు ఆ కేంద్రంలో మునిగి సంపూర్ణ శక్తివంతమైన స్థాయికి చేరుతుంది. అప్పుడింక ఎటువంటి మార్పులకు గురికాదు. అదే నిశ్చలస్థితి. భావాలకు అతీతంగా ఉంటుంది. ఇది ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా కోపం అవసరమైతే దానికి తగినట్లుగా పనిచేసి వెళ్ళిపోతుంది. అలాగే ఏదైనా దుఃఖపూరితమైన ప్రదేశానికి వెళ్ళినప్పుడు కొంచెం సంతాపం చెంది వెంటనే అక్కడినుంచి వెళ్ళిపోతాను. కనుక ఆధ్యాత్మికపరమైన ఈ సమతుల్యస్థితి యొక్క కేంద్రాన్ని స్థిరస్థితి అనీ అంటారు. అది సంపూర్ణ శక్తివంతమైనదిగా ఉంటుంది. నేను సెయింట్ స్థితి గురించికాని, సమతుల్యస్థితి (సమత్వస్థితి)ని గురించిగాని ఎప్పుడూ చదవలేదు. నాలో కలిగిన స్థితుల అనుభూతిని వివరంగా బాబూజీకి తెలియజేసినప్పుడు, వారు ఆ స్థితిని ఫలానా స్థితిగా చెప్పినప్పుడే నాకు అది తెలిసింది. నేను ఫలానాస్థితి కలగాలని ఎప్పుడు కోరుకోలేదు. బాబూజీ పాదపద్మాలను ఆశ్రయించుకొని వారిని ఆరాధించటంవల్లనే ఈ స్థితులు అనుభవమయ్యాయి. కనుక ఆధ్యాత్మికత అంతా దీనిమీదనే ఆధారపడి ఉంది. వారి అనుగ్రహం లభించాక ఆ స్థితి పోతుందనే భయం అవసరంలేదు.

**ప్రశ్న: ఒక్కొక్కప్పుడు నేను ప్రాపంచికమైన దినచర్య చేపట్టబోయేముందు నా ఆంతరంగిక (ఆధ్యాత్మిక) ప్రయాణం గురించిన జ్ఞాపకం రాగానే ఏ పని చేయబుద్ధి కాదు. ఏం చేయాలి?**

**జవాబు:** "నీ బాధ్యతను నీవు చేపట్టు" అని బాబూజీ చెప్పారు. మైండ్‌ను ఇచ్చింది ప్రాపంచికమైన జీవిత నిర్వహణకే. అందుచేత మైండ్‌ను భౌతిక జీవనానికి అర్పించి, హృదయాన్ని బాబూజీకి అర్పించుకోవాలి. నీ ఎదుటనే బాబూజీ ఉన్నట్లుగా భావించుకుంటూ, వారి ఆజ్ఞానుసారంగానే ఆ పని చేస్తున్నట్లుగా భావించుకుంటే రెండు పనులూ నెరవేరతాయి. అలా పని చేయలేకపోతే నీ ధర్మాన్ని విస్మరించినట్లే. ఒక అభ్యాసి బాబూజీతో, "నాకు ప్రాపంచిక విధులు నిర్వహించటానికి మనస్కరించటంలేదు" అని చెప్పినప్పుడు "నీ శరీరం ఆహారం తీసుకోవటానికి ఇష్టపడటంలేదు, అని అంటే నీవు ఏమి చేస్తావు?" అని ప్రశ్నించారు.

**ప్రశ్న: మనం ఏ స్థాయిలో ఉన్నామో తెలుసుకోగలమా?**

**జవాబు:** అది సంభవమే. బాబూజీ ఎన్నో స్థితులు కల్పిస్తున్నారు. కాని వాటిని మీరు ఆస్వాదించి వదిలేస్తున్నారు. అలా కాకుండా మీరు ధ్యానంలో కూర్చున్నప్పుడు పొందిన స్థితుల అనుభూతిలో మునిగి ఉండటమే కాకుండా రోజంతా కూడా ఆ అనుభూతిని నెమరువేసుకుంటూ, స్మరణలో ఉండాలి. బాబూజీకి ఆత్మసమర్పణ చేసుకోవాలి. ఆ అనుభూతి ద్వారా మీరు ఎక్కడ, ఏ స్థితిలో ఉన్నదీ తెలుస్తుంది.

**ప్రశ్న: తల్లిదండ్రులుగా మేము మా పిల్లలను మంచి అభ్యాసులుగా తయారు చేయటానికి తీసుకోవలసిన చర్యలను దయచేసి సూచించండి.**

**జవాబు:** దీనికి సమాధానం బాబూజీ చెప్పారు. ముందుగా మీరు ఆధ్యాత్మికంగా సహజమార్గ విధానంలో ఎలా మెలగాలి, అని బాబూజీ చెప్పారో ఆ విధంగా మీ వాగ్ధోరణి (మాటతీరు), ఆలోచనాసరళి, జీవన విధానం మలచుకొని మీ ఇంట ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించండి. అప్పుడు మీ పిల్లలేకాదు, పరిసరాలలోని పిల్లలు కూడా ఆ ప్రవర్తనకు అలవడతారు. మీ ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు వారు కూడా ఆ వాతావరణానికి ఆకర్షితులవుతారు. అటువంటి ప్రవర్తన ద్వారా పరివర్తన కలిగినప్పుడు, మీరు ఇతర ప్రదేశాలకు వెళ్ళినప్పుడు మిమ్మల్ని గమనించినవారు మిమ్మల్ని "మీరు ఏదైనా ఆధ్యాత్మిక సంస్థకు చెందినవారా?" అని అడుగుతారు. అక్కడి వాతావరణం కూడా మార్పు చెందుతుంది. ఒక ప్రిసెప్టర్ బాబూజీతో –మా పిల్లవాడు తోటిపిల్లలను, ధ్యానంలో కూర్చొండి, అని ఆదేశిస్తున్నాడు, అని చెప్పాడు. అప్పుడు బాబూజీ, "అవును, అతడు ఒక ప్రిసెప్టర్ కుమారుడు కనుక, తండ్రి చేసినట్లు చేశాడు. నీవు ధ్యానం చేయటం చూసి ఉండలేదు, కనుక అతనికి ధ్యానం ఎలా చేస్తారో తెలియలేదు" అని చమత్కరించారు. అనగా ప్రిసెప్టర్ యొక్క పరిస్థితినే అతని కొడుకు ప్రదర్శించాడు.

సర్వదా మీరు బాబూజీ మహరాజ్ పాదపద్మాలను ఆశ్రయించుకుని జీవిస్తున్నట్లయితే మీరు ఎక్కడ ఉంటే అక్కడ వాతావరణం మార్పు చెందుతుంది. ఇది మొదట జరుగుతుంది. రెండవది ఏమిటంటే, మీలో ఉన్న బాబూజీ యొక్క దివ్య ప్రకాశం బయటకు విరజిమ్ముతూ ఉంటుంది. ఎవ్వరైనా దీనిని గమనించగలుగుతారు. శరీరం అంతా కాంతి వెదజల్లుతూ ఉంటుంది. మీరు సక్రమంగా బాబూజీ స్మరణలో, బాబూజీ సమక్షతను చూస్తూ ధ్యానం చేస్తున్నట్లయితే సంస్కారాలన్నీ రూపుమాసిపోతాయి. ఉదయం ఏర్పడిన సంస్కారాలు ఏమైనా ఉంటే సాయంత్రం నిర్మలీకరణలో తొలగిపోతాయి. కనుక 'వారి'లో జీవించండి. మీ ఆలోచనలో 'వారి'నే నిలుపుకోండి.

నేను ఆఫీస్‌కు వెళ్తున్నాను, ఫైలు తీసుకున్నాను, పని చేస్తున్నాను అని అనుకోకుండా వారి స్మరణలో ఉండి పనిచేస్తే అన్ని పనులూ జరిగిపోతాయి. నేను వంట చేస్తున్నప్పుడు, హృదయంలో వారినే స్మరించుకుంటూ ఉంటే ఎంతో ఆనందంగా ఉండేది. 'వారి'లోనే మునిగి ఉండేదాన్ని. ఈ విధమైన అభ్యాసం వలన భౌతిక జీవనం, ఆంతరికంగా ఆధ్యాత్మిక జీవనం ఒకదాని సరసన ఒకటి కొనసాగుతూ ఉంటాయి. అంటే భౌతికంగా మైండ్ పనిచేస్తుంది, ఆధ్యాత్మికంగా హృదయం (స్మరణతో) పనిచేస్తుంది. మన సంకల్పం ఆత్మ నుంచి శక్తిని గ్రహిస్తుంది. అందుచేత పని చేస్తున్నప్పుడు మీరు దైవంలో మునిగి ఉండాలి. బాబూజీ దూతీ, అదూతీ అని రెండు మాటలు చెప్పారు. ఒకదాని ద్వారా బాహ్యేంద్రియాలు పనిచేస్తే మరొక దాని ద్వారా ఆంతరికం ఆధ్యాత్మిక సారాన్ని సేవిస్తూ ఉంటుంది. రెండూ దైవ ప్రసాదితాలే. దైవాన్ని స్మరిస్తూ దైవంలోనే జీవిస్తూ ఉంటే, అంతా దైవమే (బాబూజీనే) చూసుకుంటారు. బాబూజీ స్వయంగా తమ ఇంటి పనులు కూడా చూసుకునేవారు. బజారుకు వెళ్ళి సామానులు కొని తేవటం కూడా వారే స్వయంగా చేసేవారు. ఇది మన ఆచరణ కొరకు వారు నేర్పుతున్న బోధన (శిక్షణ). ఇది మొదట కొంత ఇబ్బందికరంగా అనిపించినప్పటికి నిదానంగా అలవాటు అయిపోతుంది.

బాబూజీ కుమార్తె వివాహ సందర్భంగా వారు మూడు రోజులుగా నిద్రపోలేదు. అది గమనించిన ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీని విశ్రాంతి కొరకు నిద్రపోవలసిందిగా కోరినప్పుడు, వారు ఆ విషయమే మరచిపోయినట్లు చెప్పారు. అంతేకాకుండా లాలాజీ సాహెబ్ నా ఎదుట ఉండి నన్ను నిద్రించమని ఆదేశించలేదు కనుక నిద్రపోలేదు అన్నారు. ఇది మనకు ఒక రకమైన బోధన (శిక్షణ). అది ఏమిటంటే, మీరు నిద్రకు ఉపక్రమించేప్పుడు, బాబూజీ మహరాజ్ పాదపద్మాలవద్దనే ఉంటున్నట్లుగాను, అది మీకోసం కాకుండా బాబూజీ స్మరణకోసమే అన్నట్లుగాను భావించుకోవాలి. మళ్ళీ పని ప్రారంభించబోయేముందు– "నేను బాబూజీతోనే ఉన్నాను, నా హృదయం వారికే తెరచి ఉంచబడింది" అని భావించండి. ఈ విధంగా ఆచరిస్తే మీరు బాబూజీలోనే జీవిస్తున్నట్లుగా అనుభూతి చెందుతారు. సహజమార్గ విధానంలోని ముఖ్య విశేషం ఇదే.

ఈ విధంగా మీరు సాధన చేసినట్లయితే మీరు ఒంటరిగా లేకుండా బాబూజీతోనే ఉన్నట్లుగాను, బాబూజీ మీతోనే ఉన్నట్లుగాను అనుభూతి చెందుతారు. "ఎవ్వరైనా అభ్యాసి నన్ను పిలిస్తే నేను ఇక్కడ నిలువలేను" అని బాబూజీ చెప్పారు. దీనికి ఉదాహరణగా చెప్పాలంటే, నేను ఒకసారి బాబూజీకి "నేను మిమ్మల్ని స్మరించుకోగానే మీరు నా ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను" అని వ్రాశాను. వారు తిరుగుటపాలో "నీవు జ్ఞాపకం రాగానే నా ఎదుటనే నీవు ఉన్నట్లుగా తోచింది" అని వ్రాశారు. కనుక ఆలోచన ద్వారా కాకుండా సాధన ద్వారానే ఏ స్థితినైనా పొందశక్యమవుతుంది.

బాబూజీ మనకు బోధించే ఇంకొక విషయం కూడా మీకు వివరిస్తాను. అది ఏమిటంటే, మన ఎటాచ్‌మెంట్ (అనుబంధం) ఎప్పుడూ భౌతికపరంగా ఉండకూడదు. దీనికి నా అనుభవం వివరిస్తాను. నేను శ్రీరామచంద్ర మిషన్‌లో చేరిన తర్వాత మొదటిసారిగా షాజహాన్‌పూర్ వెళ్ళాను. వారు కుర్చీలో కూర్చుని ఉన్నారు. వారిని చూశాక, వారిని చూడకుండా జీవించలేనని, వారు లేకుండా ఇంటికి తిరిగివెళ్ళలేనని అనిపించింది. అక్కడే ఉండాలనిపించింది. నేను షాజహాన్‌పూర్ నుంచి తిరుగు ప్రయాణమైనప్పుడు నేను బాబూజీని మరొక రెండు రోజులు అక్కడే ఉండనిమ్మని అర్థించాను. వారు మాత్రం రిక్షా పిలిపించి దానిలో కూర్చుండమని ఆదేశించారు. నేను ఇంటికి వెళ్ళక తప్పిందికాదు. ఇంటికి వెళ్ళాక కూడా నా మనస్సు కుదుటపడలేదు. దిగులు నన్ను వేధిస్తోనే ఉంది. బాబూజీ నా ఎదుటే కనిపిస్తున్నారు. మళ్ళీ షాజహాన్‌పూర్ వెళ్ళి బాబూజీని ఆ కుర్చీలో కూర్చున్న భంగిమలో చూడాలని హృదయం తపన చెందింది. పది రోజుల తర్వాత మాస్టర్ ఈశ్వర సహాయ్‌గారి నుంచి నాకు ఒక లేఖ అందింది. బాబూజీ, ఈశ్వర సహాయ్‌గారిని మా ఊరు వెళ్ళి మా తండ్రిగారి అనుమతి తీసుకుని నన్ను తీసుకురమ్మని ఆదేశించినట్లుగా ఆ ఉత్తరంలో వ్రాశారు. అది నాకు ఎంతో ఆనందం కలిగించింది. అంటే ఈ విధంగా మనలో వారు తపన రేకెత్తిస్తారని గ్రహించాలి. నేను మళ్ళీ షాజహాన్‌పూర్ వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు బాబూజీ నన్ను మరొక రెండు రోజులు ఉండి వెళ్ళమన్నారు. నేను అప్పుడు బాబూజీని –అప్పుడు రెండు రోజులు ఉంటానంటే వద్దన్నారు. ఇప్పుడు వెళ్తానంటే ఉండమంటున్నారు ఏమిటని ప్రశ్నించాను.

ఆ తర్వాత నేను తిరుగు ప్రయాణంలోనూ ఇంటికి వెళ్ళిన తర్వాత కూడా వారు నా వెంటే ఉన్నట్లుగా వారి ప్రత్యక్షతను అనుభూతి చెందాను. ఆ విధంగా వారు మన భౌతికమైన అనుబంధాన్ని తొలగించి ఆ సత్యత్వంతో అనుసంధానింపజేస్తారు. వారు మనకోసమే వచ్చారని, వారు లేకుండా జీవించలేమని సదా భావించుకుంటూ ఉంటే మనం ఆ సత్యత్వంతో అనుసంధానమైపోతాం. బాబూజీ ప్రస్తావనలు, పలుకులు కేవలం మాటలు మాత్రమే కాదు. అవి అభ్యాసులు –బోధనలుగా, నేర్చుకునేవిగా భావించి, వాటిని ఆచరించాలి.

నేను, మాస్టర్ ఈశ్వర సహాయ్‌గారు కలిసి షాజహాన్‌పూర్ వెళ్ళేవాళ్ళం. మేము షాజహాన్‌పూర్ చేరే సమయానికి వారు కోర్టులో ఉండేవారు. కాని మేము వారి ఇంటికి వస్తున్నామని తెలిసి మేము చేరేసరికి ఇంటివద్ద కుర్చీలో కూర్చుని వేచియుండాలన్న ఉద్దేశ్యంతో వారు కోర్టు నుంచి ముందుగానే బయలుదేరి ఇంటికి వచ్చి ఆ విధంగా ఉండేవారు. అనగా మనం ఎలా వారిని జ్ఞాపకం చేసుకుంటామో వారు కూడా మనల్ని అదే విధంగా జ్ఞాపకం చేసుకుంటారు. అందుచేత వారి స్మరణ లేకుండా వారిని పొందలేము.

ప్రతి ఒక్కరిలోను సుప్తచేతనా మనస్సు (సబ్‌కాన్షస్ మైండ్) ఒక బోధకుడులాగా పని చేస్తుందని బాబూజీ చెప్పారు. దానివలన ఉదయం లేచిన దగ్గర్నుంచి నిత్య కార్యకలాపాలు జ్ఞాపకం చేసుకోనవసరం లేకుండానే జరిగిపోతూ ఉంటాయి. అనగా మన ఆలోచనలు ఆచరణ రూపంలో జరిగినవన్నీ దానిమీద ముద్రపడతాయి.

ఎవ్వరైనా శ్రద్ధగా ప్రయత్నిస్తే ఇలా జ్ఞాపకాన్ని సాధించుకోవచ్చు. దీనివలన మనం ఎవరిమీద ధ్యానం చేస్తున్నామో వారి రూపం ఆ సుప్తచేతనా మనస్సు (సబ్‌కాన్షస్ మైండ్) మీద ముద్రించబడుతుంది. విగ్రహారాధన, చిత్రపటాల పూజ లాంటివి కూడా ఇదే ఫలితాన్ని ఇస్తాయి. నేను కూడా శ్రీరాముని పూజించేదానను. ఒకసారి బాబూజీ మా ఇంటికి వచ్చినప్పుడు మా పూజా మందిరంలో ఐదు శ్రీరాముని చిత్రపటాలు ఉండటం చూశారు. నన్ను- పూజచేస్తావా నీవు, అని అడిగారు. అవును అని సమాధానం చెప్పినప్పుడు వారు ఒక్కొక్క చిత్రపటాన్ని చూపిస్తూ ఏ పటం మీద నీకు మక్కువ, దేనిపై పూజ చేస్తున్నావు అని అడిగారు. అలా వారు చూపిస్తున్నదానిలో మూడవ చిత్రపటాన్ని చూపించినప్పుడు, నేను పూజ చేస్తున్నది దీనిమీదనే అని చెప్పాను. అప్పుడు వారు, "నీవు శ్రీరాముని పూజించటానికిబదులు శ్రీరాముని చిత్రపటాన్ని పూజిస్తున్నావు" అని అన్నారు. అప్పుడు నాకు బోధపడింది నేను పూజించేది శ్రీరాముని కాకుండా చిత్రపటంలోని శ్రీరాముడ్ని అని.

కొన్నిసార్లు బాబూజీ మహరాజ్ నా ఎదుట ఉన్నట్లుగా ధ్యానం చేశాను. **బాబూజీ రూపం లేదా ఫొటో మీద కాకుండా వారి దివ్యత్వం మీదనే ధ్యానం చేయాలి.** మనలోనే ఉన్నాడనుకుంటున్న దైవం స్థానంలో బాబూజీని నిలుపుకోవాలి. ఆ విధంగా ధ్యానం చేయటం వలన సబ్‌కాన్షస్ మైండ్ మీద నిలిచిపోయిన ముద్రలన్నీ తుడిచిపెట్టుకుపోతాయి. ప్రేమ, శ్రద్ధతో ధ్యానంచేస్తే భక్తి పెరుగుతూ ఉంటుంది. **బాబూజీ చెప్పిన "దైవం నీలో ఉన్నాడు" అను ఆలోచన కల్పించుకుని, దానిని దృఢంగా నిలుపుకొని ప్రేమ, భక్తితో ధ్యానం చేస్తే మీ శ్రద్ధ వారి పవిత్ర పాదాలవద్దనే నిలిచిపోతుంది. ఇతరత్రా ఉన్న ధ్యాస, దృష్టి**

**తొలగిపోతాయి.** మీ సంబంధం దైవంతోనే నిలిచి, వారి దివ్యసౌందర్యాన్నే ఆస్వాదించటం జరుగుతుంది. బాబూజీ మనవారు కావటం మన అదృష్టం అని నామమాత్రంగా అనగా ఆలోచనాపరంగానే జ్ఞాపకం చేసుకోవటం కాకుండా హృదయపూర్వకంగా వారు మనవారేనన్న అనుభూతి చెందాలి.

సహజమార్గ విధానంలో సబ్జెక్ట్ లేదు. ఉన్నది సాధన మాత్రమే. సహజమార్గ విధానంలో దైవం నీలోనే ఉన్నాడు అని కల్పించిన ఆలోచనలోని దైవమే ఆబ్జెక్ట్ కనుక మీ దృష్టి (అటెన్షన్) దైవంతో సంబంధం కల్పించుకోవటంలోనే నిమగ్నమవుతుంది- అనగా బాబూజీతోనే. కనుక ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా బాబూజీయే మన కళ్ళెదుట ఉంటారు కాని ఇతర ప్రాపంచిక ఆలోచనలు రావు.

**(దీనిని మనం ఇలా అర్థం చేసుకోవచ్చు: మన ముందు ఉన్నది కర్త, కర్తవ్యం, లక్ష్యం. ఇందులో మనం కర్తలమైతే, మన లక్ష్యమైన దైవాన్ని పొందటానికి సాధన చేయటమే కర్తవ్యం. మన ధ్యేయం (లక్ష్యం) దేనిపైన నిలుస్తుందో అదే మన జ్ఞాపకంలో ఉంటుంది కనుక ఇతర ఆలోచనలు మన దృష్టిని ఆకర్షించలేవు.)**

ఒక అభ్యాసి -నేను చాలా సంవత్సరాలనుండి ధ్యానం చేస్తున్నాను. అందరూ ధ్యానంలో ఏదో పొందుతున్నట్లుగా చెబుతున్నారు. కాని నాకు ఏమీ తెలియటంలేదు -అని వాపోయాడు. అప్పుడు నేను ఇలా చెప్పాను: ధ్యానం గురించి నీవు ఏమి అర్థం చేసుకున్నావు? **ధ్యానం అంటే దైవాన్ని కలుసుకునే సమయం అని బాబూజీ చెప్పారు.** నీవు ఆలోచనకే పరిమితమవుతున్నావు కాని ధ్యానంలో తన్మయం కావటం లేదు. నీ మైండ్ దేహానికి చెందిన పనులు చేస్తూ ఉంటే, నీ హృదయం మాత్రం ధ్యానంలో లీనమవుతుంది. అందువలన నీవు ఏమి పొందుతున్నదీ నీ హృదయమే చెబుతుంది.

"నీ హృదయం నా కోసం తపనతో రోదించినప్పుడు నేను నిన్ను కలుస్తాను" అని బాబూజీ మహరాజ్ చెప్పారు. నిజమైన అభ్యాసియొక్క ఆర్తి దైవాన్ని రప్పిస్తుంది. కనుక ధ్యానంలో నీవు ప్రాణాహుతిని పొందుతూ ఉన్నట్లయితే ఏదో ఒక అనుభూతి అనగా దివ్యానుభూతి కలుగుతూనే ఉంటుంది. ఈ విధంగా సహజమార్గం, దానిపట్ల విశ్వాసం ఉన్నవారికి ఏదో ఒకటి ఇస్తుంది. అసాధ్యమైనదానిని బాబూజీ సుసాధ్యం చేయగలరు. కనుక తపన లేకుండా దైవాన్ని పొందటం అసంభవం. సహజమార్గంలో ఏమీ పొందకపోవటమనేది జరగనే జరగదు. 'వారు' దేనినైనా సంభవం చేస్తున్నారు, అసంభవం అనుకున్నదాన్ని కూడా సంభవం చేస్తున్నారు.

**ప్రశ్న: జీవుడు, పరమాత్మ ఒక్కరేనా?**

**జవాబు:** కాదు. రెండుగా చెప్పబడినప్పుడు ఒక్కటిగా అనలేము. అయితే జీవుడు పరమాత్మ కావాలనుకుంటున్నాడు. నేను బాబూజీకి- "నేను మిమ్మల్ని మొదటిసారిగా చూడబోయేముందు, నాలో జీవుడు మీకోసం, మీరు ఎలా ఉంటారు, మీ దివ్య సౌందర్యం ఎలా ఉంటుంది, అను ఆలోచన కలిగి, వెదకటం ప్రారంభించింది" అని వ్రాశాను. అనగా జీవుడు పరమాత్మను చేరాలనుకుంటాడు. సంస్కార బంధనాలు తొలగిపోయిన తర్వాత జీవుడు బయటపడి చైతన్యం కలిగి పరమాత్మను పొందాలనుకోవటం, అందుకు తపన చెందటం జరుగుతుంది. ఆ తపన వలన అశాంతి కలుగుతుంది. ధ్యానం యొక్క మూడ్‌లో లయమైపోవాలనే కోరిక కలిగినప్పుడు నేను నా శారీరక స్పృహ, స్పర్శ కూడా తెలియకుండాపోయి,

బాబూజీనే స్మరిస్తున్నట్లుగా అనుభూతి చెందాను. అంతటా బాబూజీయే ఉన్నట్లుగాను, వారి స్పర్శయే కలుగుతున్నట్లుగాను అనుభూతి కలిగింది. వారిమీద ప్రేమతో తపన చెందటం మూలంగా ఒక దివ్య వాతావరణం నెలకొన్నట్లుగాను, దైవమే స్పర్శింపపబడుతున్నట్లు గాను జరుగుతుంది. అటువంటి తపనతో నా హృదయం తల్లడిల్లినప్పుడు ఒక పాట వ్రాశాను. బాబూజీ షాజహాన్‌పూర్‌లో లేరని విన్నప్పుడు నేను చాలా బాధపడుతూ ఉండగా, బాబూజీ, "నేను అంతటా ఉన్నాను; నేను ఇక్కడే ఉన్నాను; నీవు ఇక్కడికి రా!" అని చెపుతున్నట్లుగా వినిపించింది. ఆ విధంగా వారు మనల్ని విడనాడరు! వారికోసం తపన చెందుతుంటే, అలా ధ్యానంలో నిమగ్నమవుతూ ఉంటే, వారు ప్రేమతో మనకోసం వేచి ఉన్నట్లుగా అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే, మనల్ని తీసుకువెళ్ళటానికే వారు దిగివచ్చారు కనుక. కనుక వారికోసం తపించి వారిని పొందటానికి సిద్ధపడండి.

నేను వ్రాసిన మరొక గీతంలో –బాబూజీ మహరాజ్ నన్ను భూమావద్దకు చేర్చినప్పుడు, వారి రెండు హస్తాలు నావైపు చాపి నన్ను ఆహ్వానిస్తున్నట్లుగాను, నన్ను వారి స్వగృహంలోకి తీసుకుని వెళ్ళుతున్నట్లుగాను, దానితో వారు "నీవు నా దానివి, నీవు నా దానివే" అని చెబుతున్నట్లుగాను అనుభూతి చెంది వివరించాను. కనుక మీరు హృదయంలో తపనతో "మీరు నా వారు, నేను మీ వాడను" అని భావించుకుంటూ సాధన చేసినట్లయితే, అది మొదట ఆలోచనపరంగానే అయినప్పటికి తర్వాత తర్వాత మీరు (ఆ మాట మర్చిపోయి) ఆ దివ్యస్థితిని పొందగలుగుతారు. ఈ విధంగా వారు సర్వత్రా ఉన్నట్లు వారి సామీప్యతను పొందుతున్నట్లు అనుభూతి చెందుతారు. అనగా మనోవాక్కు ద్వారా "వారు నా వారు" అని తలుస్తూ ఉంటే, హృదయం వారి ప్రత్యక్షతను పొందుతుంది. ఆ విధంగా పొందటానికి మీ హృదయం సంసిద్ధంగా ఉండాలి. మీరు స్వయంగా అనుభూతిని పొందగలిగినప్పుడు ఇతరులకు కూడా వివరించగలుగుతారు. ఎప్పుడైతే మీరు అనుభూతి చెందుతారో, అప్పుడు మీలో విశ్వాసం కలుగుతుంది. ఆధ్యాత్మికంగానే కాకుండా భౌతికంగా కూడా ఆ విశ్వాసం పెరుగుతుంది. అలా విశ్వాసం పొందటం ద్వారానే ప్రిసెప్టర్లు తాము పొందిన శక్తిని, అభ్యాసులకు కూడా అందజేయగలుగుతారు. నాకు కూడా మొదట నా పనిమీదే విశ్వాసం కలగలేదు. నాలో ఏదో లోపించిందని తపన చెందుతూ బాబూజీకి తెలియజేశాను. ఆ తర్వాత నా పనిమీద నాకు విశ్వాసం కలిగింది. దీనినిబట్టి విశ్వాసం అనేది మనకు సంబంధించినది కాకుండా బాబూజీకి సంబంధించినదిగా ఉంటుంది అని గ్రహించాను. ఆ విధంగా విశ్వాసం పొంది, ఆ విశ్వాసంతో పనిచేయాలి.

**నేను ఒకసారి సిట్టింగ్ ప్రారంభించబోయేముందు "స్టార్ట్ మెడిటేషన్" (ధ్యానం ప్రారంభించండి) అని అన్నాను. బాబూజీ అది విని "వారు ఇప్పటికే అభ్యాసులుగా ఉన్నారు. ఇప్పుడు ప్రారంభించటం ఏమిటి?" అని అన్నారు. అప్పుడు నేను నా పొరపాటును గ్రహించి అప్పటినుంచీ సిట్ ఇన్ మెడిటేషన్ (ధ్యానంలో కూర్చోండి) అని సంబోధించటం ప్రారంభించాను.**

ధ్యాన సమయం ముగిశాక (సిట్టింగ్ అయిపోయే సమయంలో) 'ఓమ్' అని ఉచ్చరించటం అంటే ధ్యానం తాత్కాలికంగా నిలుపుచేయమని అర్థం. అంతేకాని పూర్తిగా ముగించమని అర్థం కాదు. **మనం ఎల్లప్పుడూ ధ్యానం యొక్క ధ్యాసలోనే ఉండాలి.**

దివ్య జీవనం చేయాలి అంటే, హృదయంలో దివ్యకాంతిని చూడాలి. అది శారీరక వ్యవస్థలో పూర్తిగా ఉంది. అందుచేత దివ్య కాంతిని దృష్టిలో ఉంచుకోవాలని బాబూజీ చెప్పారు. ఆ వెలుగు మనలోనే కాదు, అంతటా ఉంది. అది అనంతం. మనం ఆ దివ్య కాంతితోపాటు దైవాన్ని కూడా చూడగలుగుతాము. మన కళ్ళల్లో బాహ్య వెలుగు తగ్గినప్పుడు ఆంతరిక కాంతితో దివ్య దర్శనం కలుగుతుంది. అర్జునునికి శ్రీకృష్ణుడు దివ్యదృష్టిని కల్పించి బ్రహ్మాండ మండలం దర్శింపజేశాడు. మనకు బాబూజీ ప్రసాదించిన ఆ దివ్యవెలుగు మూలంగా మనలోని మాలిన్యాలన్నీ తొలగిపోతాయి.

రెండవ విషయం ఏమిటంటే, ఎప్పుడైతే మనం ఆ కాంతిలో జీవించనారంభిస్తామో, అప్పుడు దైవం యొక్క సామీప్యతను పొందుతాం. ఆ సామీప్యతను ఎంతగా సాధించుకుంటామో అంత త్వరగా పురోగతి చెందుతాం. ఆ ప్రోగ్రెస్ మనం తెలుసుకోలేం. తెలుసుకోగలిగినా, తెలుసుకోలేకపోయినా అది మనకు లభిస్తూనే ఉంటుంది. మన ఈ పురోగతిని చూసి ఇతరులెవ్వరూ మనలో పురోగతి లేదని అభిప్రాయపడే అవకాశమే ఉండదు. ఇది బాబూజీ మనకు ఇచ్చిన అనుగ్రహం.

మనం ఎప్పుడైతే దైవం (బాబూజీ) మనలో ఉన్నాడని దృష్టి సారిస్తామో అప్పుడు ఆ దైవం కూడా మనవైపు దృష్టి నిలుపుతాడు. అది ఎలా ఉంటుందంటే, తల్లి తన బిడ్డలపై ఎలా ధ్యాస కలిగి ఉంటుందో అదే విధంగా దైవం, అనగా బాబూజీ కూడా మనపై ప్రేమతో కూడిన బాధ్యత వహిస్తారు. ఎప్పుడైతే పరస్పరమైన ప్రేమ దృష్టి ఉంటుందో అప్పుడు బుద్ధిలోపం వలన తప్పు చేయలేము.

సహజమార్గం బహువిశాలమైనది, పురోగమనం నెమ్మది నెమ్మదిగా జరుగుతుంది. అందుచేత ముందుకు సాగిపోవాలేకాని ఆగిపోకూడదు, అలసిపోకూడదు, ప్రక్కదారులు చూడకూడదు. ప్రాపంచిక దృష్టితో కాకుండా మన ఆంతరిక దృష్టితో చూడాలి. బాహ్యదృష్టితో మనకు అన్నీ కనిపించినప్పుడు, ఆంతరిక దృష్టితో ఆ అనుభూతులు ఎందుకు కనిపించవు? అలా దృష్టి సారించి చూస్తే ఆంతరికంలో ఏ దృశ్యం వ్యాపిస్తూ ఉందో అది కనిపిస్తుంది. ప్రయత్నం లేకుండా ఎలా కనిపిస్తుంది! మన పురోగతి తెలుసుకోవాలంటే, ఇదివరలో మనలో కోపం ఎంత తీవ్రంగా ఉండేది, ఇప్పుడు ఎలా ఉంది, ఇంతకుపూర్వం ఉన్న అశాంతి ఇప్పుడు ఎలా ఉంది –ఇలా వాటిని పోల్చి చూసుకుంటే తెలుస్తుంది. ఈ విధంగా పరిశీలించుకుంటే అందరిలోనూ సెన్సిటివిటి (సూక్ష్మగ్రాహ్యత) గ్రహింపుకు వస్తుంది.

బాబూజీతో ఒక అభ్యాసీ– నాకు ఏమీ అనుభవం కలగటం లేదు అని చెప్పినప్పుడు, "నీవు ఉప్పు తింటూ తీపి ఎలా ఉంటుంది అని నన్ను అడిగితే నేను ఏం చెప్పను" అని బాబూజీ అన్నారు. మీ ఆత్మ బాహ్యదృష్టితో ఉంటోంది. లోపల ఉన్న దైవం గురించి పట్టించుకోవటం లేదు. కనుకనే ఇలా జరుగుతోంది. దగ్గరే ఉన్నా దూరంగా ఉంటున్నాం. ప్రాపంచిక దృష్టివైపేకాని ఆంతరిక దృష్టివైపు జనం దృష్టి మళ్ళటం లేదు. విద్యార్థులు క్లాసులో హాజరుకు పిలిచినప్పుడు పలకకపోతే, హాజరుపడదని ఎలా సావధానంగా ఉంటారో అలాగే అందరూ సావధానంగా ఉండాలి. దైవాన్ని దృష్టిలో నిలుపుకోవటానికి ప్రయత్నించండి. దైవకృపను పొందండి. దీనికి బాబూజీ ఒక ఉదాహరణ చెప్పారు: "ఒక నెలంతా పనిచేస్తేనే నాకు జీతం వస్తుంది. కాని మీరు సిట్టింగ్‌లో కూర్చున్నప్పుడల్లా ఎంతో కొంత కృపాధార ఎప్పటికప్పుడూ వెంటనే వస్తూ ఉంటుంది" అని. కనుక ఎల్లప్పుడూ మరియు సిట్టింగ్‌లోనూ వారి స్మరణ లేదా జ్ఞాపకం నిలుపుకోవాలి.

**ప్రశ్న: ధ్యానంలో అసలు మనం చేసేది ఏమిటి?**

**జవాబు:** ధ్యానంలో మనం ఏం చేస్తున్నాం, ఏమి చేయాలి అనేది ముందుగా మనం అర్థం చేసుకోవాలి. దీనిని గురించి బాబూజీ సూక్ష్మంగా ఇలా చెప్పారు: ధ్యానంలో "దైవం నాలో ఉన్నాడు" అని అనుకుంటాము, అది వాస్తవం. ఆ దైవం అందరిలోనూ ఉన్నాడు. కాని మనం దైవాన్ని చూడటానికి ప్రయత్నించం. దైవం నీలో ఉన్నాడు, అని అనుకొన్నప్పుడు 'అతడు' నీవాడుగా భావించుకో. అప్పుడు 'అతని' దర్శనం కోసం నీలో తపన ప్రారంభమవుతుంది. అటువంటి స్థితిలో అనుభూతి కలుగుతుంది; స్మరణ జరుగుతుంది. "నేను ధ్యానం చేస్తున్నాను" అని అనుకోకుండా, దైవం నీలోనే ఉన్నట్లుగా భావించుకొని అది మాటల్లో కాకుండా నీ హృదయంలో దైవం ఉన్న అనుభూతిని పొందమని చెప్పారు బాబూజీ. ఆ విధంగా బాబూజీని జ్ఞాపకం కలిగినప్పుడల్లా వారిపట్ల ప్రేమ, భక్తి కలిగి ఉండాలి. హృదయంలో ఫీలింగ్ ఉండాలి. ఎప్పుడైతే వారు నీలో ఉన్నారన్న భావం కలుగుతుందో దానిలో వారి దివ్యప్రకాశం వ్యాపిస్తుంది. ధ్యానంలో జరిగే పని ఇది. బాబూజీని భౌతికంగా దర్శించటం కాకుండా వారి దివ్యత్వాన్ని ఆ దివ్యక్షేత్రంలో సందర్శించాలి. హృదయంలో అంతర్యామిగా దర్శించగలిగినప్పుడు వారి భౌతిక రూపం అదృశ్యమై ఆ సత్యస్వరూపమే నిలిచిపోతుంది.

**ప్రశ్న: మనం ఆధ్యాత్మికంగా ఎదుగుతున్నట్లు గ్రహించటం ఎలా?**

**జవాబు:** మీలో దైవం ఉన్నాడని నమ్ముతున్నారు. ధ్యానంలో మీరు ఆ దైవంమీద దృష్టి నిలుపుతారు. ఏమరుపాటు లేకుండా నిరీక్షణలో ఉండటం మంచిది. అలా ఉంటే మీ ప్రోగ్రెస్ నూటికి నూరుపాళ్ళు తెలుస్తుంది. అలా కాకుండా ధ్యానంలో నిద్రావస్థలో ఉంటే ఏమీ తెలియదు. దైవం యొక్క సామీప్యతను ధ్యానంలో అనుభూతి చెందగలిగితే అది ప్రోగ్రెస్‌కు చిహ్నంగా భావించవచ్చు అని బాబూజీ చెప్పారు. ధ్యానం ప్రారంభించేప్పుడు దైవం అనగా బాబూజీ మనలో ఉన్నారని, మన ఎదుటనే ఉన్నారని భావించుకుంటాం. అలా అనుకుంటూ ఉండగానే  హృదయం స్పందించి ఆనందం పొందుతుంది. ఆ విధంగా వారు ఉన్నారన్న తలంపుతో వారు ఉన్న అనుభూతిని కూడా పొందగలగాలి. నేను బాబూజీకి వ్రాసిన ఉత్తరంలో "నేను మిమ్మల్ని జ్ఞాపకం చేసుకున్నప్పుడల్లా మీరు షాజహాన్‌పూర్‌లో కాకుండా నా ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను" అని తెలిపాను. దానికి సమాధానంగా- "నేను నిన్ను తలచుకున్నప్పుడల్లా నీవు నా ఎదుటనే ఉన్నట్లుగా ఉంటోంది" అని బాబూజీ వ్రాశారు. ఆ విధంగా దైవం యొక్క ప్రత్యక్షతను పొందాలి. బాబూజీ ఒక చక్కని ఉపాయం చెప్పారు. అది ఏమిటంటే, మీరు దైవంకొరకు అన్వేషిస్తున్నప్పుడు, వారిని దర్శించాలని అనుకుంటారు. అప్పుడు దైవం అక్కడే ఉన్నట్లుగా ఒక ఆలోచన తలపెట్టి దృష్టి నిలిపితే మీకు దర్శనం కలుగుతుంది. ప్రోగ్రెస్‌కు ఇదే నిదర్శనం అని బాబూజీ చెప్పారు. అనగా ఆలోచనతోపాటు హృదయం స్పందించి వారి ఉనికియొక్క అనుభూతిని పొందాలి. అదే విధంగా వారి సామీప్యతను కూడా అనుభూతి చెందాలి. దైవం మనలోనే ఉన్నాడను ఆలోచన వారితో సంబంధం కలుపుకొని, వారిని దర్శింపజేస్తూ, వారి సామీప్యతను కలిగిస్తుంది. కనుక ఆనందం, నిరంతర స్మరణ కూడా అనుభవించటం జరుగుతుంది.

**ప్రశ్న: సమర్పణ అంటే ఏమిటి?**

**జవాబు:** సమర్పణ అంటే ఆత్మ సమర్పణ (సెల్ఫ్ సరెండర్). ఇది భౌతికమైనది కాదు. ఇది ఒక స్థితి. ఆత్మ సమర్పణ గావించుకున్నప్పుడు నీయొక్క ఉనికినే మర్చిపోవటం జరుగుతుంది. బాబూజీకి సమర్పితమైపోతున్నది ఒక ఆలోచన ద్వారా కాకుండా హృదయంలో ఒక అనుభూతిగా జరుగుతుంది. నిన్ను నీవు మైమరచిపోవటం, అంతా వారే అయినట్లుగా కలిగే స్థితి. నేను మీవాడను అనుకున్న ఆలోచన ఆంతరికంగా కార్యరూపం దాల్చి వారిచేత ఆమోదించబడినప్పుడు కలుగునటువంటి మరపుస్థితి. ఒక అభ్యాసి, "బాబూజీ! నేను మీకు ఏదైనా ఇవ్వగలనా!" అని అడిగినప్పుడు, బాబూజీ ఏమన్నారంటే, "నాకు 'నాది' (అహం) అనేది లేదు. కనుక, సమర్పించగలిగితే నీ 'సెల్ఫ్'ను (అహంను) సమర్పించు" అని అన్నారు. వారిపట్ల భక్తి, ప్రేమతో మనల్ని మనం అర్పించుకోవాలి.

**ప్రశ్న: నిర్మలీకరణ (క్లీనింగ్) అంటే ఏమిటి?**

**జవాబు:** దానిని గురించి ఎక్కువగా ఆలోచించవద్దు. మనం బాబూజీని మన హృదయంలో ప్రేమతో స్మరిస్తున్నప్పుడు వారు కూడా స్పందించి మనపట్ల ప్రేమను ప్రసరింపజేస్తారు. మనల్ని జ్ఞాపకం చేసుకుంటారు. "వారు నావారే!" అనే అనుభూతితో ఆలోచనలు కూడా పరిశుద్ధమవుతాయి. **సాయంత్రం నీవు నిర్మలీకరణ కొరకు కూర్చునప్పుడు వేరే ఆలోచన లేకుండా బాబూజీ నీ ఎదుటనే ఉన్నట్లు, ప్రాణాహుతిని ఇస్తున్నట్లు, నిన్ను కలవరపెట్టేవన్నీ తొలగిపోతున్నట్లు భావించుకొని దివ్యశక్తి నీలో ప్రవేశిస్తున్నట్లుగా అనుభూతి చెందితే నీ హృదయం నిర్మలమవుతుంది. చాలామంది అభ్యాసులు సంస్కారాలను పరిశుద్ధం చేసుకోవటానికి ప్రయత్నిస్తారు. ఇది చాలా అస్వాభావికం. అది మీచేతకాదు. అది మీరే చేయగలిగితే ధ్యానం యొక్క అవసరం ఏమి ఉంటుంది. ప్రధానంగా మీరు చేయవలసింది ధ్యానంలో వారి ప్రత్యక్షతను పొందండి. వారి దివ్యశక్తిలో, వారి దివ్యకాంతిలో మునిగి ఉండండి. ఆ విధంగా చేస్తున్నట్లయితే మీ స్వప్రయత్నం లేకుండానే మాస్టర్ (బాబూజీ) వాటిని సంస్కరిస్తారు. కనుక వాటిని (సంస్కారాలను) గురించి మరచిపోండి.**

**ప్రశ్న: మెర్జ్ (లయం) కావటం ఎలా?**

**జవాబు:** ఇది ఆలోచన ద్వారా సాధ్యపడేదికాదు. మాటల్లో వర్ణించబడేది కాదు. అనుభూతి ద్వారానే గ్రహించబడుతుంది. అందుకనే అనుభూతియే దైవభాష అని అన్నారు. అనుభూతి ద్వారా మీరు అన్నీ తెలుసుకోగలుగుతారు. ధ్యానంలో మిమ్మల్ని మీరు మైమర్చిపోయి అనుభూతి కొరకు నిరీక్షించాలి. అప్పుడు నిలిచి ఉండేది బాబూజీయే. అప్పుడు ఆ స్థితి మొదలవుతుంది. ఆత్మసమర్పణ చరమస్థాయికి చేరుతుంది. మిమ్మల్ని గురించి మీరు తలచుకోవాలనుకున్నా, ఆలోచించుకోవాలనుకున్నా కూడా అంతుబట్టదు. మీ స్థితిని, మీ అస్థిత్వాన్ని మీరు కోల్పోవటం జరుగుతుంది. ఇదే లయావస్థ. ఈ లయావస్థ పొందిన తర్వాత దానినుంచి బయటపడటం ఉండదు. ఈ స్థితి కలగటానికి వారు మనకోసం వేచి ఉంటారు. ఇది యదార్థం. బాబూజీ తమ పవిత్ర పాదాల చెంతకు నేను చేరటానికి అనుగ్రహించిన తర్వాతనే బాబూజీ నాకోసం వేచియున్నట్లుగా నేను తెలుసుకోగలిగాను. ఈ స్థితి కలగబోయేముందు అభ్యాసిలో ఉన్న తపనకొద్దీ ఒక ఛాయ లేదా ప్రతిబింబం కనిపిస్తుంది. లయమైపోయిన తర్వాత 'అసలు' (రియాలిటీ) దివ్య స్వరూపమే

దర్శనమవుతుంది. ఇంక అక్కడ తపనగాని, జ్ఞాపకంగాని, స్మరణగాని ఏమీ ఉండవు. ఇలా ఎందుకు జరుగుతుందంటే, వారిచ్చే ప్రాణాహుతి శక్తి, దానితోపాటు వారు అభ్యాసి కొరకు వేచియుండటమే కారణం. దివ్య ప్రకృతి ఈ విధంగా ఉంటుంది. మనం రోడ్డు ప్రక్కన ఎవరికోసమో వేచివుంటే, వారు రావటానికి ఆలస్యమైతే అసహనం, కోపం వస్తాయి. ఈ దివ్య ప్రకృతిలో కోపానికి బదులుగా తపన ఉంటుంది. అంటే భౌతికంగా కోపం అనబడితే ఆధ్యాత్మికంగా తపన అవుతుంది.

**ప్రశ్న: 2012వ సంవత్సరంలో ప్రళయం సంభవిస్తుందని అంటున్నారు, నిజమా?**

**జవాబు:** నాకు జోతిష్య విద్య తెలియదు. "నేను నన్ను జ్ఞాపకం చేసుకోవాలని అనుకుంటున్నప్పుడు నేను ఎక్కడా కనిపించటంలేదు. అంతటా మీరే కనిపిస్తున్నారు" అని బాబూజీకి తెలియజేసినప్పుడు వారు దానిని (Condition of pralay of 'Self') నా స్వీయ ప్రళయస్థితి అని వర్ణించారు. అది నా అస్థిత్వం (ఐడెంటిటి) యొక్క ప్రళయం కూడా. అంతకుమించి ప్రళయం అంటే నాకు ఏమీ తెలియదు. అభ్యాసి అయి ఉండి మీకు ఇలాంటి ఆలోచనలు ఎందుకు వస్తాయి. ప్రళయం వస్తే అందరూ మరణిస్తారు, నేనూ మరణిస్తాను, అని విచారపడేకంటే ఆనందంగా జీవించటం ఉత్తమం. బాబూజీ నిర్వచించిన ప్రళయం మీకు చెప్పాను. సత్యయుగంలో ఎలా ఉండేది? ప్రతి ఒక్కరూ తనను తాను మరచి దైవాన్నే తలచేవారు. కనుక సర్వం మరచి బాబూజీనే జ్ఞాపకం ఉంచుకోండి. సత్యయుగం అంటే దివ్యయుగం. దైవమే అంతటా గుర్తించబడే కాలం. మళ్ళీ ఆ యుగం లేదా కాలం రానుంది. బహుశా ఇదే ప్రళయం కావచ్చు.

**ప్రశ్న: మనం బాబూజీపట్ల భక్తిని అభివృద్ధి చేసుకోవటం ఎలా?**

**జవాబు:** వృద్ధి చేసుకోవటం అనేది ఎవరికీ సాధ్యపడదు. ఎందుకంటే, అది ఊహాపరంగా జరిగేది కాదు. అది అనుభూతి ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. మొదట మీరు నోటిమాట ద్వారా నేను మీవాడిని అనుకున్నప్పటికీ తర్వాత తర్వాత వారిని మీ స్వంతవారుగా అనుభూతి చెందుతారు. ఆలోచన ద్వారా అలా అనుకొన్నప్పటికి తర్వాత ఆ ఆలోచన లేకుండానే వారి ప్రత్యక్షతను పొందుతారు. అలా జరిగిన తర్వాత మీ భక్తి వృద్ధి చెందుతుంది. దీనికి సులువైనమార్గం –వారితో మీ అనుబంధం పెంచుకోవటమే. అది ఎలా అంటే, మీరు ఏ పని చేస్తున్నప్పటికీ దానిని బాబూజీ మహరాజ్‌యే చేస్తున్నట్లుగా అనగా మీ స్థానంలో ('నేను' స్థానంలో) బాబూజీనే చేస్తున్నట్లుగా భావించుకోవాలి. క్రమంగా ఆలోచన స్థానంలో వాస్తవానుభూతి కలుగుతుంది. అప్పుడు 'నేను' అనగా అహం తొలగిపోతుంది. నేను చేస్తున్నాను అని తలుస్తున్నప్పుడు, 'నేను' అనేది శరీరానికి చెందుతుంది. అది తప్పు. అలా కాకుండా దైవానికి చెందినట్లుగా భావించుకుంటూ ఉంటే మీరు సచేతనంగా ఉండి బాబూజీతో సంబంధం కల్పించుకుంటారు. 'నేను' స్థానంలో బాబూజీని నిలుపుకొని దివ్యత్వాన్ని పొందండి.

నేను ఇంటిపనులు చేస్తున్నప్పుడుగాని, వంటపని చేస్తున్నప్పుడుగాని నాకు ఏమీ తెలిసేదికాదు. ఎందుకంటే, నా కళ్ళెదుట బాబూజీయే ఉండేవారు. పనులు వాటంతట అవే జరిగిపోయేవి. సహజమార్గ విధానం ద్వారా బాబూజీ 'నేను' తత్వాన్ని (అనగా అహంను) తొలగించి సమస్త మానవాళిని అంతిమస్థితికి తీసుకు వెళ్ళటానికే అంతిమం నుంచి దిగివచ్చారు. వారి దివ్యశక్తి వాతావరణమంతా వ్యాపిస్తోంది. కనుక

సహజమార్గ విధానంలో మీరు ప్రవేశిస్తే అప్రయత్నంగానే మీలో ఆ స్థితి కలుగుతుంది. మీకు ఆనందం, అనుభూతి కలుగుతాయి. అనుభూతి రావటంలేదని ఎప్పుడూ అనుకోకూడదు. బాబూజీ చెప్పేవారు– బిడ్డ తన తల్లిని స్పర్శ ద్వారా గుర్తించగలుగుతుంది– అని. దైవం అంతటా ఉన్నాడు. అందరికోసం వేచియున్నాడు. పొందటానికి ప్రయత్నించాలి. జనులు నిద్రావస్థలో ఉన్నారు. దైవం వేచియున్నాకూడా చంటిపిల్లవానిలాగా కూడా గుర్తించలేకపోతున్నారు. కళ్ళు తెరచి దైవాన్ని దర్శించాలి అని బాబూజీ చెప్పారు. కొంతమంది అభ్యాసులు "తపన అంటే ఏమిటి?" అని అడుగుతున్నారని బాబూజీకి ఉత్తరం వ్రాశాను. వారు చెప్పినదానినిబట్టి మీరు ధ్యానంలో వారి సామీప్యతను పొందాలి. అలా సామీప్యతను పొందుతున్నప్పుడు ఒక ఛాయ లేదా ఆకారం మీకోసం వేచియున్నట్లుగా కనిపిస్తుంది. అది బాబూజీ సామీప్యతను పొందుతున్నటువంటి స్థితి. బాబూజీ నావారు అనుకుంటూ వారి దర్శనం పొందాలని పడేబాధయే తపన, అని వివరించారు.

ఆధ్యాత్మికత అనేది పూర్తిగా బాబూజీ నావారు, నేను వారికి చెందినవాడిని అని అనుకోవటంమీదనే ఆధారపడి ఉంది. దైవమే దిగివచ్చిన సమయం ఇది. కనుక వారిని చేరటానికి ఇదే మంచి తరుణం. మనల్ని ఆవరించిన మాయను దాటకుండా ముక్తి లభించదు. మరి మాయను దాటడం ఎలా? బాబూజీని ఒకరు "మీ సంస్థ యొక్క విధానంలో మాయనుంచి విముక్తిని పొందటం ఎలా?" అని ప్రశించినప్పుడు వారు ఇలా చెప్పారు: **"మీరు కళ్ళు తెరిస్తే కనిపించేది మాయ. అది దేహానికి చెందినది. మీరు మాయతో సంధానించబడతారు. కళ్ళు మూసుకొని అంతరంగంలోకి చూస్తే సృష్టికర్తయైన దైవం మీకు దర్శనం ఇస్తాడు. అప్పుడు మాయ దూరమవుతుంది"** అని. కనుక మనలోనే బాబూజీ ఉన్నారని అనుకొని వారిలోనే జీవిస్తూ, వారితోనే అనుబంధం పెంచుకొని, వారిపట్ల ప్రేమ, భక్తితో ఉంటే అప్పుడు మీరు మాయ నుంచి విముక్తులవుతారు. వారి సామీప్యతను పొందుతారు. మీరు వారితో అనుబంధం పెంచుకుంటే ఇది చాలా సులభం.

ప్రతిదీ నేను చేస్తున్నాను –అని మరీ మరీ అనుకుంటూ ఉంటే, అది ఒక బంధనంగా మారుతుంది. నిరంతర స్మరణలో మునిగి ఉంటూ, నేను చేస్తున్నాను –అని ఆలోచన రాగానే బాబూజీ మీ ఎదుట ప్రత్యక్షంగా ఉన్నట్లు చూడగలిగితే మీ (I-ness) అహం నుండి మీరు విముక్తులవుతారు. మీరు 'నేను' అనుకుంటూ, మీ శరీరానికి సంబంధించి ఉన్నంతవరకు అహం నుంచి విముక్తులు కాలేరు. అసలు శరీరమే మీది కానప్పుడు ఆ శరీరంతో చేస్తున్నానని ఎలా చెప్పగలరు? ఆలోచన వదలి బాబూజీ పవిత్ర పాద పద్మాలవద్దనే ఆశ్రయం పొందితే ఏ కష్టమూ లేకుండా ఉన్నత స్థితులు పొందగలుగుతారు. వారిని ఎలా పొందాలి అని తీవ్రంగా ఆలోచించండి, తపన చెందండి. సహజమార్గంలో ఉన్న ముఖ్యాంశాలు– ఆలోచించటం, అనుభూతి చెందటం, దైవ సాక్షాత్కారం పొందటం. ఇక్కడ ఉన్నది నేను–నీవు మాత్రమే. ఈ 'నేను' అనగా అహం అంతర్లీనమైపోతూ ఉంటే మిగిలేది బాబూజీ మాత్రమే. బాబూజీ దృష్టి మనమీద ఉంది; మనల్ని తీసుకు వెళ్ళటానికే వచ్చారు కనుక కష్టం అనేది ఉండదు.

నేను షాజహాన్‌పూర్ వెళ్ళి బాబూజీని చూడాలనుకుంటూ ఉన్న కొన్ని రోజులముందు వారి దర్శనం లేకుండా ఉండలేక రేయింబవళ్ళు వ్యధ కలిగేది. షాజహాన్‌పూర్ చేరాక, తిరిగి వెళ్ళటం కష్టమనిపించింది. బాబూజీ నా రాకను గమనించి, "ఓ! నీవు వచ్చావా!" అని పలకరించి ఒక్కసారి నా కళ్ళల్లోకి సూటిగా చూశారు. అప్పటినుంచి వారు షాజహాన్‌పూర్‌లో మాత్రమే కాకుండా అంతటా ఉన్నారని అనుభూతి కలిగింది. అనగా వారు నాలోని ఆలోచనను తుడిచివేశారు. కనుక సహజమార్గ విధానంలో చేరాక బాబూజీ మనకు ఏమిస్తున్నారో, ఎలా మనల్ని తయారుచేస్తున్నారో చూడండి!

**ప్రశ్న: మార్గదర్శకుడుగా ఒక గురువు అవసరమా?**

**జవాబు:** గురువు అనగానే మీరు ఒక వ్యక్తిగా భావిస్తారు. కాని గురువు అంటే మనల్ని దైవం దరికి తీసుకువెళ్ళే ఒక టెక్నిక్ అనగా కీలకం- అని బాబూజీ చెప్పారు. "మీరు భావిస్తున్నట్లుగా ఒక శరీరం గురువు కాదు. ఆ శరీరాన్ని గురువుగా భావిస్తున్నారు కాని నన్ను కాదు. గురువు అనగా ఈ శరీర బంధనం నుంచి విముక్తి పొందటానికి పరిష్కారం తెలిపే దివ్యశక్తి (కలవాడు) మాత్రమే. ఒక వ్యక్తి దేహంమీదనే నీ దృష్టిని నిలిపినట్లయితే నీవు ఎన్నటికి భక్తుడవు కాలేవు" అని కూడా బాబూజీ చెప్పారు. ఎందుకంటే, ఆ వ్యక్తి కూడా శరీరం అనే బంధనం నుంచి విముక్తి పొందినవాడు కాదు కనుక. గురుత్వం అనే పద్ధతిని తొలగించి మానవాళి అంతటికీ ప్రేమ పంచటమే తమ పని; ప్రేమయే గురువు, అని బాబూజీ చెప్పారు. కనుక అందరూ ఆ ప్రేమతో అనుబంధం పెంచుకుంటే ఏదైనా పొందగలరు. పూర్వకాలంలో ఆధ్యాత్మికత గురించి గురువులు ఎన్నో బోధలు చేసేవారు. కాని ఆధ్యాత్మికతకు గురువు ఎవ్వరూ లేరు. సహజమార్గ విధానంలో ఉన్నవి ప్రేమ, భక్తి మాత్రమే. ఇది బోధించటానికే బాబూజీ అవతరించారు.

**ప్రశ్న: ఎవరో ఒక మాధ్యమంగా ఉండాలి కదా!**

**జవాబు:** బాబూజీ మహరాజ్‌కు ఏ మాధ్యమం (మధ్యవర్తిత్వం) లేవు. వారు సర్వశక్తివంతులు. వారు ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ద్వారా ప్రేమను, శక్తిని ప్రసాదిస్తున్నారు. బాబూజీతో మీరు అనుబంధం పెంచుకుంటే ఇప్పుడు ఈ సమావేశంలో కూడా వారు ఇక్కడే ఉన్న అనుభూతిని చెందగలరు.

**ప్రశ్న: సహజమార్గ విధానంలో యాత్ర ఎప్పుడు ముగుస్తుంది?**

**జవాబు:** దివ్యక్షేత్ర కేంద్రం యొక్క తలుపు తెరచి ఉంచబడింది. దానిలో ప్రవేశించగలిగినప్పుడు యాత్ర అంతమవుతుంది. ఆ తర్వాత సత్యపద్‌లో ప్రవేశించినప్పుడు బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పంలోకి వెళ్తాం. అప్పుడు వారు తీసుకువెళ్తారు. అక్కడి నుంచి భూమాకు చేర్చుతారు. ఈ ప్రయాణం ఒక పడవలో ప్రయాణిస్తున్నట్లుగా ఉంటుంది. దానిని ఎవరు నడిపిస్తున్నారో తెలియనట్లుగా దివ్యత్వంలో ఉంటాం.

సహజమార్గ విధానంలో ప్రవేశం పొంది మూడు సిట్టింగ్‌లు తీసుకోవటానికే పరిమితం కాదు. ఈ విధానాన్ని అనుసరిస్తూ ఉంటే హృదయంలో బాబూజీయే ఉండగా వారిని స్మరించుకుంటూ ఉండటం మూలంగా సహజమార్గ విధానాన్ని అనుసరిస్తున్న విషయం కూడా స్పృహలో లేకపోవటం జరుగుతుంది. దీని ఉద్దేశ్యం సాక్షాత్కారం పొందటం. దానికే సాధన చేయాలి. సాధ్ అనగా ఇష్టం లేదా కోరిక. ఆ కోరికమినహా మరేదీ ఉండకూడదు. దానికి తగినట్లుగా తపన ఉండాలి. మనలో దైవం ఉన్నాడు,

దివ్యకాంతి ఉంది అని భావించుకోవాలి. ఒక్కసారి జ్యోతి వెలిగిస్తే మళ్ళీ మళ్ళీ ఎలా వెలిగించమో అలాగే ఒక్కసారి దివ్య ప్రకాశం ఉన్నట్లు భావించుకుంటే సరిపోతుంది. దానిని పదే పదే స్మరించకుండా ఆ కాంతి ఎక్కడి నుంచి వస్తోందో వెదుకుతూ ఉండాలి. అది బాబూజీ మహరాజ్ ముఖవర్చస్సు నుంచి వస్తున్నట్లుగా తెలుసుకున్నప్పుడు వారికి మనం దగ్గరవుతాం. ధ్యానంలో వారిని పొందేవరకు తపన చెందుతూ లోతుగా మునిగిపోవాలి. వారి సామీప్యతను పొందాలి.

భక్తి, ప్రేమ మూలంగా తపన కలుగుతుంది. ఆ తపన ఎంత తీవ్రంగా ఉంటే అంత త్వరగా వారిని పొందుతాము. వీటిని బయట సేకరించి అభివృద్ధిపరచలేము. హృదయంలోనే వాటిని పెంపొందించుకోవాలి. ఇది సహజం, సరళమైనదిగా ఉండాలి. అప్పుడు ధ్యానంలో తేలికదనం లేదా ఆనందం వంటి అనుభూతి ఏది కలిగినా, ధ్యానం ముగిసిందని అనుకోకుండా రోజంతా అదే అనుభూతిని నెమరువేసుకుంటూ అదే ధ్యాసలో ఉండాలి. ఆ అనుభూతిలోనే నిమగ్నమై, వారి ప్రత్యక్షతను హృదయంలో తిలకిస్తూ ఉంటూ, ఏ పని చేస్తున్నప్పటికీ, బాబూజీ మనకు సామీప్యతాస్థితిని అనుగ్రహిస్తారు. మన పురోగతి వేగవంతంగా ఉంటుంది.

నేను షాజహాన్‌పూర్‌లో ఉన్నప్పుడు సమావేశ మందిరంలో బాబూజీ కూర్చుని ఉండగా అభ్యాసులందరూ వారి పాదాలు స్పర్శించి నమస్కరించి వెళ్తున్నారు. నేను వరండాలో నిలబడి ఉన్నాను. స్త్రీలు వారి పాదాలు తాకకూడదనే నియమం ప్రకారం నేను అలా చేయలేకపోతున్నాను కదా! అని అనుకుంటూ ఉండగా, నాకు ఒక ఆలోచన వచ్చింది. బాహ్యంగా కాకపోయినా మనస్సులోనే వారి పాదాలపైన నా శిరస్సువాల్చి వాటిని స్పర్శించవచ్చును కదా! అని అనిపించి, ఆ విధంగా నమస్కరించాను. వెంటనే వారు బయటకువచ్చి "నీవు నా పాద స్పర్శ చేయకుండానే అంతా పొందుతున్నావు. ఇంక దీని అవసరం లేదు కదా!" అని అన్నారు. కనుక అంతరంగంలో ఉన్న బాబూజీకి పాదస్పర్శ చేశాను.

బాబూజీ అప్పుడప్పుడు విదేశాలకు వెళ్తూ ఉండేవారు. అలా వెళ్ళినప్పుడు వారు అక్కడ ఎలా ఉన్నారు, ఎప్పుడు తిరిగివస్తారు, తిరిగి ఎప్పుడు దర్శించుకుంటాను, అనే ఆలోచనలు వారి చుట్టూనే నాకు ఉండేవి. ఒకసారి వారు తిరిగివచ్చిన సందర్భంలో నేను వారిని స్వాగతించటానికి వెళ్ళాను. అప్పుడు బాబూజీ, "నీవు టిక్కెట్టు లేకుండానే విదేశాలన్నీ ప్రయాణించి వచ్చావు. నిన్ను పట్టించాలి" అని అన్నారు. దానికి సమాధానంగా నేను –"నేను మీవెంటే ఉన్నాను, మీతోనే ప్రయాణించాను కనుక, ఆ బాధ్యత మీదే" అని అన్నాను. బాబూజీ ఆ విధంగా మన అంతరంగాన్ని శోధించి మన అభీష్టాన్ని తెలుసుకుంటారు. వారే అనుగ్రహాన్ని ప్రసాదిస్తారు.

ఈ విధంగా ప్రతి అభ్యాసి కూడా వారి జ్ఞాపకంలో ఉంటూ వారి సామీప్యతను పొందాలి. ఈ ప్రకృతిని పరిరక్షించేందుకు లాలాజీ సాహెబ్ తమ ప్రార్థన ద్వారా బాబూజీని భూమా నుంచి భూమి మీదకు తీసుకువచ్చారు. **బాబూజీ మీ అందరి హృదయాలలో నిలిచి ఉండటం చూసిన లాలాజీ –నేను ఒక్క బాబూజీనే భూమిమీదకు తీసుకువచ్చాను, కాని ఇంతమంది బాబూజీలు కనిపిస్తున్నారేమిటి? అని ఆశ్చర్యపోయేలా మీరందరూ బాబూజీ యొక్క సామీప్యతను మీ హృదయంలో నిలుపుకోవాలి.** మీలో

చాలామంది అభ్యాసులు, బాబూజీ నన్ను ఒక్కరినే ఇలా తయారుచేశారు, అని అనుకుంటూ ఉండవచ్చు. బాబూజీ తరలివచ్చింది సమస్త మానవాళిని తీసుకువెళ్ళటానికి! అంతేకాని నన్ను ఒక్కదాన్ని మాత్రమే కాదు. కనుక అందరూ అలా తయారుకావటానికి సాధన చేయాలి. "దైవం ఎక్కడో లేదు, నా హృదయంలోనే ఉన్నాడు. నేను ఎప్పుడు తలవంచి చూస్తే అప్పుడు దర్శనమిస్తాడు" అని ఒక కవి భాషించాడు. చాలామంది అభ్యాసులు ధ్యానం చేస్తారు; అన్నీ ఆచరిస్తారు. కాని వారిలో తాము పొందుతూ ఉన్నదానిపై విశ్వాసం ఉండదు. విశ్వాసం మీపై మీకు లేకపోయినా బాబూజీ శక్తిమీద విశ్వాసం ఉంది కదా! కనుక బాబూజీ మీద విశ్వాసంతో సాధన చేయాలి. బాబూజీ యొక్క సంకల్పాన్ని నెరవేర్చాలి.

**ప్రేమను గురించి ప్రపంచంలో ఎవరికి తెలియదు. ఎందుకంటే, ప్రేమ కేవలం దైవదత్తమైనది. మన మధ్యనున్నది అనుబంధం (Attachment) మాత్రమే. ప్రేమ భగవంతుని (శ్రీ బాబూజీ) నుండి మాత్రమే ఏర్పడుతుంది. అభ్యాసీపరంగా భక్తి ఉండాలి.**

ఆత్మహత్య మంచిది కాదు. శ్రీ బాబూజీ మహరాజ్ "ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే అతడు మూడు జన్మల తర్వాతనే ముక్తి పొందుతాడు" అని చెప్పారు. (ఆత్మహత్య అనే తప్పిదం వలన అకారణంగా మూడు జన్మలలోని బాధలను భరించవలసి ఉంటుంది.) భగవంతుడు మనకు జన్మ ప్రసాదించినప్పుడు ఏదో ఒకరోజ ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టవలసినదే. విలువైన ఈ జీవితాన్ని వృధా చేసుకోవటం ఎందుకు!

శ్రీ బాబూజీ మహరాజ్‌గారి శరీరమే దివ్యశక్తి; వారి అంతరంగమే అంతిమ సత్యం (Ultimate Realty). శ్రీ బాబూజీ మహరాజ్ (Eternal) శాశ్వతమైన వారు.

బాబూజీ నన్ను (కస్తూరీ బెహెన్) చంద్ర లోకానికి క్షణంలో తీసుకొని వెళ్ళారు. కాని శాస్త్రవేత్తలు చంద్రునిపైకి రాకెట్ పంపడానికి ఎన్నో సంవత్సరాలు పట్టాయి. శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసీని కేవలం ఒక్క క్షణంలో అంతిమ సత్యంకు చేర్చగలరు.

పిల్లలు తల్లిని మరచిపోవచ్చు. కాని తల్లి తన పిల్లలను ఎప్పుడూ తలచుకుంటూనే ఉంటుంది. శ్రీ బాబూజీ మహరాజ్ మన తల్లి. "అభ్యాసులు నన్ను తలచుకొన్నా, తలచుకొనకపోయినా నేను మాత్రం అభ్యాసీలను గుర్తు పెట్టుకుంటాను" అనే చెప్పారు బాబూజీ. అంతటి అత్యున్నత మూర్తిమత్వం అయిన శ్రీ బాబూజీ మహరాజ్ మనలను వారి బిడ్డలుగా అంగీకరించడమనేది మన సౌభాగ్యం.

**ప్రశ్న: బెహెన్‌జీ! శ్రీ బాబూజీ మహరాజ్‌తో బంధాన్ని ఎలా పెంచుకోవాలి?**

**జవాబు:** బాబూజీని ప్రేమతో హృదయంలో స్మరించుకోవాలి. వారు మీ ఎదుటనే ఉన్నారని భావించి, స్మరిస్తూ ఉంటే అనుబంధం దానంతట అదే ఏర్పడుతుంది. ఈ స్మరణ మనస్సుతో లేదా మాటలతో కాకుండా హృదయానుభూతితో చేయాలి. ఎందుకంటే, మనస్సు ప్రాపంచిక పనులను చేయటానికి, హృదయం ఆధ్యాత్మికతకు మనకు భగవంతునిచేత ఇవ్వబడ్డాయి.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ మిమ్మల్ని అత్యున్నత స్థాయికి (స్థితికి) తీసుకుని వెళ్ళారు. ఇప్పుడు బాబూజీ మహరాజ్ భౌతికంగా లేరు. మరి మమ్మల్ని ఎవరు ఉన్నత స్థితికి చేర్చుతారు?**

**జవాబు:** శ్రీ బాబూజీ మహరాజ్ నామీద పరిశోధన చేశారు. వారు సప్త వలయాల అన్ని ద్వారాలను తెరచి,

వాటిని శాశ్వతంగా తెరిచే ఉంచారు. అన్ని మండాలలు (హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్, గాడ్లీ రీజియన్, సెంట్రల్ రీజియన్ మరియు (అల్టిమేట్) అంతిమ సత్యం) యొక్క కేంద్ర బిందువులవద్ద అనగా ప్రతి మండలం యొక్క కేంద్ర బిందువుకు కొద్దిగా ప్రక్కగా వారి దివ్య సంకల్ప శక్తి కేంద్రాన్ని ఉంచారు. ప్రేమ, తపన, భక్తితో ఉన్న అభ్యాసీ శ్రీ బాబూజీ మహరాజ్ దివ్య సంకల్ప శక్తి కేంద్రంవద్దకు వచ్చినప్పుడు, వారు ఏర్పరచిన శక్తి కేంద్రం (దివ్య సంకల్పం) దానంతట అదే అభ్యాసీని ఆకర్షించి తర్వాత ఉన్న ఉన్నత మండలానికి అప్పగిస్తుంది. ఈ విధంగానే భూమా (అంతిమ సత్యం) వరకూ తీసుకొని వెళ్ళుతుంది. అభ్యాసీ వారి దివ్య చరణాలను వదలకుండా పట్టుకొని ఉన్నప్పుడు, బాబూజీ మహరాజ్ భౌతిక రూపం లేకపోయినప్పటికి, అన్ని మండలాలలోని ప్రతి బిందువులోను ఉన్న వారి దివ్య సంకల్పం మరియు దివ్యశక్తి అభ్యాసీని ఉన్నతోన్నత స్థితులకు తీసుకొని వెళ్ళుతుంది. బాబూజీ మహరాజ్ భౌతికంగాలేరు అని అనుకోకూడదు. వారు శాశ్వతంగా ఉన్నారు, ఉంటారు.

కొంతమంది అభ్యాసీలు ధ్యానం చేస్తున్నప్పుడు నిద్రపోవటం, గురక పెట్టడం చేస్తారు. అంటే వారి మనస్సులో శ్రీ బాబూజీ మహరాజ్ ఉన్నారనే భావనలేదని అర్థం. శ్రీ బాబూజీ మహరాజ్ అక్కడే ఉన్నారన్న భావన లేనప్పుడు వారు (అభ్యాసీ) సౌకర్యంగా కూర్చొని నిద్రలోకి జారుకుంటారు. బాబూజీ నాకు ప్రియమైన వారు, నాకు దగ్గరగా ఉన్నారు, నాలోనే ఉన్నారు, నేను వారిని కలుసుకోవాలి, అని అభ్యాసీ భావించుకోవాలి. మీరు బాబూజీని స్మరిస్తుంటే మీలో ఆ అనుభూతి ఏర్పడుతుంది.

'వైరాగ్యం'కు నిజమైన అర్థం ఏమిటంటే, ప్రాపంచిక విషయాలతోగాని, వస్తువులతోగాని అనుబంధం లేకుండా ఉండటం. అంతేకాని వాటిని పొంది ఉండకపోవటం కాదు.

## సందేహాల నివృత్తి

## 03.09.1987 లక్నో కస్తూరీ బెహెన్‌జీ గృహం నందు

1. ప్రతినిధికి ఇవ్వబడిన శక్తి, ప్రిసెప్టర్లుకు ఇవ్వబడిన శక్తి కంటే అధికంగా ఉంటుంది. సంస్థను విస్తరించటానికి, మిషన్‌కు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగటానికి, వాటికి చెందిన ఆధ్యాత్మికపరమైన కార్యానికి మరియు మాస్టర్ (బాబూజీ మహరాజ్)తో అభ్యాసీలను అనుసంధానించటానికి ఈ శక్తి అవసరమవుతుంది.

2. ప్రతినిధి శ్రీ బాబూజీ మహరాజ్‌చేత ప్రసాదించిన శక్తిని తన సొంతం చేసుకోవటానికి కృషి చేయవలసి ఉంటుంది. ఆ శక్తిని సొంతం చేసుకున్నప్పుడే ఆయన ఆ ఇవ్వబడిన శక్తికి మాస్టర్‌గా పిలువబడతారు. తనకు ప్రసాదించిన శక్తిని సొంతం చేసుకున్నప్పటికీ ఆ అనంత శక్తిని త్రాగటానికి అతడు శ్రీ బాబూజీ మహరాజ్ మీద తన దృష్టి నిలుపవలసి ఉంటుంది. ఆ శక్తిని సొంతం చేసుకోవటానికి ప్రతినిధి చేసిన ప్రయత్నాల గురించి కాని, తాను ప్రవేశించిన లేక దాటిన వివిధ స్థితులను గురించి కాని, ఆయన తన ప్రసంగాలలో సూచించవచ్చు.

3. శ్రీ బాబూజీ మహరాజ్ తయారు చేసిన ప్రశిక్షకులను వారి ముఖాలమీద ఉన్న ప్రకాశం ద్వారా ప్రత్యేకంగా గుర్తించవచ్చు.

4. ప్రతినిధి, మాస్టర్ (బాబూజీ మహరాజ్) మీద భక్తి మరియు ప్రేమతో చేసిన తన స్వయం సాధన మరియు ప్రయత్నాల ద్వారా పొందిన శక్తిని మాత్రమే ప్రశిక్షకులకు బదిలీ చేయగలరు కాని మాస్టర్ (బాబూజీ మహరాజ్) వారికి ప్రసాదించిన శక్తిని బదిలీ చేయలేరు.

**5. ధ్యాన సమయంలో ప్రిసెప్టర్లు వారి శ్రద్ధను పూర్తిగా శ్రీ బాబూజీ మహరాజ్‌మీద ఉంచాలి. అలా శ్రద్ధ వహించితే శ్రీ బాబూజీ మహరాజ్ నుండి ప్రవహించే శక్తి తనంతటతానే అభ్యాసీలవైపుకు మళ్ళించబడుతుంది. అలాకాకుండా వారు తమ శ్రద్ధను ఇతర వ్యక్తులపై స్థిరపరచినట్లయితే ఆయన నుండి ప్రవహించు శక్తికి మాత్రమే ఆ ప్రవాహం పరిమితమవుతుంది.**

**6. ఏ అభ్యాసీలైతే మాస్టర్ (శ్రీ బాబూజీ మహరాజ్)నే చూస్తూ, 'వారి'పైననే ఆధారపడి ఉంటారో, అలాంటివారిని 'వారు' సరిదిద్దుతూ, వాళ్ళను సక్రమమైన మార్గంలో ఉంచుతారు మరియు నడిపిస్తారు.**

**7. ప్రశిక్షకుల విషయంలో కూడా అదే విధంగా జరుగుతుంది.**

8. ప్రతినిధి విషయంలో అటువంటి దిద్దుబాటు జరుగదు. అది ఒక ఉపేక్షించరాని (Serious) అంశం. ఆయన దానికై పరిహారం చెల్లించవలసియే ఉంటుంది. మరియు ప్రకృతి విధించు దండన ప్రాపంచికమైనదై ఉండదు.

9. ప్రతినిధి శ్రీ బాబూజీ మహరాజ్‌పట్ల శ్రద్ధను స్థిరపరచకపోతే అతని జ్ఞానం, అతని వ్యక్తిగత మనస్సు (Individual mind) ద్వారా నియంత్రించబడుతుంది. ఆ స్థితిలో ఆయన వాక్కులు, ప్రసంగాలు శ్రోతలను ప్రభావితం చేయవు. మరియు వాళ్ళు ప్రతినిధిపై విశ్వాసం కోల్పోతారు.

10. అభ్యాసీలు మరియు ప్రశిక్షకులు ఎవరైతే శ్రీ బాబూజీ మహరాజ్‌తో దీర్ఘకాలంగా సన్నిహితంగా ఉన్నారో మరియు 'వారి' వలన పోషించబడి మరియు శిక్షణ పొందారో అట్టివారు సత్యాన్ని వెల్లడి చేస్తూ ఉండాలి. ఇతరులను సక్రమ మార్గంలో నడవడానికి మార్గదర్శకత్వం కల్పించటం వారి కర్తవ్యం, బాధ్యత. అంతేగాని కేవలం ప్రేక్షకులుగా చూస్తూ ఉండిపోరాదు. శ్రీ బాబూజీ మహరాజ్ ప్రతి మానవుని దైవీయ మానవునిగా తీర్చిదిద్దటానికి మరియు ప్రపంచానికి సత్యయుగాన్ని తిరిగి వెనుకకు తీసుకొని వచ్చు దైవీయ సంకల్పంతోనే వారికి శిక్షణ ప్రదానం చేశారు. 'వారి' సంకల్పమే పని చేస్తూన్నది. ఆ సంకల్పంతోనే దివ్యత్వం 'శ్రీ బాబూజీ మహరాజ్'గా మానవ రూపం ధరించి క్రిందుకు దిగి వచ్చింది.

**--o0o--**

దైవం తనని దర్శించి దూరంగా ఉండేవాడిని మాత్రమే ప్రేమిస్తాడు. అంటే మానవుడిగా తన అంతస్తును పూర్తిగా తెలుసుకుని నిరంతర భక్తి సామ్రాజ్యంలోనే ఉంటూ, తన హృదయంలో దైవ స్మరణను సజీవంగా ఉంచుకోవాలని దాని అర్థం.

ooo

మనస్సు యొక్క క్రియారంగమే హృదయం. మనస్సు ఎల్లప్పుడూ అది ఉన్నట్లుగానే ఉంది. మనస్సు యొక్క క్రియారంగంగా హృదయాన్నే తీర్చిదిద్దాలి.

ooo

మానవుడు దైవాన్ని ఏ రూపంలో ఆరాధిస్తే 'అతడు' ఆ రూపంలో సాక్షాత్కరిస్తాడని గీత చెబుతోంది. కాని సామాన్యంగా ఉండే ఇబ్బంది ఏమిటంటే, ప్రజలు ఏ రూపంలోను దైవాన్ని ఆరాధించరు; దానికి బదులు కేవలం రూపాన్నే ఆరాధిస్తారు. అందువలన మూలంలో ఉన్న సత్‌తత్వం పూర్తిగా అదృశ్యమవుతుంది. నిజానికి ఇదే పెద్ద పొరపాటు.

**- బాబూజీ మహరాజ్**

# PRAYER

O, Master!
Thou art the real goal of human life,
We are yet but slaves of wishes,
Putting bar to our advancement,
Thou art the only God and Power,
To bring us upto that stage.

# ప్రార్ధన

ఓ నాధా !

నీవే మానవ జీవనమునకు యదార్ధ లక్ష్యము,

మా కోరికలు ఆత్మోన్నతికి ప్రతి బంధకములై యున్నవి

నీవే మా ఏకైక స్వామివి - ఇష్టదైవమవు

నీ సహాయము లేనిదే నిన్ను పొందుట అసంభవము.